ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

గురువారం 12.11.2026 | సంపుటి:13 సంచిక:112 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



భాజపాతో పోరాడేది కాంగ్రెస్ ఒక్కటే..

మిగిలిన పార్టీలన్నీ బీటీమ్‌లే : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ప్రజా ప్రభుత్వం మైనార్టీలకు అన్ని రకాలుగా అండగా ఉంటోంది
- 4 శాతం ప్రత్యేక రిజర్వేషన్‌తో మైనార్టీలకు పెరిగిన విద్య, ఉద్యోగ అవకాశాలు
- ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చాం
- టెక్నాలజీ ఎంత పెరిగినా బ్లూ కాలర్ జాబ్‌లకు ముప్పులేదు
- 'సర్'పేరుతో పేదల ఓట్లను భారీగా తొలగిస్తున్నారు
- బంజారాహిల్స్ జాతీయ విద్యా, మైనారిటీల సంక్షేమ దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సచార్ కమిటీ సూచన మేరకు మైనార్టీలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిందన్నారు. దీంతో మైనార్టీలకు విద్య, ఉద్యోగ అవకాశాలు పెరిగాయని తెలిపారు. బంజారాహిల్స్‌లో జాతీయ విద్యా, మైనారిటీల సంక్షేమ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. మైనార్టీశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆ శాఖ మంత్రి అజా రుద్దీన్‌తో కలిసి పరిశీలించారు.మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ తొలగించాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని సీఎం చెప్పారు. గుజరాత్‌లోనూ మైనార్టీలకు రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, మరి అక్కడెందుకు తొలగించడం లేదని నిలదీశారు. గుజరాత్‌లో తొలగించడం లేదు కానీ, మిగతా 2లో..

ఈ ప్రభుత్వం మైనార్టీలకు అన్ని రకాలుగా అండగా ఉంటోంది. తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నెహ్రూ మౌలానా అబ్దుల్ కలాం అజాద్‌ను విద్యాశాఖ మంత్రిగా చేశారు. ఆనాడు నెహ్రూ వేసిన పునాదుల వల్లే ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌లో వృద్ధి సాధించాం. దేశవ్యాప్తంగా యూనివర్సిటీలతోపాటు ఐఐటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రసిద్ధిగాంచిన వర్సిటీలు, ఐఐటీలను ఏర్పాటు చేసిందెవరో యువత గుర్తు చేసుకోవాలి. ఆనాడు పడిన పునాదుల వల్లే నేడు భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు సీఈవోలు అయ్యారు. ఇప్పుడు కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలు యువతలో పెరగాలి. మన యువతలో స్కిల్స్ పెంచేందుకే ఐటీఐలను ఏటీసీలుగా మార్చాం. మరిన్ని వసతులతో స్కిల్ యూనివర్సిటీ కూడా నిర్మిస్తున్నాం. ఏఐ వల్ల వైట్ కాలర్ జాబ్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి" - సీఎం రేవంత్ రెడ్డి,

బంజారా భవన్‌లో జాతీయ విద్యా దినోత్సవం డ మైనారిటీ సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వి.హనుమంతరావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి దానం నాగేందర్, ఫహీం ఖురేషీ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మైనారిటీ నేతలు.

హైదరాబాద్ నాగరికత మూసీ పరివాహకంలోనే అభివృద్ధి చెందింది

- శేరిలింగంపల్లికి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా తమ్మిడికుంట మారుతుంది
- 14 ఎకరాల చెరువును 30 ఎకరాలుగా తీర్చిదిద్దాం
- తమ్మిడి కుంటలో జమ్మిచెట్టును నాటి దసరాకు అలై బలై కార్యక్రమం నిర్వహించండి

2లో..

10+2 వచ్చే విద్యాసంవత్సరం నుంచి విధానం



- విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా సంస్కరణలు
- బోధన సిబ్బంది ప్రయోజనాలకు భంగం కలగనివ్వం
- విద్యా సంస్థల్లో మౌలిక వసతులకు పెద్దపీట
- యూనివర్సిటీ బోధనా సిబ్బంది నియామకాల ప్రక్రియ వేగవంతం
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

నేషనల్ హెరాల్డ్ వ్యవహారంలో

నయా పైసా తీసుకోలేదు

అప్పుడు రాహుల్ బర్త్‌డేకు ఎవరూ రాలేదు..

సంజయ్ మరణం తీరని లోటు: సోనియా గాంధీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాసిన తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' మార్కెట్లోకి విడుదల య్యాక రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఎన్నో సంఘటనల గురించి తెలియని విషయాల గురించి సోనియా గాంధీ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఇందులో భాగంగానే సుదీర్ఘ కాలంగా నడుస్తున్న నేషనల్ హెరాల్డ్ కేసు గురించి కూడా సోనియా గాంధీ తన మైఖరిని పుస్తకంలో స్పష్టంగా వెల్లడించారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1938లో ప్రారంభించిన నేషనల్ హెరాల్డ్ పత్రికను మిగతా 2లో..



యుద్ధ ఖైదీలను అప్పగించేందుకు ఓకే!

రష్యా, ఉక్రెయిన్ చర్చల్లో కీలక పురోగతి

కీవ్(జనంసాక్షి):అబుదాబీలో జరిగిన రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చల్లో కీలక పురోగతి చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో యుద్ధ ఖైదీలను అప్పగించేందుకు పరస్పరం అంగీకారం కుదిరింది. ఖైదీల విడుదలకు అంగీకరించినప్పటికీ.. దీనికి సంబంధించిన కచ్చితమైన సంఖ్యను మరికొన్ని గంటల్లో ఖరారు చేస్తామని అమెరికా ప్రతినిధి బృందం పేర్కొంది. యుద్ధ ఖైదీల అప్పగింతపై చర్చలు సానుకూలంగా జరిగాయని.. ఒక్కో వైపు నుంచి సుమారు 1,000 నుంచి 1,500 మంది యుద్ధ ఖైదీలను విడుదల చేసే అంశంపై సమాలోచనలు మిగతా 2లో..

కాశ్మీర్‌లో మళ్లీ ఉగ్రదాడి



ముగ్గురు జవాన్లకు గాయాలు

శ్రీనగర్(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్ర దాడి కలకలం రేపింది. కుల్గాం జిల్లాలోని సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై బుధవారం ఉగ్రవాదులు దాడి చేశారు. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు.. భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపారు. దీంతో సీఆర్పీఎఫ్ జవాన్లు ఎదురుకాల్పులు జరపగా.. ఉగ్రవాదులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. మిగతా 2లో..

కాంగ్రెస్ రాష్ట్రాన్ని నాశనం చేస్తోంది



ఏపీ నీటిని ఎత్తిపోసుకుంటే రేవంత్ చూస్తూ కూర్చున్నారు

- ముఖ్యమంత్రికి రైతు సంక్షేమం కన్నా రాజకీయమే ముఖ్యమైంది
- కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో నాలుగున్నర లక్షల కోట్ల అప్పు
- మిగిలిన రైతు రుణమాఫీ పూర్తి చేయాలి • నిర్మల్ రైతు గర్జన సభలో కేటీఆర్



నిర్మల్(జనంసాక్షి):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతు సంక్షేమం కన్నా రాజకీయమే ముఖ్యమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నిర్మల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతు గర్జన మహాసభలో కేటీఆర్ ప్రసంగించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదని పాలకులు తెచ్చిన కరవని ఆరోపించారు. పట్టిసీమ దగ్గర ఏపీ నీళ్లు ఎత్తిపోస్తుంటే, కన్నెపల్లి దగ్గర రేవంత్ ఎందుకు ఎత్తిపోయడం లేదన్నారు. ఆంధ్రాకు నీళ్లు, తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు, నీళ్లపై పట్టింపు లేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ రైతుల కోసం కేసీఆర్ సదర్మాట్ డ్యాం కట్టినా కాంగ్రెస్‌కు, దాన్ని వినియోగించుకోవడం రావడం లేదని కేటీఆర్ విమర్శించారు. కాళేశ్వరం నుంచి నీళ్లు నిజాంసాగర్‌కు ఎత్తిపోస్తే, ఎల్‌నినో వచ్చినా ఇన్ని తిప్పలు వచ్చేవి కాదన్నారు. రైతుల కన్నీళ్ల కన్నా తన గడ్డంమీదే ముఖ్యమంత్రికి మిగతా 2లో..



హైడ్రా కమిషనర్‌ను కోర్టులో హాజరుపరచండి

డీజీపీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి):
హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను వచ్చే మంగళవారం కోర్టులో హాజరుపరచాలని డీజీపీని హైకోర్టు ఆదేశించింది. కోర్టు సమన్లు జారీ చేసినా విచారణకు హాజరుకాకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్ పిటిషన్లను కొట్టివేసింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్ కోరారు. శంషాబాద్ తహసీల్దార్‌ను కోర్టులో హాజరుపరచాలని సీపీని ఆదేశించారు.

కరువునూ బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది

కృష్ణా, గోదావరి జలాల మళ్లింపుపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు

- కాంగ్రెస్ హయాంలో జల వినియోగం, సాగు విస్తీర్ణం, వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణ పెరిగాయి
- యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయండి
- జనవరి 31లోగా 10 వేల ఎకరాలకు కృష్ణా జలాలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కోదాడ/హుజూర్‌నగర్ (జనంసాక్షి):
కరువును రాజకీయ ఆయుధంగా వాడుకుంటున్న బీఆర్ఎస్ నేతలు తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు మళ్లిస్తున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు.ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తే ముప్పున్న వేళ రైతులకు అండగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం వారి కష్టాల నుంచి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు.బుధవారం కోదాడ, హుజూర్ నగర్ లో పర్యటించిన మిగతా 2లో..



రామమందిర విరాళాల లెక్కలను

బహిర్గతం చేయాలి

ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నేతల పాత్రపైనా విచారణ జరగాలి.. కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం వ్యవహారంపై కాంగ్రెస్ మరోసారి విమర్శలు గుప్పించింది. ఈ కేసులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), బీజేపీ, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నేతల పాత్రపైనా విచారణ జరగాలని డిమాండ్ చేసింది. ఆలయ నిర్మాణం, నిర్వహణ, విరాళాల సేకరణ, లెక్కింపు, బ్యాంకులో జమ చేసే మిగతా 2లో..



దావోస్ తరహాలో విధాన చర్చలకు వేదికగా

భారత్ సమిట్ 2.0

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి):
ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపేందుకు 'భారత్ సమిట్ 2.0' వేదికగా నిలవనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ వేదికగా సమిట్ నిర్వహించనున్న నేప థ్యంలో ఈ కార్యక్రమం సన్నద్ధతపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దావోస్ తరహాలో ప్రపంచ విధాన చర్చలకు ఈ సమిట్ వేదికగా నిలు స్తుందని భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, అ హింస, అలీన విధానం, మిశ్రమ ఆర్థిక విధానాలే ప్రపంచానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని చెప్పారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై అంతర్జాతీయ చర్చలకు ఈ సమిట్ ఉపయో గపడుతుందని భట్టి అన్నారు. భారత్ సమిట్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానిస్తే తప్పేంటని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. భాజపా నేతలు అవగాహనరాహిత్యంతో మాట్లాడు తున్నారని విమర్శించారు. సుమారు 70 దేశాల నుంచి ప్రతిని ధులు దీనికి హాజరవుతారని నేతలు తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వరకు ఈ సమిట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.



ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం





న్యూఢిల్లీ(జనంసాక్షి):
కేంద్ర మంత్రివర్గం బుధవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా రబీ సీజన్‌లో ఎరువుల కోసం రూ. 62,370 కోట్ల సబ్సిడీకి ఆమోదం తెలిపింది.రబీ సీజన్‌లో ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలి పింది. అలాగే నార్త్, సౌత్ బ్లాక్‌లను మ్యూజియంగా మా ర్చేందుకు అనుగుణంగా యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు నిర్ణయించింది. నోయిడా సెక్టార్ 51 నుంచి గ్రేటర్ నోటియా సెక్టార్? 4 వరకు రూ.2,390 కోట్లతో మెట్రో రైలు మార్గం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. స్టాండ్?-అప్ ఇండియా పథకానికి, అలాగే ముద్రా యోజన కింద సూక్ష్మ యూనిట్లకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌ను 5 సంవత్సరాలపాటు కొనసాగించేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. వాటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

ముద్రా రుణాలు

సూక్ష్మ పరిశ్రమల కోసం ఉద్దేశించిన 'క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్' (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని కేంద్ర కేబినెట్ మరో 5ఏళ్లపాటు పొడిగించింది. అంటే 2031 మార్చి వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. పీఎం ముద్ర యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్? వరకు బ్యాంకులు, రుణ సంస్థలు ఏకంగా 60.36 కోట్లకుపైగా రుణాలు మంజూరు చేశాయి. వాటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లు ఉంటుంది. బ్యాంకులు లేదా రుణ సంస్థలు ఇచ్చే ఈ రుణాలకు డిఫాల్ట్ (రుణాలు తిరిగి చెల్లించలేకపోవడం) మిగతా 2లో..

వచ్చే విద్యాసంవత్సరం నుంచి 10+2 విధానం

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి టెన్ ప్లస్ టూ (10+2) విధానం అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు.విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా సంస్కరణలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు నాణ్యమైన విద్యా బోధన ద్వారా, ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. విద్యా శాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది నుంచి 12వ తరగతి వరకు విధానాన్ని అమలు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న ప్రగతిని అధికారులు వివరించారు. నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ, 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విధానాన్ని అమలు చేయాలని సీఎం ఆదేశించారు. 12వ తరగతి వరకు విద్యార్థులను భాషా, సమాచార నైపుణ్యాలపై పూర్తి పట్టు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. 12 వ తరగతి తర్వాత తమకు నచ్చిన సబ్జెక్టును ఎంచుకొని అందులోని నిపుణులుగా మారేందుకు విద్యార్థులకు అవకాశం ఉండాలన్నారు. పదో తరగతి తర్వాత సగటున 40 శాతం మంది విద్యార్థులు చదువు మానేస్తున్నారని, అందులో అత్యధికులు బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలే ఉంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 12వ తరగతి వరకు కొనసాగింపు ఉన్న కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో డ్రాపౌట్స్ సంఖ్య చాలా స్వల్పంగా ఉంటోందన్నారు. దేశంలో 18 రాష్ట్రాల్లో 12వ తరగతి వరకు విధానమే అమల్లో ఉందన్నారు. విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జూనియర్ కళాశాలల్లోని లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ, రిటైర్‌మెంట్ బెనిఫిట్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని సీఎం అన్నారు. ఆయా వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూళ్లను పూర్తి వసతులతో నిర్మించడానికి అవసరమైన కార్యాచరణ వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వాటి నిర్మాణాలకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని సీఎం తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్స్ స్కూళ్లలో మరుగుదొడ్లు నిర్మించాలని, వాటికి పూర్తి స్థాయిలో నీటి వసతి కల్పించాలని సీఎం ఆదేశించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణ పురోగతిపై సీఎం సమీక్షించారు. జఎఓఖీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, నిర్దేశిత సమయంలో నిర్మాణాలు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.



హైదరాబాద్ నాగరికత మూసీ పరివాహకంలోనే అభివృద్ధి చెందింది



శేరిలింగంపల్లి, నవంబర్ 11 (జనంసాక్షి) : ప్రజా ఉపయోగ కార్యక్రమాలలో ముందుగా కొందరికి ఖేదం కలిగినా... ముందు తరాలకు అందే ఫలాలతో చివరకు అందరికీ మోదం కలగడమే దాని ప్రధాన ఆశయమని, తమ్మిడి కుంట చెరువు విషయంలోనూ తప్పకుండా ఇదే జరిగి తీరుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో ప్రముఖ సినీ నటుడు నాగార్జున వంటి కొందరు ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాల వల్ల కొంత ఇబ్బందిపడినా ఆశయాన్ని అర్థం చేసుకొని సహకరించడంతో 14 ఎకరాలున్న తమ్మిడిగుంట 30 ఎకరాలుగా రూపుదిద్దుకోవడం జరిగిందని, ఇందుకు హీరో నాగార్జున సహకారం మరువలేనిదని, తద్వారా కొన్ని తరాలు బతికేస్తాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఎం సభలో ప్రసంగిస్తూ కొన్ని సందర్భాలలో చలోక్తులు... కొన్ని సందర్భాలలో రాజనీతిని... మరికొన్ని సందర్భాలలో దూరదృష్టిని ప్రస్తావించి తన ప్రసంగంతో ఆద్యంతం ఆకట్టుకోవడం విశేషం.

హైదరాబాదు నగరం లేక్స్ అండ్ రాక్స్ సిటీ...

హైదరాబాదు నగరం ఎంతో ప్రత్యేకమైనదని, దక్కన్ పీఠభూమి నేపథ్యంలో ఇక్కడ సుందరమైన కొండలు చాలా ఉన్నాయని, విమానంలో ఆకాశవీధిలో విహరిస్తుంటే హైదరాబాద్ నగరంలో చక్కని శిల్పాలు, సుందరమైన తోటలు, అందమైన సరస్సులు, హిమాయత్ సాగర్, గండిపేట్ వంటి సహజ జంట జలాశయాలు ఎంతో అద్భుతంగా కనిపిస్తుంటాయని ఇక్కడ పుట్టడం ఒక అదృష్టంగా భావించవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరం నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాదులో దాదాపు 1372 చెరువులు ఒకప్పుడు అలరారేవని, నాటి నుండి కొంత పాలకుల నిర్లక్ష్యం, కొంతమంది కబ్జారాయుళ్ల స్వార్థం, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ప్రస్తుతం అవి 50 శాతానికి తగ్గిపోవడం శోచనీయమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తమ్మిడికుంట, సున్నం చెరువు, కేబుల్ బ్రిడ్జి, గంగారం, గురునాథం చెరువు, ఫ్యాక్షసాగర్ వంటి దాదాపు 20 చెరువులను అభివృద్ధి పథాన పరుగులెత్తిస్తున్నామని, కొన్ని చెరువులు 500 ఎకరాలతో మినీ ట్యాంక్ బండ్ లను తలపించేలా సుందరీకరణకు నోచుకొని అతి త్వరలో ప్రజల ముందుకు రానున్నాయని ముఖ్యమంత్రి భరోసాని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ నగర ప్రజలు హైడ్రాను కొంత స్వీకరించి మరికొంత వ్యతిరేకించి ఇబ్బందులకు గురి చేయడం జరిగిందని, శేరిలింగంపల్లి ప్రజలు మాత్రం హైడ్రాకు నీరాజనాలు అందిస్తారనడంలో సందేహం లేదన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని, ఆయన అనుకున్న పనులను, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ రోజుకు 18 గంటలు పనిచేస్తున్నందున ముఖ్య మంత్రి స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని సభాముఖంగా ధీమాను వ్యక్తం చేశారు. తమ్మిడి కుంట చెరువు వద్ద జమ్మి చెట్టును నాటి దానిని అభివృద్ధి చేయడం ద్వారా అక్కడ అలైబలై కార్యక్రమాన్ని దసరా పండుగ రోజున నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగిందని తప్పకుండా దానిని నెరవేర్చి రాష్ట్ర ముఖ్యమంత్రిని మరోసారి ముఖ్యమంత్రి హోదాలో అలైబలై కార్యక్రమానికి ఆహ్వానిస్తామని అరికపూడి చమత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక అతిథి నాగార్జున, పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం నరేందర్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె. రఘువీరారెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, కమ్మ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, బిసి కార్పొరేషన్ చైర్మన్ జేరిపేటి జైపాల్, ఎమ్మెల్యేలు అనిల్ యాదవ్, కోట లక్ష్మీకాంతరావు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, ఫయీమ్ ఖురేషి, రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ఖైదీలను అప్పగించేందుకు ఓకే!

చేశామని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.యుద్ధాన్ని విరమింపజేసే లక్ష్యంతో అమెరికా మధ్యవర్తిత్వంలో అబుధాబీ వేదికగా రెండు రోజులపాటు త్రైపాక్షిక చర్చలు జరిగాయి. అమెరికా తరపున అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్‌లు ఇందులో పాల్గొనగా.. రష్యా బృందానికి వ్లాదిమిర్ మెడిన్‌స్కీ, ఉక్రెయిన్ తరపున రుస్తెం ఉమెరోవ్ నేతృత్వం వహించారు. గతంలో విఫలమైన శాంతి ప్రయత్నాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని అమెరికా ప్రతినిధి బృందం పేర్కొంది. రెండురోజుల చర్చలు ముగిసిన నేపథ్యంలో నవంబర్ 12న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో, ఆ తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అవుతామని తెలిపింది.

రామమందిర విరాళాల లెక్కలను బహిర్గతం చేయాలి

ప్రక్రియల్లో ఆయా సంస్థలకు చెందినవారే కీలక బాధ్యతల్లో ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. విరాళాలకు సంబంధించిన పూర్తి ఆర్థిక లెక్కలను బహిర్గతం చేయాలని, దర్యాప్తు పరిధిని విస్తరించాలని కోరారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్? చేశారు.'ఆలయ విరాళాల లెక్కల్లో అవకతవకలు జరుగుతున్నాయని 2021లోనే అప్పటి ఖాతాల అధికారి మహిపాల్ సింగ్ గుర్తించి, ట్రస్టు ప్రతినిధులు చంపత్ రాయ్, గోపాల్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు మీడియా కథనాలు చెబుతున్నాయి. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా ఫిర్యాదు చేసిన అధికారినే విధుల నుంచి తొలగించారు. ఇంతకుముందే అక్రమాల సమాచారం అందినప్పుడు ట్రస్టు ప్రతినిధుల పాత్రపై ఎందుకు విచారణ జరగలేదు. ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ, దర్యాప్తు సంస్థల నిర్ధారణ ఇంకా కీలకం. ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఇంజినీర్ దినానాథ్ వర్మ కూడా ట్రస్టు కార్యాలయంలో పనుల కోసం 40 శాతం కమిషన్ అడిగారు. దీనికి సంబంధించిన ఆడియో రికార్డింగ్‌ను చంపత్ రాయ్‌కు వినిపించిన తర్వాత తననే ప్రాజెక్టు నుంచి తొలగించారని వర్మ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఆ ఆరోపణలపై చంపత్ రాయ్ నేరుగా విచారించారా? అక్రమాల గురించి ముందే తెలిసి ఉంటే ఆయనతో పాటు అనిల్ మిశ్రా, గోపాల్ రావులను నిందితులుగా కాకుండా సాక్షులుగా ఛార్జిషీట్‌లో ఎందుకు చేర్చారు' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

భాజపాతో పోరాడేది కాంగ్రెస్ ఒక్కటే..

తెలంగాణలో రిజర్వేషన్‌లు తీసేస్తామని బీజేపీ నేతలు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీలను ఓటుహక్కుకు కూడా దూరం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. సర్ పేరిట మైనార్టీలు, ఎస్టీలు, ఆదివాసీలు, పేదల ఓట్లను భారీగా తొలగిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాజకీయం చేస్తోంది కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోందన్న రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీని ఓడించి గద్దె దించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. దిల్లీకి వెళ్లి మోదీ ఎదుట సాగిలపడిందో ఎవరో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. కొందరు నేతలు మైనార్టీల ముందు ఒకలా దిల్లీకి వెళ్లాక మరోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మోదీ ముందు తలవంచే పార్టీలకు కాంగ్రెస్ భిన్నంగా ఉంటుందని స్పష్టం చేశారు. మైనార్టీ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లపైనా బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు.మైనార్టీ విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తోందని, క్రికెట్‌లో రాణించిన సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చి గౌరవించామన్నారు. షబ్బీర్, అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌కు టికెట్లు ఇచ్చామని, వాళ్లు గెలవకపోయినా, ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని గుర్తు చేశారు. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామని, మీరాలం చెరువును అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మూసీలో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేస్తున్నామని, మూసీ సుందరీకరణ పూర్తయితే మూసీ, పాతబస్తీని చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తారని వెల్లడించారు. మూసీ సుందరీకరణ పూర్తైతే హైదరాబాద్‌లో నైట్ ఎకానమీ పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి

విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. మైనార్టీలకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లపైనా భాజపా రాజకీయం చేస్తోంది. క్రికెట్‌లో రాణిస్తున్న సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌కు పార్టీ టికెట్లు ఇచ్చాం. వారికి విజయం దక్కనప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చాం. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నాం. మూసీలో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేస్తున్నాం. మూసీ సుందరీకరణ పూర్తయితే ఆ ప్రాంతంతో పాటు పాతబస్తీని చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తారు. మూసీ ప్రాజెక్టు పూర్తయితే నగరంలో నైట్ ఎకానమీ పెరుగుతుంది"అని రేవంత్ అన్నారు.

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

రిస్క్ లేకుండా సీజీఎఫ్ ఎంయూ పథకం రక్షణ లభిస్తుంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో దీనికి రూ.5వేల కోట్ల మేర నిధులు కేటాయించేందుకు ఆమోదం లభించింది. దీని ద్వారా రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రాయోజన రుణాలకు ఊతం లభిస్తుంది. 2016 జనవరిలో ప్రారంభమైన ఈ సీజీఎఫ్?ఎంయూ అనేది ముద్ర యోజన రుణాల వృద్ధిని వేగవంతం చేయడంలో ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.రబీ సీజన్ 2026-27 కోసం ఫాస్పేట్, పొటాష్ ఎరువులకు రూ.62,370 కోట్ల సబ్సిడీ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ దీనిపై మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. అందుకే రైతులకు తగినంత ఎరువుల సబ్సిడీ ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. 50 కేజీల డీఏపీ బస్తా ధర మునుపటిలాగనే రూ.1,350 ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర కేబినెట్ స్టాండప్ ఇండియా పథకం గడువును 2031 మార్చి 31 వరకు అంచే ఐదేళ్లపాటు పొడిగించింది. మహిళలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ)ల్లోని వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి, అలాగే వారిలో పారిశ్రామిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా రానున్న 5ఏళ్లలో అదనంగా మరో 2.5 లక్షల మంది వ్యాపారవేత్తలకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు.2016 ఏప్రిల్‌లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలకు ఈ రుణాలు అందించారు. ఉత్పాదక, సేవా, వాణిజ్య రంగాలు లేదా వ్యవసాయ అనుబంధ రంగాల్లో సరికొత్త గ్రీన్‌ఫీల్డ్ సంస్థలను స్థాపించడానికి గాను, ప్రతి షెడ్యూల్డ్? కమర్షియల్? బ్యాంకు శాఖ నుంచి కనీసం ఒక ఎస్సీ లేదా ఎస్టీ లబ్ధిదారునికి, కనీసం ఒక మహిళకు రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు అందించడమే లక్ష్యంగా ఈ స్టాండప్ ఇండియా పథకం పనిచేస్తుంది.

కాశ్మీర్‌లో మళ్లీ ఉగ్రదాడి

వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. క్విక్ రియాక్షన్ టీమ్‌తో కలిసి క్యాంప్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టాయి. నిందితులను పాకిస్థానీ ముఠాకు చెందిన ఉగ్రవాదులుగా అనుమానిస్తున్నారు.

కరువునూ బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది

మంత్రి పలు ఎత్తిపోతల పథకాల పనులతో పాటు యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణాన్ని పరిశీలించారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పలువురు అధికారులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో పెరిగిన జల వినియోగం

2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తెలంగాణ కృష్ణా, గోదావరి జలాలను బీఆర్ఎస్ హయాం కంటే ఎక్కువగా వినియోగించుకుంది.సాగు విస్తీర్ణం, వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణ పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని మళ్లిస్తున్నారన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారం" అని ఉత్తమ్ స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో పేరుకుపోయిన సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ధాన్యం కొనుగోళ్ల ద్వారా రైతులకు సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించినట్లు మంత్రి తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం సొమ్మును 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. సన్న రకాల వరి సాగును ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రవేశపెట్టామని వివరించారు.

జనవరి 31లోగా 10 వేల ఎకరాలకు కృష్ణా జలాలు

పులిచింతల జలాశయం తీర గ్రామాల రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని జనవరి నెలాఖరులోగా ప్రారంభిస్తామని ఉత్తమ్ ప్రకటించారు. సవరించిన ఆయకట్టు పరిధిలోని 10 వేల ఎకరాలకూ 2027 జనవరి 31 నాటికి కృష్ణా జలాలు అందించాలని అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు.ఈ పనులను పలమార్లు పరిశీలించాను. ప్రతిసారీ గడువు మారుతోంది. ఇకపై అలా జరగకూడదు. జనవరి నెలాఖరులోగా మొత్తం 10 వేల ఎకరాలకూ నీరు చేరాలి" అని తేల్చిచెప్పారు. గడువు తప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళ్లెదుటే కృష్ణా నది ప్రవహిస్తున్నా దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోని వేలాది రైతు కుటుంబాలకు ఈ పథకంతో ఊరట లభిస్తుందని, ఏటా రెండు పంటలు పండించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.ఈ పథకంతో జాన్‌పహాడ్, పాలకవీడు, కోమటికుంట, ఓతులపాలెం, ఎల్లాపురం, సజాపురం, హనుమాయగూడెం, నాగిరెడ్డిగూడెం, గుడుగుంట్లపాలెం, గుండ్లపహాడ్, చెరువుతండా, అలింగాపురం, గుండెబోయినగూడెం, రాఘవాపురం, మిగడంపాడు తండా గ్రామాలకు ప్రయోజనం చేకూరనుంది.పంపులు, మోటార్లు ఇప్పటికే పనుల ప్రదేశానికి చేరాయని, పంప్‌హౌస్ పనులు తుది దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు. డిసెంబరు నెలాఖరులోగా పంప్‌హౌస్, జనవరి నెలాఖరులోగా విద్యుత్ ఉపకేంద్రం పనులు పూర్తి చేసి, నిర్ణీత గడువులో పథకాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. కల్మల తండా వైపు నీరు అందించేందుకు బుద్ధారపాలెం వద్ద కిలోమీటరు మేర కాలువ అనుసంధాన పనులు పూర్తి చేయాలన్నారు. జాన్‌పహాడ్, మునిమోపుల, తుమ్మల సహా ఆరు చెరువులను ఈ పథకం ద్వారా నింపనున్నట్లు వివరించారు.జాన్‌పహాడ్ తన ప్రాధాన్య పథకాల్లో ఒకటని ఉత్తమ్ చెప్పారు. కృష్ణా నదికి చేరువలో ఉన్నా ఇన్నాళ్లూ సాగునీరు అందని భూములకు నీటిని ఎత్తిపోయడం తనకు ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. ముక్త్యేశ్వరం సహా స్థానిక ఎత్తిపోతల పథకాలు రైతు కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురాగలవని పేర్కొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయండి

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే యాసంగిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశముందని ఉత్తమ్ తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని, సాగునీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తకుండా అందుబాటులో ఉన్న జలాలను సమర్థంగా వినియోగించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోందన్నారు. ఆహార కొరత తలెత్తకుండా ప్రజాపంపిణీకి అవసరమైన సన్నబియ్యం సహా తగిన ఆహార ధాన్యాల నిల్వలను సిద్ధం చేసినట్లు తెలిపారు.



రాష్ట్రాన్ని కాంగ్రెస్ నాశనం చేస్తోంది

దృష్టి ఎక్కువగా ఉందని కేటీఆర్ ఆక్షేపించారు. ఎల్?నినో గురించి సీఎం రైతులకు ధైర్యం చెప్పడం లేదని, కరోనా సమయంలో కేసీఆర్ అందరికీ అండగా నిలిచారని వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఊళ్లో నాటకాలు వేయాలని ముఖ్యమంత్రి చెప్తున్నారని, నాటకాలు, ఉపన్యాసాలతో రైతుల కడుపు నిండదన్నారు.

'కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో నాలుగున్నర లక్షల కోట్ల అప్పు

ఆదిలాబాద్‌జిల్లాలోని గూడేలను కేసీఆర్ గ్రామపంచాయతీలు చేశారని కేటీఆర్? అన్నారు. ఆదిలాబాద్‌లోని 4.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ పోడు పట్టాలిచ్చారన్నారు. తాము ప్రతి గ్రామానికో ట్రాక్టర్ కొనిస్తే, వాటికి డీజిల్ పోయడానికి కూడా కాంగ్రెస్?కు చేతకావడం లేదన్నారు. మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4.5 లక్షల కోట్లు అప్పుచేసిందని ఆరోపించారు. అమ్మఒడి వాహనాలు, గర్భిణులు, బాలింతలకు ప్రసూతి సహాయం ఆపేశారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే విద్యా భరోసా ఇస్తామని, ఇప్పుడు రూ.12 వేల కోట్లు ఫీజు రియంబర్స్?మెంట్ బాకీలుపెట్టారని ఆరోపించారు.

మిగిలిన రైతు రుణమాఫీ పూర్తి చేయాలి

ఉద్యోగ ప్రకటనలు ఇవ్వకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను రేవంత్ ప్రభుత్వం ఆగం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు, రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. సంక్షేమాలన్నీ ఆపేశారని, ఆ డబ్బులన్నీ ఎక్కడికి వెళ్లాయని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్ మాయమైందని, కేసీఆర్ కిట్ ఆగమైందన్నారు. బ్యాంకు రుణాలు వెంటనే రీ షెడ్యూల్ చేయాలని సభా వేదికగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన రైతు రుణమాఫీ కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిర్మల్‌కు బీజేపీ ఎమ్మెల్యే ఏమీ చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. మన్యం ప్రజలను అభివృద్ధి చేసేందుకు,కేసీఆర్ నిర్మల్‌ను జిల్లా చేశారన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు, 8 ఎంపీలు అష్ట గ్రహాల్లా మారారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు

నేషనల్ హెరాల్డ్ వ్యవహారంలో నేనూ, రాహుల్ నయా పైసా తీసుకోలేదు

పునరుద్ధరించడం అవసరం అని తాము భావించామని తెలిపారు. అయితే ఈ నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరణ ప్రక్రియ (రివైవల్ ప్రాసెస్) ద్వారా తన కుమారుడు రాహుల్ గాంధీ కానీ, తాను కానీ ఒక్క పైసా కూడా లబ్ధి పొందలేదని తేల్చిచెప్పారు.ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి అధికార బీజేపీ ఆరోపణలు చేయడంతో పాటు దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలు కూడా చేస్తోందని సోనియా విమర్శించారు. బీజేపీ తన కుమారుడు రాహుల్ గాంధీని టార్గెట్‌గా చేసుకొని వేధించిన తీరును కళ్లారా చూడటం తన వల్ల కాలేదన్నారు. తన కుమారుడి ప్రతిష్ఠను మసకబార్చేందుకు పెద్ద ఎత్తున ఫండ్ క్యాంపెయిన్స్ నిర్వహించాయని, వెనుక ఎన్నో కుట్రలు జరిగాయని ఆమె ఈ పుస్తకంలో పేర్కొన్నారు.

అప్పుడు రాహుల్ బర్త్‌డేకు ఎవరూ రాలేదు..: సోనియా గాంధీ

రాజకీయాల ప్రభావం తమపైనే కాకుండా తమ పిల్లలపైనా ఉండేదని కాంగ్రెస్ అగ్రనేత సోనియా తెలిపారు. అందుకు సంబంధించిన విషయాలను తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో గుర్తు చేసుకున్నారు. అప్పటి వరకు తమతో సన్నిహితంగా ఉన్న చాలామంది వ్యక్తులు 1977లో ఇందిరా గాంధీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత క్రమంగా తమను దూరం పెట్టడం ప్రారంభించారన్నారు. ఇటువంటి చర్యలు చిన్నారులైన తమ పిల్లలు రాహుల్, ప్రియాంకలను కూడా ఎంతగానో బాధించాయని గుర్తు చేసుకున్నారు. "1977లో జరిగిన ఎన్నికల్లో అత్తమ్మ ఇందిరా గాంధీ ఓడిపోయారు. దీంతో ఇంట్లో అందరం బాధ పడ్డాం. అదే సమయంలో రాహుల్ పుట్టిన రోజు కావడంతో ఇంట్లోనే తన స్నేహితులను పిలిచి.. చిన్న పార్టీ చేయడానికి ఏర్పాట్లు చేశాం. కొంతసేపటికి రాహుల్ ప్రాణ స్నేహితుడు సిద్ధార్థ్ ఒక్కడే వచ్చాడు. ఎంతసేపటికీ ఇతరులు ఎవరూ రాలేదు. ఏదో పొరపాటు వల్ల పిల్లలు రాలేదని భావించి, వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేశాం. అయితే వారు ఉద్దేశపూర్వకంగానే తమ పిల్లలను మా ఇంటికి పంపనట్లు తెలుసుకొని షాక్ అయ్యాను. ఏడేళ్ల చిన్నారికి స్నేహితులతో ఉన్న బంధం రాజకీయాల వల్ల కలుషితమైపోయిందని తెలిసి బాధ పడ్డాం. ఈ ఘటనతో రాహుల్ తీవ్ర మనస్తాపానికి గురవడంతో అత్తమ్మ, రాజీవ్ ఓదార్చారు. మానవ సంబంధాల విషయంలో అదే రాహుల్ నేర్చుకున్న తొలి బాధాకరమైన పాఠం. అది అంతటితో ఆగలేదు. స్కూల్‌లోనూ అత్తమ్మ, రాజీవ్‌లపై తోటి విద్యార్థులు చేసే వ్యాఖ్యలు విని రాహుల్, ప్రియాంక చాలా బాధ పడేవారు. ఆ సమయంలో వారిని ఓదార్చి.. మన కుటుంబ సభ్యులు దేశం కోసం ఎంత శ్రమించారో తెలియజేశా. 1978 నవంబర్‌లో చిక్కమగళూరు ఉప ఎన్నికలో ఇందిరా గాంధీ విజయం సాధించిన తర్వాతే.. పరిస్థితిలో మార్పు వచ్చింది" అని సోనియా వివరించారు.

సంజయ్ మరణం మా కుటుంబానికి తీరని లోటు..

1980 జూన్‌లో పిల్లలకు సెలవులు ఉండడంతో నేను, రాజీవ్, రాహుల్, ప్రియాంకలను తీసుకొని ఇటలీలోని మా అమ్మగారింటికి వెళ్లాం. పిల్లలను ఓర్బాస్సానోలో ఉన్న నా తల్లిదండ్రుల వద్ద వదిలి మేము ఫ్లోరెన్స్ ప్రాంతానికి వెళ్లాం. జూన్ 23న మా అమ్మకు దిల్లీ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి ఏం చెబుతున్నారో అర్థం కాకపోవడంతో ఆమె ఫోన్‌ను పదేళ్ల రాహుల్ కు ఇచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి ఇందిరా గాంధీ వ్యక్తిగత కార్యదర్శి ఆర్.కె. ధావన్. విమాన ప్రమాదంలో సంజయ్ చనిపోయాడని ఆయన రాహుల్‌కు చెప్పగానే తాను విన్న విషయాన్ని నమ్మలేకపోయాడు. వెక్కివెక్కి ఏడుస్తూ బాబాయ్ చనిపోయాడు అని రాహుల్ ఇటాలియన్‌లో పదే పదే చెప్పాడు. ఆ వార్త వినగానే రాజీవ్ షాక్‌తో నిశ్చేష్టులయ్యారు. ఆయనను, రాహుల్‌ను ఓదార్చడం ఎవరితరం కాలేదు.మేము ఇటలీ వెళ్లడానికి ముందే విమానాన్ని నడిపే విషయంలో సంజయ్‌ను రాజీవ్ హెచ్చరించారు. తగిన ప్రాథమిక శిక్షణ లేకుండా విమానాన్ని నడపడంలో తొందరపడవద్దని సూచించారు. అయినప్పటికీ విమానాన్ని నడిపి ప్రమాదానికి గురయ్యారు. సంజయ్ చనిపోయిన సమయానికి ఆయన భార్య మేనకా గాంధీకి 23 ఏళ్లే. అప్పటికి కేవలం మూడు నెలల వయసున్న అతడి కుమారుడు వరుణ్ గాంధీ తండ్రిలేనివాడవ్వడం అందరినీ కలిచివేసింది' అని రాసుకొచ్చారు.



సోనియా గాంధీ ఆత్మకథ ఆధారంగా
సినిమా తీస్తా

సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలు

- సోనియా గాంధీ తాను స్వయంగా రాసిన 'బిలాంగింగ్- ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం పై జగ్గారెడ్డి కీలక ప్రకటన

సంగారెడ్డి నవంబర్ 11 (జనం సాక్షి) : కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ స్వయంగా రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఆధారంగా ఆమె జీవితాన్ని తెలుగులో తెరకెక్కిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రకటించారు. బుధవారం పి ఎస్ ఆర్ గార్డెన్ లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ. చిత్రానికి సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలుగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాణానికి రూ. 2 కోట్లు ఇస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ జులకంటి అంజనేయులు ప్రకటించారు. సినిమా నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేందుకు 50 మందితో కమిటీ ఏర్పాటు చేయాలని జగ్గారెడ్డి సూచించారు. ఈ కమిటీని గాంధీ భవన్ పీఆర్వో హరిప్రసాద్ పర్యవేక్షిస్తారని జగ్గారెడ్డి తెలిపారు. నాయకులు నిధులు సిద్ధం చేసుకోవాలని కోరారు. "ఎన్నికలకు ఖర్చు పెడతారు కదా. దీన్నీ అలాంటి ఖర్చుగానే అనుకోండి. బడ్జెట్ సమీకరించి, మంచి దర్శకుడిని ఎంపిక చేద్దాం" అని కార్యకర్తలతో అన్నారు. ఏర్పాట్లు పూర్తయ్యాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆహ్వానించి, వారి చేతుల మీదుగా షూటింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. సోనియాగాంధీ జీవితాన్ని కార్యకర్తలు మరింత దగ్గరగా తెలుసుకునేందుకు ఆమె పుస్తక ప్రతులను తెప్పించి పంపిణీ చేస్తామన్నారు. ఈనెల 25న సంగారెడ్డి పట్టణంలో జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయి రెడ్డి వివాహానికి ఆహ్వాన పత్రికలు ప్రతి ఒక్కరు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు

ఐటీ, పారిశ్రామిక రంగాల్లో ఆదిలాబాద్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

రూ.57.85 కోట్లతో నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభం

- 3 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు
- త్వరలో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




మావల నవంబర్ 12(జనం సాక్షి) : ఆదిలాబాద్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి, స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.58.85 కోట్లతో నిర్మించిన నూతన ఐటీ టవర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిధుల కొరతతో నిలిచిపోయిన ఐటీ టవర్ నిర్మాణాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పొందేలా ఐటీ సంస్థలను తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ఐటీ టవర్‌లో టాస్క్ శిక్షణ కేంద్రం, ఇంక్యుబేషన్ హబ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్టీటీ డేటాలో 300 మంది, ఎన్ ల్యాబ్స్‌లో 250 మంది, వైదర్ సాఫ్ట్‌వేర్‌లో 20 సీట్లు, పోస్ట్‌టిట్ ఏఐలో 50 మందికి ఉపాధి కల్పించేలా సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయని వెల్లడించారు. స్థానిక యువతకు సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఆదిలాబాద్‌లో 3 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. తొలివిడతలో 2 వేల ఎకరాలు, రెండో విడతలో మరో వెయ్యి ఎకరాలు సేకరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, భూసేకరణ, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి త్వరలో శంకుస్థాపన చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఐటీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సాంకేతిక, విధానపరమైన సమస్యలను పరిష్కరించి పరిశ్రమ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ రంగాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ, ఐటీ టవర్ ప్రారంభం జిల్లా యువత భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. విమానాశ్రయం, జాతీయ రహదారులు, రైల్వే, సీసీఐ పునరుద్ధరణ వంటి ప్రాజెక్టులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, ఐటీ టవర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి, ఐటీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగావకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో మరో ఐటీ టవర్ మంజూరు చేయాలని కోరారు. స్థానిక పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఆదివాసీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఐటీ, పారిశ్రామిక సంస్థల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని, ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సెక్రటరీ లు అనుదీప్, శశాంక్, అదనపు కలెక్టర్లు ఎస్. రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, ఎస్పీ అఖిల్ మహాజన్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, ఐటీ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రిలేని ఆడబిడ్డల వివాహాలకు పెద్దన్నలా ఉప్పల శ్రీనివాస్ గుప్త

ఇద్దరు నిరుపేద యువతుల పెళ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ చేయూత



పుస్తె మట్టెలు, పెళ్లి చీరలు, గాజుల అందజేత

హైదరాబాద్ (జనంసాక్షి) : తండ్రి లేని నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు పెద్దన్నలా అండగా నిలుస్తూ ఉప్పల ఫౌండేషన్ వ్యవస్థాపకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త తన మానవతా దృక్పథాన్ని చాటుకుంటున్నారు. నిరుపేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో తనవంతు సహాయాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఇద్దరు నిరుపేద యువతుల వివాహాలకు అవసరమైన పుస్తె మట్టెలు, పెళ్లి చీరలు, గాజులను అందజేశారు.

నాగోల్ పరిధిలోని ఫతుల్లాగూడకు చెందిన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన రోహిణి (కార్తిక) కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆ కుటుంబంలో తండ్రి లేకపోవడంతో వివాహ బాధ్యత తల్లిపై పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త ఉప్పల ఫౌండేషన్ ద్వారా పుస్తె మట్టెలు, పెళ్లి చీర, గాజులను అందజేశారు. ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న కుమారుడు ఉప్పల సాయి కిరణ్ సాయి తేజ కోడలు శార్వరి చేతుల మీదుగా వీటిని అందించారు.

అదేవిధంగా తన స్వగ్రామమైన లక్ష్మీదేవపల్లికి చెందిన మౌనిక అనే నిరుపేద ఎస్సీ సామాజిక వర్గ యువతి వివాహానికి కూడా ఉప్పల శ్రీనివాస్ గుప్త చేయూతనిచ్చారు. తండ్రి లేని మౌనికను తల్లి ఎల్లవ్వ ఇంటి పనులు చేస్తూ కష్టపడి పెంచి పెద్ద చేసింది. కుమార్తె వివాహం జరిపించేందుకు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త ఉప్పల ఫౌండేషన్ తరఫున పుస్తె మట్టెలు, పెళ్లి చీర, గాజులను అందజేశారు.

రక్తసంబంధం లేకపోయినా నిరుపేద ఆడబిడ్డలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి, వారి వివాహాల్లో భాగస్వాములవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే నిజమైన సేవాభావమని, తండ్రి లేని ఆడబిడ్డల పెళ్లిళ్లకు సహకారం అందించడం ద్వారా ఉప్పల శ్రీనివాస్ గుప్త సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమాల్లో నాగోల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చారి, కాలనీ సంఘాల ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, రోహిణి కుటుంబ సభ్యులు, తల్లి పరదేశి, సవిత, సత్తయ్య, శ్రీనివాస్ యాదవ్, మౌనిక తల్లి ఎల్లవ్వ, అభిలాష్, మహేందర్, రమేష్, పర్వా రాములు తదితరులు పాల్గొన్నారు.





16 స్టేడియాల్లో ఖేలో ఇండియా గేమ్స్

- సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్ (జనంసాక్షి) : ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ మౌలిక సదుపాయాలకు రూ.120 కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ జాజు తెలిపారు. ప్రతీ వేదికలకు ఒక్కొక్క అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారిని ఇంచార్జిగా నియమించా మన్నారు. ప్రతీ క్రీడా పోటీలు జరిగే వేదికల వద్ద ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్ లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. డిసెంబర్ 11 వ తేదీ నుండి 22 వ తేదీ వరకు నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 నిర్వహణకు ఏర్పాట్లన్నీ ముమ్మరంగా జరుగుతున్నాయని సంజాయ్ జాజు తెలిపారు. ఖేలో ఇండియా గేమ్స్-2026 నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ కార్యదర్శి హరిరంజన్ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ ఈ ఖేలో ఇండియా క్రీడలకు దాదాపు 7 వేల మంది క్రీడా కారులు హాజరవుతున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, కోచ్‌లు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ప్రధానంగా కనీస మౌలిక సదుపాయాలైన క్రీడా వేదికల తయారు, శానిటేషన్, తాగునీరు, టాయిలెట్ల పునరుద్ధరణ పనులు చేపట్టామని తెలిపారు. ఇందుకుగాను రూ.120 కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కి కేటాయించామని తెలిపారు. హైదరాబాద్ తో పాటు హన్మకొండ, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్ జిలాలో ఈ ఖేలో ఇండియా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ కోసం రాష్ట్రంలోని అన్ని స్టేడియాలను సిద్ధం చేస్తున్నామని, ఇప్పటికే 11 స్టేడియాలు సిద్ధంగా ఉన్నాయని, మరో 5 స్టేడియాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, స్పోర్ట్ అథారిటీ ఎం.డి సోని బాల దేవి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ముకుంద్ రెడ్డి పాల్గొన్నారు.

13 నుండి మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాలు

- ఆసుపత్రి సూపరింటెండెంట్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు నోటీసులు అందజేత



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 11 (జనంసాక్షి): నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13వ తేదీ నుండి ప్రతిరోజూ ధర్నాలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములుకు, అలాగే మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసులు మరియు వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ... ఆసుపత్రి మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం జీవోల ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తామని ఆరోగ్య శాఖ మాత హామీ ఇచ్చినప్పటికీ, అది ఆచరణలో అమలు కావడం లేదని ఆయన విమర్శించారు. కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు, పెరిగిన పనిభారానికి అనుగుణంగా సిబ్బంది సంఖ్యను కూడా పెంచాలని కోరారు.సిబ్బంది న్యాయమైన సమస్యలపై ఈ నెల 13 నుండి 27వ తేదీ వరకు ప్రతిరోజు నిరసన ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ఒకవేళ ఈలోగా ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, ఈ నెల 28వ తేదీ తర్వాత ఏ క్షణంలోనైనా పూర్తిస్థాయి సమ్మెకు వెళ్తామని ప్రభుత్వం మరియు అధికారులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హనుమాన్, ప్రముఖ నాయకులు గోవర్ధన్, కవిత, భాగ్యలక్ష్మి, స్వరూప, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంగా ఆకునూరు అంగన్‌వాడీ కేంద్రం..

- స్వచ్ఛమైన కూరగాయలు పండిస్తున్న టీచర్ ఉమారాణి
- జిల్లా స్థాయిలో గుర్తింపు.. ప్రముఖుల అభినందనలు



చేర్యాల, నవంబర్ 11(జనంసాక్షి) : విద్యార్థుల ఎదుగుదలకు సంక్షేమం కోసం నాణ్యమైన కూరగాయలు పౌచిత ఆహారం అందించడమే లక్ష్యంగా సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన అంగన్ వాడి సెంటర్ వన్‌కు చెందిన టీచర్ తాటికొండ ఉమా ప్రకృతి వనంగా తీర్చిదిద్ది విద్యార్థులకు సేవలందిస్తున్నారు. గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఉన్న అంగన్వాడి సెంటర్ లో ఇనుప కంచెతో ప్రహరీ నిర్మించి సుమారు 6 ట్రిప్పుల ఎర్ర మట్టిని పోయించి సహజ సిద్ధమైన పంటలు పండిస్తున్నారు. విద్యార్థులకు నేర్పిస్తున్న రైతు తన అనుభవాన్ని వివరించారు. జామ, బొప్పాయి, మునగ, నిమ్మ, మిరప, అలోవెరా, కరివేపాకు, పుదీనా, మామిడి, ధానిమ్మ, పూల మొక్కలు, చామంతి గులాబీ, గోరింటా, బంతి,గన్నేరు,మందార,లిల్లీ పూలు, షో చెట్ల పంటలను సాగు చేస్తున్నానని తెలిపారు. గతంలో తోటలకు, పంటలకు నీటి ఎద్దడి ఉండేదని, నాన్-స్టాండర్డ్ లేబుల్స్ తో ఇబ్బందులు పడ్డామని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం ఆకుకూరలు, కూరగాయలు అందించాలనే సంకల్పంతో ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. తోటల చుట్టూ మొక్కలను నాటి, కంచె వేసి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నీటి కోసం గ్రామానికి చెందిన బీర గణేష్ రూ.10వేలు విరాళంగా చేశారని, స్థానిక సర్పంచ్ కొమ్ము రవి వాటర్ ట్యాంక్ నుండి కనెక్షన్ ఇవ్వడంతో ప్రస్తుతం నీటి సమస్య తీరిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ తోటను మరింతగా డెవలప్ చేయాలని ఉందని రైతు తెలిపారు. అంగన్వాడి టీచర్లను ఉపాధ్యాయులు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు.

15న సిద్దిపేటలో పొన్నాల బాలయ్య రచన
'లంద" నవల పరిచయ సభ

సిద్దిపేట, నవంబర్ 11 (జనంసాక్షి) : సిద్దిపేట జిల్లా కు చెందిన ప్రముఖ రచయిత, కవి డాక్టర్ పొన్నాల బాలయ్య రచించిన 'లంద' నవల పరిచయ సభ ఈ నెల 15 న సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె.రంగాచార్య, ప్రధాన కార్యదర్శి, కవి రచయిత సిద్దెంకి యాదగిరి, లంద రచయిత, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు పొన్నాల బాలయ్య, కార్యదర్శి గంభీర్రావు పేట యాదగిరి, తెలంగాణ వికాస సమితి అధ్యక్షులు ఉపాధ్యక్షులు ఎన్. భగవాన్ రెడ్డి, తెలంగాణ రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు తోట అశోక్ లు తెలిపారు. బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో మరసం ప్రతినిధులు కార్యక్రమ ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా ప్రఖ్యాత కవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి, ప్రముఖ కవి, గాయకుడు, శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, లు హాజరావుతారని తెలిపారు. నవల పరిచయ కర్తగా ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు, కవి, రచయిత వి. శంకర్, ఆత్మీయ అతిథులుగా టీ యూ డబ్ల్యూ జే(ఐ జె యూ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, టీ ఎన్ జీ ఓ సంఘం మాజీ అధ్యక్షులు దేవిప్రసాద్, తెలంగాణ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్,గుండె దప్పు కనకయ్య, ఓయూ బహుజన నాయకుడు నలిగంటి శరత్ చమార్ హాజరావుతారని తెలిపారు, ప్రముఖ కవులు సిద్దెంకి యాదగిరి, తైదల అంజయ్య, కె. అంజయ్య, తోట అశోక్, పప్పుల రాజిరెడ్డి, ముక్కెర సంపత్ కుమార్, పెద మాతరి బాబు మాదిగ, లింగారెడ్డి పల్లి జడ్పీ హెచ్ ఎం, హెచ్ ఎం కె. ప్రమీల గార్లు ఆత్మీయ సందేశాలు ఇస్తారని తెలిపారు. సాహిత్య సభకు సాహితీ ప్రియులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు.

భీమవరం టు ఢిల్లీ

- మత్తుకు వ్యతిరేకంగా 3 వేల కి.మీ సైకిల్ యాత్ర
- 62 ఏళ్ల వయస్సులోనూ యువత భవిష్యత్తు కోసం విజయలక్ష్మి చైతన్య యాత్ర



రామాయంపేట, నవంబర్ 11 (జనం సాక్షి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని చాటిచెప్పేందుకు 62 ఏళ్ల విజయలక్ష్మి చేపట్టిన 3 వేల కిలోమీటర్ల నిషా ముక్త్ భారత్ సైకిల్ యాత్ర బుధవారం రామాయంపేటకు చేరుకుంది. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో భీమవరం నుంచి ఢిల్లీ వరకు చేపట్టిన యాత్రకు మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, యువకులు స్వాగతం పలికారు. అనంతరం రామాయంపేట పోలీస్ స్టేషన్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తూ సిద్దిపేట చౌరస్తా వరకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణలో 14 జిల్లాల మీదుగా యాత్ర కొనసాగిస్తున్నట్లు, ఇప్పటివరకు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణించానని, డిసెంబర్ 10 నాటికి ఢిల్లీ చేరుకోవడమే లక్ష్యమన్నారు. చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు మాట్లాడుతూ 62 ఏళ్ల వయస్సులో యువత భవిష్యత్తు కోసం ఆమె చేస్తున్న యాత్ర అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఐ సైదా నాయక్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, నాయకులు, ఎస్ఐలు నారాయణ గౌడ్, నరేష్, నర్సింగి ఎస్ఐ సృజన, నిజాంపేట ఎస్ఐ రాజేష్, యువకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

వేలాడే ప్రయాణం.. స్వతంత్ర భారతం సిగ్గుపడాలి!

మా ప్రాణాలకు విలువ ఎప్పుడు? ఆ సమాధానం కోసం ఇంకెంత మంది ప్రాణాలు కోల్పోవాలి? ఇది ముంబై రైల్వే ప్రయాణికులు అడుగుతున్న ప్రశ్న...

ముంబయి స్థానిక రైళ్ల తలుపుల వద్ద మనుషులు గుత్తులుగా వేలాడుతూ ప్రయాణించే దృశ్యాలు మనకు కొత్త కాదు. కానీ అలాంటి ప్రమాదకర ప్రయాణం మనకు అలవాటైపోవడమే అసలు విషాదం. ముంబయి రైల్వే పోలీసుల అధికారిక సమాచారం ప్రకారం ప్రతిరోజూ 70 నుంచి 80 లక్షల మంది స్థానిక రైళ్లలో ప్రయాణిస్తున్నారు. 2025 జూన్ 9న తలుపుల వద్ద ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఆ విషాదం తర్వాతే సాధారణ రైళ్లకు కూడా ఆటోమేటిక్ తలుపులు ఏర్పాటు చేయాలనే ఆలోచన ముందుకొచ్చింది. చెన్నైలో తయారైన తొలి సాధారణ స్థానిక రైలు ముంబయికి చేరిందని ప్రకటించారు. ఇది ఆహ్వానించదగిన పరిణామమే. కానీ ఇంతటి ప్రమాదకర పరిస్థితిని నివారించడానికి ఇన్నేళ్లు ఎందుకు పట్టిందన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

ఒక ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోతే గానీ రైళ్లకు తలుపులు ఏర్పాటు చేయాలనే ఆలోచన రాని వ్యవస్థను ఏమనాలి? దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తోంది. చంద్రుడిపై అడుగుపెట్టాం. అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపుతున్నాం. సాంకేతికంగా ప్రపంచంతో పోటీ పడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాం. కానీ రోజూ లక్షల మంది బతుకుదెరువు కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రైళ్లకు వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ఇది వారి సాహసం కాదు.. నిస్సహాయత. రైలు లోపల అడుగుపెట్టడానికి చోటుండదు. మరో రైలు కోసం ఎదురుచూస్తే ఉద్యోగానికి ఆలస్యమవుతుంది. ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న సామాన్యుడు ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోంది.

ఇలాంటి పరిస్థితులకు ప్రయాణికులను నిందించడం అన్యాయం. దశాబ్దాలుగా పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లను, బోగీలను, ఇతర సౌకర్యాలను పెంచలేకపోయిన పాలకులే దీనికి బాధ్యత వహించాలి. ముంబయి దేశ ఆర్థిక రాజధాని అని గొప్పగా చెప్పుకుంటాం. ఆ నగర సంపదను సృష్టించే కార్మికులు, ఉద్యోగులు మాత్రం పశువుల మాదిరిగా రైళ్లలో కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది. ఒకవైపు మెట్రో రైళ్లు, వేగవంతమైన రైళ్ల ప్రాజెక్టులు, ఆకాశహర్మ్యాల నిర్మాణాలు మరోవైపు నిత్యం రైలు ప్రమాదాల్లో సామాన్యుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. అభివృద్ధి ప్రాధాన్యతల్లో సామాన్యుడి భద్రతకు ఎంత చోటు దక్కుతోందో ఈ పరిస్థితులే చెబుతున్నాయి.

రైళ్లకు ఆటోమేటిక్ తలుపులు ఏర్పాటు చేయడం అవసరమే. అయితే అదే పూర్తి పరిష్కారం కాదు. తలుపులు మూసుకుంటే ప్రయాణికులు రైలు బయట వేలాడకుండా ఉండవచ్చు. కానీ లోపల రద్దీ తగ్గకపోతే ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి మరింత పెరగవచ్చు. గాలి ప్రసరణకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. అంతకంటే ముఖ్యంగా రైళ్ల సంఖ్యను పెంచాలి. బోగీల సంఖ్యను పెంచాలి. రైళ్ల మధ్య సమయాన్ని తగ్గించాలి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు రైళ్లను నడపాలి. ఉద్యోగ సమయాలను విస్తరించేలా సంస్థలు కూడా ఆలోచించాలి. నగరంలోని అన్ని ఉద్యోగాలు, వ్యాపారాలు ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా ప్రణాళికలు రూపొందించాలి.

ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పాలన కంటే, ప్రమాదం జరగకముందే నివారణ చర్యలు చేపట్టే పాలన అవసరం. ప్రజల ప్రాణాలు పోయిన తర్వాత పరిష్కారాలను ప్రకటించడం పాలకుల బాధ్యతను పూర్తి చేసినట్లు కాదు. ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరేలా చూడటమే ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత.

ఒక దేశ అభివృద్ధిని ఎత్తైన భవనాలతోనో, భారీ ప్రాజెక్టులతోనో కొలవకూడదు. ఆ దేశంలో అత్యంత సామాన్యుడు ఎంత గౌరవంగా, ఎంత భద్రంగా ప్రయాణించగలుగుతున్నాడన్నదే నిజమైన అభివృద్ధికి కొలమానం. ఆ కొలమానంతో చూసుకున్నప్పుడు మనం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిందే. రైలు తలుపుల వద్ద ప్రాణాలను పణంగా పెట్టి వేలాడుతున్న ప్రతి ప్రయాణికుడి చేయి పాలకులను ఒకటే ప్రశ్న అడుగుతోంది.

మోదీ కీర్తి కండూతి - ప్రజా ధనంతో అమెరికాలో లాబీయింగ్!



అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక దేశం మరో దేశంతో దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి లాబీయింగ్ సంస్థల సేవలు వినియోగించుకోవడం అసాధారణమేమీ కాదు. అయితే దేశ ప్రయోజనాల కోసం చేసే దౌత్య ప్రయత్నాలకు, అధికారంలో ఉన్న నాయకుడి వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచడానికి చేసే ప్రచారానికి మధ్య స్పష్టమైన తేడా ఉండాలి. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసిస్తూ సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టు వెనుక అమెరికా లాబీయింగ్ సంస్థల పాత్ర వెలుగులోకి రావడం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ముఖ్యంగా ఈ వ్యవహారంపై 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'ది వైర్', 'స్క్రోల్' వంటి మీడియా సంస్థలు వెల్లడించిన వివరాలు కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం, ప్రజాధన వినియోగం, మోదీ వ్యక్తిగత ప్రచారంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

2026 నవంబరు 7న 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ఈ వ్యవహారంలోని కీలక అంశాలను బయటపెట్టింది. అమెరికా న్యాయశాఖకు విదేశీ ఏజెంట్ల నమోదు చట్టం (ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్-ఎఫ్‌ఏఆర్‌ఏ) కింద సమర్పించిన పత్రాల ఆధారంగా ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ట్రంప్ రాజకీయ వర్గాలతో సన్నిహిత సంబంధాలున్న "మెర్క్యురీ పబ్లిక్ అఫైర్స్ " అనే సంస్థతో భారత రాయబార కార్యాలయం నెలకు 75 వేల అమెరికన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. అంటే సుమారు రూ.70 లక్షలు. ఈ సంస్థలో ట్రంప్ ఎన్నికల పరివర్తన బృందానికి కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా పనిచేసిన బ్రయాన్ లాంజా కీలక భాగస్వామిగా ఉన్నారు. ట్రంప్ వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేసిన సుసీ వైల్స్ కూడా గతంలో ఈ సంస్థలో లాబీయిస్ట్‌గా పనిచేశారు.

ఈ సంస్థ తన కార్యకలాపాల నివేదికలో ట్రంప్ మోదీని భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా అభినందిస్తూ జూన్‌లో పెట్టిన సామాజిక మాధ్యమ పోస్టును కూడా ప్రస్తావించింది. ఈ పోస్టు ప్రచారం, వ్యాప్తి తమ కార్యకలాపాల్లో భాగంగా ఉన్నట్లు సంస్థ వెల్లడించడం వివాదానికి కేంద్రబిందువైంది. ఈ సంస్థ వెల్లడించినట్లు ఈ పోస్టు వ్యాప్తికి సంబంధించిన కార్యకలాపాలు. అయినప్పటికీ, ఒక దేశ ప్రధాని వ్యక్తిగత ప్రశంసను విదేశీ లాబీయింగ్ సంస్థ తన పనితీరు నివేదికలో చేర్చడం వెనుక ఉన్న రాజకీయ, ప్రచార ప్రయోజనాలను ప్రశ్నించాల్సిందే.

ఇంతటితో ఈ వ్యవహారం ముగియలేదు. ట్రంప్ మాజీ రాజకీయ సలహాదారు జేసన్ మిల్లర్ నేతృత్వంలోని "ఎస్.హెచ్.డబ్ల్యూ. పార్ట్‌నర్స్" అనే మరో సంస్థకు భారత ప్రభుత్వం నెలకు లక్షా 50 వేల డాలర్లు, అంటే సుమారు రూ.1.4 కోట్లు చెల్లించే ఒప్పందం కుదుర్చుకుంది. 2025 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ ఒప్పందాన్ని 2026 ఏప్రిల్‌లో మరో ఏడాదికి పొడిగించారు. మే, జూన్ 2026లో భారత ప్రభుత్వ ప్రతినిధులకు అమెరికా ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఎనిమిది ఫోన్ సంభాషణలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ అమెరికా న్యాయశాఖకు సమర్పించిన పత్రాల్లో పేర్కొంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్, ఉప జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ నీధమ్, వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ తదితరులతో ఈ సంప్రదింపులు జరిగాయి. ట్రంప్ ప్రభుత్వంలో ప్రత్యేక ప్రభుత్వ ఉద్యోగిగా మిల్లర్ చేరిన తర్వాత జూన్ 23న ఈ ఒప్పందం ముగిసింది.

ఈ రెండు సంస్థలకు కలిపి నెలకు 2.25 లక్షల డాలర్లు, అంటే సుమారు రూ.2 కోట్లకు పైగా ప్రజాధనం వెచ్చించడం చిన్న విషయం కాదు. ఈ ఖర్చుతో భారత్‌కు లభించిన ప్రయోజనాలేమిటి? వాణిజ్య వివాదాలు పరిష్కారమయ్యాయా? భారత ఎగుమతులపై అమెరికా విధించిన భారీ సుంకాల ఒత్తిడి తగ్గిందా? భారత్ ప్రయోజనాలకు అనుకూలంగా అమెరికా విధానాల్లో మార్పు వచ్చిందా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇంత వరకు భారత ప్రజలకు గానీ, భారత పార్లమెంటుకు గానీ చెప్పలేదు.

అమెరికా వార్తా సంస్థ 'బ్లూమ్‌బెర్గ్' 2025 ఆగస్టు 25న ప్రచురించిన కథనం ఈ వ్యవహారానికి మరో కీలక నేపథ్యాన్ని అందించింది. అమెరికా భారత్‌పై 50 శాతం సుంకాలు విధించడానికి సిద్ధమవుతున్న సమయంలోనే ట్రంప్‌కు సన్నిహిత సంబంధాలున్న "మెర్క్యురీ సంస్థ" ను భారత ప్రభుత్వం నియమించిందని ఆ కథనం వెల్లడించింది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగించడంపై ట్రంప్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సందర్భమది. అమెరికా ఆంక్షలు, సుంకాల ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత్ ట్రంప్ రాజకీయ వర్గాలకు దగ్గరగా ఉన్న వ్యక్తుల సహాయాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడటం మన విదేశాంగ విధానానికి సంబంధించిన తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. అంతేకాకుండా, మెర్క్యురీ గతంలో చైనా సంస్థలు, అమెరికా ఆంక్షలకు గురైన జెడ్‌టీఈ వంటి సంస్థలకు కూడా లాబీయింగ్ సేవలు అందించిన విషయాన్ని బ్లూమ్‌బెర్గ్ ప్రస్తావించింది.

'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' మరో పరిశోధనలో ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ భారత్ అమెరికా రాజకీయ, మీడియా వర్గాలను చేరుకోవడానికి లాబీయిస్టుల సహాయం తీసుకున్నట్లు వెల్లడించింది. మే 10, 2025న సైనిక చర్య నిలిచిన తర్వాత భారత ప్రభుత్వం జేసన్ మిల్లర్ ద్వారా అమెరికా ఉన్నతాధికారులను సంప్రదించింది. అదే సమయంలో పాకిస్థాన్ కూడా అమెరికా ప్రభుత్వ అధికారులు, చట్టసభ సభ్యులు, మీడియా సంస్థలతో సమావేశాల కోసం విస్తృతంగా ప్రయత్నించింది. అంటే అంతర్జాతీయ వేదికపై భారత్ తన వాదనను వినిపించడానికి దౌత్యపరమైన వ్యవస్థతోపాటు ఖరీదైన మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

'ది వైర్', 'స్క్రోల్' నవంబరు 7న ఈ వివరాలను మరింత విస్తృతంగా ప్రచురిస్తూ, ట్రంప్ ప్రశంసల పోస్టు, లాబీయింగ్ ఒప్పందాలు, అమెరికా అధికారులతో ఏర్పాటు చేసిన సంప్రదింపులపై ప్రజాధన వినియోగాన్ని ప్రశ్నించాయి. ముఖ్యంగా ప్రజాధనం ఖర్చు చేసి సాధించిన ఫలితాలు ఏమిటన్నది వాటి కథనాల నుంచి ముందుకొచ్చే ప్రధాన ప్రశ్న. అమెరికా వంటి దేశంలో లాబీయింగ్ చట్టబద్ధమైన వ్యవస్థ కావచ్చు. కానీ చట్టబద్ధత ఉన్నంత మాత్రాన ప్రతి ఖర్చూ ప్రజాప్రయోజనకరమైనదని చెప్పలేం.

ఇక్కడ అసలు సమస్య లాబీయింగ్ సంస్థలను నియమించుకోవడం మాత్రమే కాదు. దేశ దౌత్య ప్రయోజనాలు, అధికార పార్టీ రాజకీయ ప్రచారం, ప్రధాని మోదీ వ్యక్తిగత ప్రతిష్ఠ మధ్య గీత చెరిగిపోవడమే. ఒకప్పుడు ప్రపంచ దేశాల మధ్య భారత్ తన వ్యూహాత్మక స్వతంత్రతను గర్వంగా ప్రకటించేది. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడి రాజకీయ వర్గాలకు దగ్గరగా ఉన్న వ్యక్తుల ద్వారా పలుకుబడి సంపాదించుకోవాల్సిన కర్మ ఎందుకు ఏర్పడిందో ప్రభుత్వం వివరించాలి.

ప్రజాస్వామ్యంలో ప్రధానమంత్రి తన వ్యక్తిగత ప్రశంసలు కోసం చేసుకొనే ప్రచారం దేశ విజయాలకు కొలమానం కావు. "అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అభినందన సందేశాన్ని మోదీ అంతర్జాతీయ విజయంగా చిత్రీకరించుకోవడం ఒక రాజకీయ ప్రచార వ్యూహం కావచ్చు" . కానీ దేశానికి ఎదురవుతున్న వాణిజ్య సవాళ్లు, సుంకాల బెదిరింపులు, దౌత్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కోవడంలో సాధించిన ఫలితాలే అసలైన కొలమానం. లాబీయింగ్ సంస్థలకు చెల్లించిన ప్రతి రూపాయికీ ప్రజలకు లెక్క చెప్పాల్సిన బాధ్యత విదేశాంగ శాఖకు ఉంది. ఈ శాఖ ఖర్చు పెట్టే పైసా భారత పార్లమెంటుకు లెక్క చెప్పాలి. అంతే కానీ మోదీ వ్యక్తిగత కీర్తి ప్రతిష్ఠల ప్రచారం కోసం వెచ్చించడం సరైనది కాదు, దేశ ప్రయోజనాల కోసం విదేశాంగ శాఖ పనిచేయాలి. ప్రజాధనం వ్యక్తిగత రాజకీయ ప్రతిష్ఠ నిర్మాణానికి వినియోగించబడుతోందన్న అనుమానాలకు తావులేని పారదర్శకతను కేంద్ర ప్రభుత్వం నిరూపించాల్సిన బాధ్యత ఉంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
అసోసియేట్ ప్రొఫెసర్ (రిటైర్డ్)
ramkishore.1504@gmail.com
9849328496.

అర్థాంతరంగా అంతర్ధానమైన 'మానవీయ ప్రయోగం'



ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు,అనువాదకుడు, హేతువాది, సామాజిక విశ్లేషకుడు సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్ క్యాన్సర్ వ్యాధితో నవంబర్ 2 నాడు మరణించడం కడు విషాదకరం. సామాజిక సమరంలో గెలిచి నిలిచిన ఆయన క్యాన్సర్ వ్యాధి నుండి తప్పించు కోలేకపోయారు. ఆయన మరణాన్ని 'అర్ధాంతరంగా అంతర్ధానమైన మానవీయ ప్రయోగం'గా పేర్కొనవచ్చు.

సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్ కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని 'లింగం దిన్నె' అనే గ్రామంలో జన్మించారు. ఆయన తన చిన్నతనం లోనే తల్లిదండ్రులను కోల్పోయి అనేక సంఘర్షణలకు లోనయ్యా రు. ఆయన అనేక కష్టాలతో సహవాసం చేస్తూ వాటిని అధిగమిస్తూ నే సామాజిక పోకడలను సునిశితంగా పరిశీలించారు. హైదరాబా ద్ సెంట్రల్ యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ అభ్యసించిన పిదప సివిల్ సర్వీస్ పరీక్షల కోసం కుస్తీలు పట్టారు. 2001 లో అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ (ఏసీటీఓగా) ఎంపికై క్రమం గా తిరుపతి లోని వాణిజ్య పన్నుల శాఖలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్గా పనిచేస్తూనే సోషల్ మీడియాలో ముఖ్యంగా ఫేస్ బుక్ లో అత్యధిక ఫాలోవర్ లను కలిగి ఉండి సామాజిక, రాజకీయార్థిక అంశాలపై అనేక రచనలు చేశారు.

ఫేస్ బుక్‌లో తన పోస్టుల కోసం ఫాలోవర్స్ ఎదురుచూసేంత క్రేజీని సొంతం చేసుకున్నారు సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్. ఫేస్ బుక్ లో ఫ్రెండ్స్ కాకున్ననూ, ఫాలోవర్స్ కాకున్ననూ ఆయన పేరుని సెర్చ్ చేసి వ్యాఖ్యానాలు చదివే వారు కోకొల్లలు ఉన్నారు. ముఖ్యంగా ఆయన రచనలు సామాజిక న్యాయానికి అద్దంపట్టే విధంగా ఉండేవి. తాను నమ్మిన ఆదర్శాల విషయంలోనూ తన రచనల విషయంలోనూ ఆయన ఏనాడు రాజీ పడలేదు. ఆయన తాను నిర్దేశించుకున్న ఆదర్శాలను తప్పకుండా ఆచరించారు.

సామాజిక గమనశీలతకు గతితార్కిక వ్యాఖ్యానాలు వ్యక్తీకరించడంలో సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్‌కు మరెవరు సాటి రారు. ఒక దశలో ఆయన సంధించిన ఫేస్ బుక్ పోస్టుకి సంబంధించి జవాబు దారిగా వ్యవహరించాల్సిన అధికార ప్రభుత్వం దడుచుకుని కక్ష్య గట్టి ఆయనను సస్పెండ్ చేసింది. అయిననూ ఆయన ఏమాత్రం వెనకడుగు వేయకుండా తన రచనా ప్రస్థానాన్ని కొనసాగించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ ఉన్నత అధికారిగా విలాస జీవితాన్ని గడిపే అవకాశాలు ఉన్ననూ వాటన్నింటిని తోసివేసి సింప్లిసిటీకి ప్రాధాన్యత ఇచ్చి ఆయన సామాన్య మానవుడిగా జీవించారు. ప్రశంసలకు పొంగిపోవడం, విమర్శలకు కుంగిపోవడం లాంటివి ఆయన జీవితంలో ఏనాడు చోటుచేసుకోలేదు.

నా దృష్టిలో ఆయన ఒక గొప్ప 'సోషల్ సైంటిస్ట్'. ఆయన సమాజంపై ప్రయో గాలు చేయడమే కాకుండా క్యాన్సర్ వ్యాధి సోకిననూ ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా తన శరీరంపై మందులు వాడకుండా నిష్టతో ప్రయోగాలు చేసి నాలుగు సంవత్సరాలు జీవించారు. సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్ మరణించాక ఆయన అంటే గిట్టని వారు, ఆయన రాతలు నచ్చని వారు, ఆయన అభిప్రాయాలను వ్యతిరేకించేవారు సంస్కారాన్ని మరిచి ఆయనపై ద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సహేతుకం కాదు. ఆయన మరణించిననూ ఆయన అక్షరాలు 'చైతన్యదీప్తి'ని మేల్కొల్పుతూనే ఉన్నాయి. అతి చిన్న వయసులోనే ఆయన మరణించడం తద్వారా సామాజిక అంశాలపై వ్యాఖ్యానించే 'గొప్ప అక్షర పోరాటయోధు డు'ని కోల్పోయినట్లుగా ఉంది. అంతిమంగా ఆయన మరణం సభ్య సమాజానికి తీరని లోటు. తుది శ్వాస దాకా తాను నమ్మిన విలువల కోసం, మెరుగైన సమాజం కోసం ... అంతిమంగా సమసమాజం కోసం కృషి చేసిన ఆయన ఆలోచనలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి కాగలదు. ఈ సందర్భంగా నేను ఆయనకు 'అక్షర నివాళులు' అర్పిస్తున్నాను.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690


మౌలానా అబుల్ కలాం ఆజాద్
జాతీయ సమైక్యతకు ప్రతీక.. భారత విద్యా వికాసానికి మార్గదర్శి!

భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప పాత్రికేయుడిగా, జాతీయవాదిగా, విద్యావేత్తగా ఆయన చేసిన సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు దేశ ప్రజలకు విద్య, విజ్ఞానం, ఆలోచనా స్వేచ్ఛ అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన దార్శనికుడు ఆయన. మతసామరస్యం, లౌకికవాదం, జాతీయ సమైక్యత, సమాన విద్యావకాశాల కోసం జీవితాంతం కృషి చేసిన ఆజాద్ జయంతి నవంబర్ 11ను జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆయన సేవలకు తగిన గౌరవం.

1888 నవంబర్ 11న సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో జన్మించిన ఆజాద్ అసలు పేరు అబుల్ కలాం గులాం ముహియుద్దీన్ అహ్మద్. ఆయన తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ప్రముఖ ఇస్లామిక్ పండితుడు. కుటుంబం భారతదేశానికి తిరిగి వచ్చి కలకత్తాలో స్థిరపడింది. చిన్నతనం నుంచే విద్య పట్ల ఆసక్తి కనబరిచిన ఆజాద్ అరబిక్, పర్షియన్, ఉర్దూ భాషలతో పాటు తత్వశాస్త్రం, గణితం, చరిత్ర, మతగ్రంథాలను అభ్యసించారు. స్వయంకృషితో ఇంగ్లిష్, ఆధునిక రాజకీయాలు, ప్రపంచ చరిత్రపై పట్టు సాధించారు. అసాధారణమైన పాండిత్యం, వక్తృత్వం, రచనా నైపుణ్యంతో చిన్న వయసులోనే మేధావిగా గుర్తింపు పొందారు. తన ఆలోచనల్లో స్వేచ్ఛకు ప్రాధాన్యమిస్తూ 'ఆజాద్' అనే పేరును స్వీకరించారు.

జర్నలిజంతో స్వాతంత్ర్య సమరానికి నూతన దిశ

బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పత్రికా రంగాన్ని శక్తివంతమైన సాధనంగా ఆజాద్ భావించారు. 1912లో కలకత్తా నుంచి 'అల్ హిలాల్' అనే ఉర్దూ వారపత్రికను ప్రారంభించి బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానాలను తీవ్రంగా విమర్శించారు. భారతీయుల్లో జాతీయ భావాలను పెంపొందించాలని, మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ముస్లిం సమాజంలో జాతీయవాద భావజాలాన్ని బలపరిచారు. ఆయన రచనలు ప్రజల్లో విశేష ప్రభావాన్ని చూపడంతో బ్రిటిష్ ప్రభుత్వం 1914లో అల్ హిలాల్‌ను నిషేధించింది. అయినప్పటికీ వెనుకడుగు వేయకుండా 'అల్ బలాగ్' పత్రికను ప్రారంభించారు. దానిని కూడా 1916లో నిషేధించి, ఆజాద్‌ను కలకత్తా నుంచి బహిష్కరించి రాంచీలో నిర్బంధించారు. ఒక పాత్రికేయుడు సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో ఎంతటి కీలక పాత్ర పోషించగలడో ఆయన జీవితం నిరూపించింది.



స్వాతంత్ర్య పోరాటంలో కీలక నాయకత్వం

విడుదల అనంతరం ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. మహాత్మా గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి స్వాతంత్ర్య పోరాటంలో కీలక నాయ కుడిగా ఎదిగారు. 1923లో ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశానికి అధ్యక్షత వహించి, అప్పటికి అతి పిన్న వయసు లో కాంగ్రెస్ అధ్యక్షుడైన నాయకుడిగా చరిత్రలో నిలిచారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమాల్లో పాల్గొ ని జైలు శిక్ష అనుభవించారు. 1940లో రామ్‌గఢ్ కాంగ్రెస్ సమావేశంలో మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికై 1946 వరకు కొనసాగారు. రెండో ప్రపంచ యుద్ధం, క్రిప్స్ మిషన్, కేబినెట్ మిషన్ వంటి కీలక రాజకీయ పరిణామాల సమయం లో కాంగ్రెస్‌కు నాయకత్వం వహించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైనప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసి అహ్మద్‌నగర్ కోటలో నిర్బంధించింది. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం రాజకీయ నిబద్ధతకు, త్యాగానికి ప్రతీకగా నిలిచింది.

మతసామరస్యం, జాతీయ సమైక్యతకు ప్రాధాన్యం

భారతదేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించడం ఆజాద్ రాజకీయ జీవితంలో అత్యంత ముఖ్యమైన అంశం. మతం ఆధారంగా దేశాన్ని విభజించడం భారతీయుల ఉమ్మడి సంస్కృతికి, జాతీయ సమైక్యతకు విరుద్ధమని ఆయన భావించారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు తదితర మతాల ప్రజలు శతాబ్దాలుగా కలిసి జీవిస్తున్నారని, భారతదేశం అందరిదని స్పష్టం చేశారు. ముస్లిం సమాజానికి స్వతంత్ర భారతదేశంలో సమాన పౌరహక్కులు, రాజకీయ అవకాశాలు లభించాలే తప్ప దేశ విభజన పరిష్కారం కాదని వాదించారు. మహమ్మద్ అలీ జిన్నా, ముస్లిం లీగ్‌తో ఈ విషయంలో తీవ్ర రాజకీయ విభేదాలు ఏర్పడ్డాయి. 1947లో దేశ విభజన జరిగినప్పుడు ఆయన తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. అయినప్పటికీ మతసామరస్యం, లౌకికవాదం, జాతీయ సమైక్యత కోసం తన కృషిని కొనసాగించారు. ఆయన రచించిన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్' భారత స్వాతంత్ర్య ఉద్యమం, దేశ విభజనకు దారితీసిన రాజకీయ పరిణామాలను అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన చారిత్రక గ్రంథంగా నిలిచింది.

భారత విద్యా వ్యవస్థకు బలమైన పునాదులు


స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 1947లో బాధ్యతలు స్వీకరించిన ఆజాద్, దేశ అభివృద్ధికి విద్యనే ప్రధాన పునాదిగా భావించారు. విద్య కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఆకాంక్షించారు. ప్రాథమిక విద్య విస్తరణ, మహిళా విద్య, సాంకేతిక విద్య, ఉన్నత విద్య, శాస్త్రీయ పరిశోధనలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలంటే నాణ్యమైన విద్యాసంస్థలు అవసరమని గుర్తించారు. ఈ దూరదృష్టితోనే ఉన్నత సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధికి ప్రోత్సాహం అందించారు. 1951లో ఖరగ్‌పూర్‌లో తొలి భారతీయ సాంకేతిక విద్యాసంస్థ ప్రారంభానికి ఆయన హయాంలో కీలక ప్రోత్సాహం లభించింది. విశ్వవిద్యాలయ విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటుకు పునాదులు వేయడం, పరిశోధనలకు ప్రోత్సాహం అందించడం వంటి చర్యలు భారత ఉన్నత విద్యా వ్యవస్థ అభివృద్ధికి దోహదపడ్డాయి. సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ వంటి సాంస్కృతిక సంస్థల ఏర్పాటుకు కూడా ఆయన హయాంలో ప్రోత్సాహం లభించింది. భారతీయ భాషలు, కళలు, సాహిత్య సంపదను పరిరక్షిస్తూ ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలనే సమగ్ర విద్యా దృక్పథాన్ని ఆయన ప్రతిపాదించారు.

నేటి భారతదేశం డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, పారిశ్రామికీకరణ, అంతరిక్ష పరిశోధన, నూతన ఆవిష్కరణల రంగాల్లో వేగంగా ముందుకు సాగుతున్నప్పటికీ విద్యా రంగంలో అనేక సవాళ్లు కొనసాగుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య విద్యా అవకాశాల్లో అంతరాలు, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం, నాణ్యమైన ఉన్నత విద్య, ఉపాధికి అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. విద్యను కేవలం ఉద్యోగ సాధనంగా కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక సమానత్వానికి, శాస్త్రీయ ఆలోచనా విధానానికి, ప్రజాస్వామ్య చైతన్యానికి పునాదిగా చూడాలి. ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడం, మహిళా విద్యను ప్రోత్సహించడం, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం, విద్యాసంస్థల్లో మానవతా విలువలను పెంపొందించడం ద్వారా మాత్రమే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

1958 ఫిబ్రవరి 22న మౌలానా అబుల్ కలాం ఆజాద్ కన్నుమూశారు. 1992లో ఆయనకు మరణానంతరం భారత రత్న పురస్కారం ప్రదానం చేశారు. 2008 నుంచి నవంబర్ 11ను జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఆయన జీవితం, ఆలోచనలు, విద్యా విధానాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం. రాజకీయ స్వాతంత్ర్యం సాధించిన భారతదేశాన్ని విద్యా విజ్ఞాన రంగాల్లో ప్రపంచంలో అగ్రగామిగా నిలపాలన్న ఆయన ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థులందరిపైనా ఉంది. మతం, భాష, ప్రాంతం వంటి భేదాలకు అతీతంగా ఐక్యతను పెంపొందిస్తూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించగలిగినప్పుడే అభివృద్ధి చెందిన, సమానత్వం కలిగిన, విజ్ఞానవంతమైన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుంది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చూపిన విద్యా మార్గం, జాతీయ సమైక్యతా సందేశం భారతదేశ భవిష్యత్తుకు ఎప్పటికీ దిశానిర్దేశం చేస్తూనే ఉంటాయి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



చుట్టూ గోడలు..

నేనంటే నేనని
నే నే నిజమని
నేనే ముందని
అన్నీ సుళ్లేనని..
చుట్టూ గోడలు
ఎతెత్తు గోడలు
కనిపిస్తూ కొన్నే
అదృశ్యాలెన్నో..
లేపేసుకునినవో
అవే లేసేసినవో
అక్కున చేర్చేవో
కసిరి కాటేసేవో ..
జాతీ రీతీ గేరీ
గడపా లింగం
మొక్కు మోక్షం
తీరొక్క వరణం..
అందగా ఉండేవో
అంతం చేసేసేవో
బారెడు బారెడు
ఇస్రపు పన్నాతో..
కన్నతల్లిని నేననో
చెలియను నేననో
కళ్ళకు గంతగానో
కాళ్లకు మోకయ్యో..
గోడలే గోడలంతా
గోలలే గోలలంతా
ఎన్నాళ్ళీ కుంపట్లు
ఎందాకీ సిగ పట్లు..
భూమి బద్దలవ్వ
భూకంప మొస్తేనే
గోడల గొడవలన్నీ
గొంతు లాపుతయ్..

డా. ఇక్బాల్ పాషా
9440775732



అక్రమ నిర్మాణానికి కొత్త అనుమతులు



- సెట్‌బ్యాక్‌లు లేని భవనానికి స్టిల్ట్‌3కి పచ్చజెండా
- పాత ఫొటోలతో బురిడీ కొట్టించిన యజమాని
- భారీగా ముడుపులు చేతులు మారాయని ఆరోపణలు

మల్కాజిగిరి నవంబర్ 11(జనంసాక్షి) : నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులే, వాటికి అడ్డదారిలో అనుమతులు మంజూరు చేస్తున్న వైనం మల్కాజిగిరిలో సర్కిల్ లో కలకలం రేపుతోంది. ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా ఇప్పటికే నిర్మితమవుతున్న ఒక మూడంతస్తుల భవనానికి, ఏకంగా స్టిల్ట్ 3 అంతస్తుల నిర్మాణానికి అధికారులు అనుమతులు జారీ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో ఒక భవన యజమాని, నిబంధనలకు విరుద్ధంగా చుట్టూ ఎలాంటి ఖాళీ స్థలం (సెట్‌బ్యాక్‌లు) వదలకుండా మూడంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టాడు. అయితే, ఈ అక్రమ నిర్మాణాన్ని సక్రమం చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానాన్ని ఆసరాగా చేసుకున్నాడు. అక్కడ అసలు నిర్మాణమే జరగలేదని, అది కేవలం ఖాళీ స్థలం (ఓపెన్ ప్లాట్) మాత్రమేనని నమ్మించేందుకు గతంలో తీసిన పాత ఫొటోలను ఆన్‌లైన్ దరఖాస్తుకు జత చేశాడు. ఫైల్ నెంబర్ 046811 నిబంధనల ప్రకారం భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే ముందు సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి (ఫీల్డ్ ఎంక్వయిరీ) స్థలాన్ని పరిశీలించాలి. కానీ, మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా, గుడ్డిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పాత ఫొటోలనే ప్రామాణికంగా తీసుకుని అక్టోబర్ 31న ఏకంగా స్టిల్ట్‌3 నిర్మాణానికి అనుమతులు జారీ చేశారు. అప్పటికే స్లాబులు వేసి సగం పూర్తయిన అక్రమ కట్టడానికి కొత్తగా అనుమతులు రావడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. క్షేత్రస్థాయిలో భవనం కళ్లముందే కనిపిస్తున్నా, అక్కడ ఖాళీ స్థలం ఉందని అనుమతులు ఇవ్వడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యతలు మరచి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన టౌన్ ప్లానింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

టౌన్ ప్లానింగ్ ఏసిపి బాల శ్రీనివాస్ ను వివరణ కోరగా.. నిర్మాణంలో ఉన్న బిల్డింగుకు అనుమతులు ఇవ్వడం కుదరదు. నేను ఫీల్డ్ వెరిఫికేషన్ కు వెళ్లలేదు, అక్కడ రెండంతస్తుల భవనం ఉందని నాకు తెలియదు సెక్షన్ అధికారి మేఘన ఫీల్డ్ వెరిఫికేషన్ క్కి వెళ్లి చూడాలి, ఆమె అన్ని క్లియర్ గా ఉన్నాయని నాకు ఫైల్ పంపింది, నేను డిప్యూటీ కమిషనర్ కు ఫార్వర్డ్ చేయడంతో ఆమె అనుమతులు జారీ చేశారని బాధ్యత లేకుండా దాటవేశాడు.



దేశానికి విశిష్ట సేవలందించిన 70 మంది సైనిక సుబేదార్లు, రక్షణ శాస్త్రవేత్తలకు సన్మానం

శంషాబాద్,నవంబర్11(జనం సాక్షి) : యతీంద్ర సప్రతి నాలుగో రోజున దేశానికి విశిష్ట సేవలందించిన 70 మంది సైనిక సుబేదార్లు, రక్షణ శాస్త్రవేత్తలను శ్రీ చిన్న జీయర్ స్వామి సత్కరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో వీరమరణం పొందిన ఆరుగురు సైనికుల కుటుంబ సభ్యులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్గిల్ యుద్ధ వీరుడు, భారతదేశ అత్యున్నత శౌర్య పురస్కారమైన పరమవీర చక్ర అవార్డు గ్రహీత గోరఖ్ కెప్టెన్ యోగేంద్ర సింగ్ యాదవ్, రిటైర్డ్ గ్రూప్ కెప్టెన్ కె. నచికేత పాల్గొన్నారు. వీరితో పాటు సుమారు 25 మంది రక్షణ శాస్త్రవేత్తలు, అగ్ని, బ్రహ్మోస్ వంటి క్షిపణి కార్యక్రమాలకు సంబంధించిన ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైనికుల త్యాగాలు, దేశ రక్షణలో వారి సేవలను కొనియాడారు. భారతదేశం ఎప్పుడూ ఇతరులపై ఆధిపత్యం కోసం ప్రయత్నించదని, శాంతిని కోరుకుంటూనే దేశ రక్షణ విషయంలో రాజీపడబోదని వక్తలు పేర్కొన్నారు. దేశ భద్రత, సాంకేతిక అభివృద్ధిలో సైనికులు, శాస్త్రవేత్తల పాత్ర కీలకమని తెలిపారు.



పర్యావరణ పరిరక్షణకు ఈవీ మోటార్స్

పది రూపాయల ఖర్చుతో100 కిలోమీటర్లు ప్రయాణం చేయండి

మొయినాబాద్ నవంబర్ 11 (జనం సాక్షి) : మొయినాబాద్ మున్సిపాలిటీ అజీజ్ నగర్ చౌరస్తా లో నూతన ఏ ఎస్ పి ఆర్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (డిగ్నిటీ) ఈవి మోటార్స్ షోరూంను కాసోజు నరసింహ చారి ప్రారంభించారు ఈ కార్యక్రమానికి డిగ్నిటీ సిఎండి అల్లు శ్రీధర్ రెడ్డి , అడ్మినిస్ట్రేటర్ ఝాన్సీ ,, వైస్ చైర్మన్ ఆర్కె , ఆర్గనైజర్ వి బాలరాజ్ , విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మండల అధ్యక్షుడు రాంపల్లి సంతోష్ కుమార్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ చారి, వైస్ చైర్మన్లు రాజ్ గోపాల్ చారి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు ఇంధన వాహనాలు వాడడం వల్ల వాతావరణ కాలుష్యం అధికం కావడంతో మానవుని మనుగడ పూర్తిగా నశించిపోతుందని వారు అన్నారు రాబోయే కాలం మొత్తం ఎలక్ట్రికల్ వెహికల్ రంగం వస్తుందని ఆయన అన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్ వాడడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని అంతేకాకుండా నిరుద్యోగ యువతకు, పార్ట్ టైం చేసుకునే వారికి ఈ కంపెనీ డైరెక్ట్ సెల్లింగ్ లో మంచి ఆదాయాన్ని పొందవచ్చని అన్నారు.

వీధి వ్యాపారులు పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శంషాబాద్,నవంబర్11(జనంసాక్షి) శంషాబాద్ జోన్ పరిధిలోని వీధి వ్యాపారులు ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా బ్యాంకు రుణాలు పొంది తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని జోనల్ కమిషనర్ కె. చంద్రకళ సూచించారు. శంషాబాద్ జోనల్ కార్యాలయంలో వీధి వ్యాపారులకు పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించి మంచి క్రెడిట్ చరిత్రను ఏర్పరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శంషాబాద్, జల్‌పల్లి, ఆదిబట్ల సర్కిళ్ల నుంచి నలుగురు చొప్పున మొత్తం 12 మంది వీధి వ్యాపారులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి. సత్యనారాయణ రెడ్డి, బి. వెంకట్రామ్, బి. సుమన్ రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్లు రాజశేఖర్, అశ్విని, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, టీఎఫ్ఎల్‌లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

గంగపుత్రులకు సముచిత గుర్తింపు,

గౌరవం కల్పించడం హర్షణీయం

- గంగపుత్రుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది
- జాతీయ ఫిషర్మెన్ సెక్రటరీ బిజ్జి శత్రురావు



ముషీరాబాద్, నవంబర్ 11 (జనం సాక్షి): గంగపుత్రులకు సముచిత స్థానం, గుర్తింపు కల్పిస్తూ వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేయడం హర్షణీయమని ఏఐసీసీ జాతీయ ఫిషర్మెన్ సెక్రటరీ బిజ్జి శత్రురావు అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో బుధవారం గంగపుత్ర జాతిపిత ఆచార్య సందిరి బాలయ్య గంగపుత్ర 115వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జైసింహ, సికింద్రాబాద్ జోన్ డీసీపీ నరసయ్య, ఏసీపీ యాదయ్య, ఏఐసీసీ జాతీయ ఫిషర్మెన్ సెక్రటరీ బిజ్జి శత్రురావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య సందిరి బాలయ్య గంగపుత్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గంగ పుత్రుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను వక్తలు స్మరించుకున్నారు. సమాజంలో గంగపుత్రులకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆచార్య సందిరి బాలయ్య చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం బిజ్జి శత్రురావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల సంఘాల అభ్యున్నతికి, ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇస్తూ ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టడం అభినందనీ యమన్నారు. ఇందులో భాగంగా గంగపుత్రులకు మూడు ఎకరాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి రూ. 5 కోట్ల నిధులు కేటాయించడం సంతోషకరమని పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. గంగపుత్రుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, ఆచార్య సందిరి బాలయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జి. శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాములు, గంగపుత్ర సంఘం నాయకులు సాయి తేజ, సంపత్ పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా తాగునీటి కష్టాలు!

- మూలకు చేరిన ఎస్సీ కాలనీ బోరు
- చుక్క నీటి కోసం కాలనీవాసుల అవస్థలు
- ఇతర కాలనీలపై ఉన్న శ్రద్ధ ఇక్కడేదని ప్రశ్న
- వివక్ష లేకుండా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కోట్‌పల్లి, నవంబర్ 11 (జనంసాక్షి): కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. కాలనీవాసులకు నీరందించే బోరు గత నాలుగు నెలలుగా పనిచేయకపోవడంతో ప్రజలు చుక్క నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా మరమ్మతు లు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని బోరు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర కాలనీల్లో సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించే అధికారులు ఎస్సీ కాలనీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. దళితవాడ కావడం వల్లే చిన్నచూపు చూస్తున్నారా అని నిలదీస్తున్నారు. ప్రజలందరికీ సమానంగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బోరుకు మరమ్మతులు చేయించడంతో పాటు కాలనీలోని ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి అండ.. 14 మందికి రూ.4.49 లక్షల ఆర్థిక సాయం

అల్వాల్, నవంబరు 11 (జనంసాక్షి): అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మచ్చబొల్లారం, అల్వాల్, వెంకటాపురం డివిజన్లకు చెందిన 14 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 4,49,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. వైద్య సాయం అవసరమైన వారు అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ నాయకుడు పటోళ్ల సురేందర్‌రెడ్డి, వెంకన్న, అనిల్‌కిషోర్‌గౌడ్, డోలి రమేష్, శ్రీధర్‌గౌడ్, సురేష్, సాజిద్, అర్జున్, ప్రేమ్, సంపత్ పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

- సిమ్స్ రామగుండంలో ..ర్యాగింగ్ వ్యతిరేక, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన
- మాదకద్రవ్యాల బారిన పడకుండా భవిష్యత్తును కాపాడుకోవాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



గోదావరిఖని, జనంసాక్షి : విద్యార్థుల్లో ర్యాగింగ్ వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు రామగుండంలోని సిమ్స్ మెడికల్ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలోని లెక్చర్ హాల్–2లో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దయాళ్ సింగ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జిజిహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖతో పాటు వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ అనేది విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, విద్యాభ్యాసానికి, మానసిక ప్రశాంతతకు తీవ్ర విఘాతం కలిగించే చర్య అని తెలియజేస్తూ, కళాశాలల్లో ర్యాగింగ్‌కు ఎలాంటి స్థానం ఉండకూడదనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని, వారిని ప్రోత్సహిస్తూ విద్యా, వ్యక్తిగత అభివృద్ధికి సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. తోటి విద్యార్థులను వేధించడం, భయపెట్టడం, అవమానించడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడకూడదని, ర్యాగింగ్‌కు సంబంధించిన ఘటనలు ఎదురైతే బాధితులు భయపడకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అవగాహన కల్పించారు.

అదేవిధంగా మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన అలవాటని ఆయన వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక స్థితి, విద్యాభ్యాసం, కుటుంబ సంబంధాలు, సామాజిక జీవనంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడతాయని తెలియజేశారు. ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అంబర్ కిషోర్ సూచించారు. విద్యార్థులు చెడు స్నేహాలకు, మాదకద్రవ్యాల ప్రలోభాలకు దూరంగా ఉండాలని, తమ లక్ష్యాలపై దృష్టి సారించి క్రమశిక్షణతో చదువుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం అందించారు. ర్యాగింగ్ రహిత విద్యాసంస్థలు, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ర్యాగింగ్ పట్ల వ్యతిరేక భావనను, మాదకద్రవ్యాల వినియోగంపై అప్రమత్తతను పెంపొందించడంతో పాటు, సురక్షితమైన, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలనే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైద్య అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రగతికి చదువే ఆధారం

- 20 ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదుల ఏర్పాటు
- పెద్దూర్ ఎంపీహెచ్‌ఎస్‌లో ప్రారంభించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఆదర్శమూర్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపు
- సీఎస్ఆర్ నిధులతో విద్యాసంస్థల్లో ఆధునిక వసతులు



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): విద్యార్థుల ప్రగతికి చదువే ప్రధాన ఆధారమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ ఎంపీహెచ్‌ఎస్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ తరగతి గదిని బుధవారం ఆమె ప్రారంభించారు. జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు కోటి రూపాయలతో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలలో తరగతి గదికి రంగులు వేయడంతో పాటు నాలుగు ఫ్యాన్లు, లైట్లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, 10 డెస్కులు, యూపీఎస్ సదుపాయాలు కల్పించారు. సిరిసిల్ల, వేములవాడ, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి మండలాల్లోని ఎంపీపీ, జడ్పీ పాఠశాలలకు ఈ వసతులు అందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువు వ్యక్తి వికాసానికి, అభివృద్ధికి ఆయుధంగా ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి సేవలందించారని గుర్తుచేశారు. సుధామూర్తి వంటి ఆదర్శ వ్యక్తుల విద్యాభ్యాసం కూడా విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. వారి విలువలు, సేవలను ఆదర్శంగా తీసుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. పుట్టిన ప్రాంతం, మాట్లాడే భాష, ఆర్థిక పరిస్థితి, కుటుంబ నేపథ్యం ఉన్నత విద్యకు అడ్డంకులు కావని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించి ఉన్నత ఉద్యోగాలు, స్వయం ఉపాధి లేదా తమకు నచ్చిన రంగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో సీఎస్ఆర్ నిధులతో వసతులు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రూ. 22 లక్షలతో 145 పడకలు, పరుపులు ఏర్పాటు చేశారు. త్వరలో జిల్లాలోని పలు ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సీఎస్ఆర్ నిధులతో వసతుల కల్పన చేపట్టనున్నారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్‌సాగర్, తహసీల్దార్ మహేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్‌కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, నాగేశ్వరరావు, కమలాకర్, మండల విద్యాధికారి దూస రఘుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేరు పెద్ద.. ఊరు దిబ్బలా కంది సాగు

- కల్పితం కాని యాదృచ్ఛిక కథ.. రైతు వ్యథ
- ఒకప్పుడు అధిక దిగుబడులు..
- నేడు కరవు కోరల్లో యాలాల రైతులు



యాలాల, (జనంసాక్షి) : ఒకప్పుడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే కంది సాగుకు ప్రత్యేక గుర్తింపు పొందిన మండలం యాలాల. మండలంలోని పలు గ్రామాలతోపాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల వరకు కంది సాగు విస్తరించి ఉండేది. జిల్లాలో అధిక దిగుబడులు సాధించిన ప్రాంతంగా పేరొందిన యాలాలలో నేడు కంది సాగు తగ్గిపోవడం, ఈసారి వర్షాభావంతో పంట దిగుబడులు పూర్తిగా దెబ్బతినడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

పెట్టుబడుల భారం.. పత్తి వైపు రైతుల చూపు!

కంది సాగులో పెరుగుతున్న పెట్టుబడులు, కూలీల ఖర్చులు, వాతావరణ అనిశ్చితి కారణంగా రైతులు క్రమంగా ఈ పంటకు దూరమవుతున్నారు. మరోవైపు వాణిజ్య పంటగా పత్తి సాగుపై ఆసక్తి పెరగడంతో కంది సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈసారి సరైన సమయంలో వర్షాలు కురవక, పంట ఎదుగుదలకు తగిన తేమ అందక దిగుబడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం కరవు ప్రాంతంగా గుర్తించిన యాలాల మండలంలో రైతులు పెట్టిన పెట్టుబడులు, చేసిన అప్పులు భారంగా మారాయి.

అంతర్జాతీయ మార్కెట్‌కు కందిపప్పు.. స్థానిక పరిస్థితి ఏమిటి?

మరోవైపు చెన్నారంలోని కేవీఎస్ దాల్ ఇండస్ట్రీస్ నుంచి ఆస్ట్రేలియా వంటి విదేశీ మార్కెట్లకు కందిపప్పు ఎగుమతి అవుతుండటం స్థానిక పరిశ్రమలకు గర్వకారణం. ప్రాంతీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు రావడం అభినందనీయమే. అయితే ఒకప్పుడు కంది సాగుకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంలోనే పంట దిగుబడులు పడిపోతున్న నేపథ్యంలో దేశీయ అవసరాలను ఎలా తీర్చాలన్న ప్రశ్న తలెత్తుతోంది. కందిపప్పు కోట్లాది కుటుంబాల నిత్యావసర ఆహార పదార్థం. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు కందిపప్పు ధరలు మరింత భారమైతే కుటుంబ బడ్జెట్లపై ప్రభావం పడుతు ంది. ఒకవైపు పంట దిగుబడులు తగ్గడం, మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ నేపథ్యంలో దేశీయ అవసరాలకు సరిపడా నిల్వలు, అందుబాటు ధరల్లో సరఫరా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎగుమతుల తోపాటు స్థానిక వినియోగదారుల అవసరాలకూ ప్రాధాన్యత ఇవ్వాలి.

రైతులకు అండగా నిలిచేదెప్పుడు?

యాలాల మండలంలో కంది సాగు తగ్గడానికి గల కారణాలపై వ్యవసాయ శాఖ అధ్యయనం చేయాలి. కరవుతో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలి. కంది సాగును ప్రోత్సహించేలా సాంకేతిక సహకారం కల్పించాలి. ఒకప్పుడు అధిక దిగుబడులతో గుర్తింపు పొందిన యాలాలలో మళ్లీ కంది సాగు పుంజుకోవాలంటే రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉంది.

వైద్య నియామకాలు.. సంక్షేమ పథకాలపై సమీక్ష

- కొడంగల్ వైద్య కళాశాలలో 36 పోస్టులకు ఇంటర్వ్యూలు
- నవంబర్ 12న వాక్‌ఇన్ ఇంటర్వ్యూల నిర్వహణ
- అర్హులందరికీ చేయూత పింఛన్లు అందించాలి
- భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టాలి



వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 36 ఫ్యాకల్టీ, ట్యూటర్ పోస్టుల భర్తీకి ఈ నెల 12న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను కాంట్రాక్ట్ ప్రాతిపదికన, ట్యూటర్లను హానరేరియం ప్రాతిపదికన నియమించనున్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వికారాబాద్ కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయి. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత, అనుభవం, రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని అధికారులు సూచించారు. పోస్టుల వారీగా అర్హతలు, ఖాళీల వివరాలు, దరఖాస్తు నమూనా కళాశాల వెబ్‌సైట్ www.gmckodangal.org లో అందుబాటులో ఉన్నాయి.

మరోవైపు చేయూత పింఛన్ల మంజూరు ప్రక్రియ, విబిజి రామ్‌జీ పనులపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హతలను నిర్ధారించాలన్నారు. వికలత్వంపై అనుమానాలుంటే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని సూచించారు. అనర్హులకు పింఛన్లు మంజూరైనట్లు తేలితే సంబంధిత అధికారులపై విజిలెన్స్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెంచేందుకు నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వర్షపు నీటిని సంరక్షించడం, గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించడం లక్ష్యంగా విబిజి రామ్‌జీ పథకం కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీఆర్డీఓ సుధీర్, అదనపు డీఆర్డీఓ నర్సింలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
12 నవంబర్ 2026

రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మహమ్మదాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) : రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎండిపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించడంతో పాటు రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేసి అన్నదాతలను ఆదుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం మహమ్మదాబాద్ మండలంలోని కంచన్‌పల్లి, అన్నారెడ్డిపల్లి, గాధిర్యాల్ గ్రామాల్లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, పర్యటించి ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడి వారి సాగు కష్టాలు,పంట నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి వ్యవసాయానికి అండగా నిలిచిందని నాయకులు గుర్తుచేశారు.

గ్రామాలకు అందని మిషన్ భగీరథనీరు

బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు.అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసిందని తెలిపారు.అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో ప్రజలకు సక్రమంగా తాగునీరు అందడం లేదని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.ప్రజలకు కనీస అవసరమైన



తాగునీటిని కూడా అందించలేని పరిస్థితి నెలకొందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.

చెరువులు నింపి..కాలువల పంట పొలాలకు ద్వారా సాగునీరు

రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి గ్రామంలోని చెరువులను నింపి,కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు.రైతుల కష్టాలను తెలుసుకునేందుకు పాలకులు గ్రామాల్లో పల్లెనిద్రలు చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పి బీఆర్ఎస్ పార్టీని,ఘనవిజయం వైపు నడిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.అప్పటివరకు ప్రజలు ఓపికతో ఉండాలని కోరారు.

మూడు బోర్లువేసినా దక్కని నీరు..రైతుకు కన్నీరే మిగిలింది



కంచన్‌పల్లి గ్రామంలో సాగునీరు అందక వరి పంట ఎండిపోవడంతో ఓ రైతు తన పంటను కాపాడుకునేందుకు ఒకే చోట ఏకంగా మూడు బోర్లు వేయించినా ఫలితం లేకుండా పోయింది.భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలో చుక్క నీరు కూడా పడకపోవడంతో పెట్టుబడి ఖర్చులన్నీ వృథా అయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పచ్చని పంట పొలాలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు.అప్పులు తెచ్చి పంటలు చేశాం పంటలు ఎండిపోవడంతో అప్పుల బాధ తట్టుకోలేక వలస పోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నట్లు,మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ కి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల మళ్లీ పాత రోజులు వచ్చాయని రైతులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో,బిఆర్ఎస్ పార్టీ,మండల అధ్యక్షుడు దిండికడి గోపాల్,మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి,మాజీ అధ్యక్షుడు బిక్షపతి,గాధిర్యాల్ మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి,బాల్ రెడ్డి,తిరుమల్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచులు,నాయకులు,రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటించాలి
- గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో 6,516 నూతన రేషన్ స్మార్ట్ కార్డులు



గుమ్మడిదల, నవంబర్ 11 (జనంసాక్షి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ సూచించారు. అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరం కాకూడదని, అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేయాలని అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఐదు గ్రామాలకు సంబంధించి ప్రభుత్వం మొత్తం 6,516 నూతన రేషన్ స్మార్ట్ కార్డులను మంజూరు చేసిందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. తహసీల్దార్ పరమేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు పద్మ, మాధవి, నాయకులు నర్సింగ్ రావు పాల్గొని లబ్ధిదారులకు నూతన రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- సీడీసీ చైర్మన్ గడిల రాంరెడ్డి



సదాశివపేట, నవంబర్ 11 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యమని సీడీసీ చైర్మన్ గడిల రాంరెడ్డి అన్నారు. బుధవారం సదాశివపేట మండలం మాచిరెడ్డిపల్లి గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కలాలి మోహన్ గౌడ్, లబ్ధిదారులతో కలిసి ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గడిల రాంరెడ్డి మాట్లాడుతూ, ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విడతలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్లు అందించకుండా కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బగ్గ శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కర్ణం సందీప్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, హౌసింగ్ ఏఈ రేష్మ, సర్పంచులు మల్లేశం, దేవి సింగ్, రాములమ్మ, లక్ష్మయ్య, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



జడ్చర్ల, నవంబర్ 11 (జనంసాక్షి) : మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు బోయలకుంట ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను బుధవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. నూతన గృహాలు అందుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పారదర్శకంగా కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జడ్చర్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కోనేటి పుష్పలత నరసింహులు కుమారుడి నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలి

వనపర్తి, నవంబర్ 11 (జనం సాక్షి) : వి.బి.జి. రామ్ జి (ఉపాధి హామీ) పథకం కింద జిల్లాలో చేపట్టాల్సిన అన్ని పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్ అధికారులను ఆదేశించారు. పనుల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి హామీ పనుల పురోగతిని సమీక్షించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్న ఖీమ్య నాయక్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం, బోరుబావుల రీఛార్జ్ పనులు, వ్యవసాయ కుంటల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఎంపీడీఓ తమ పరిధిలోని గ్రామాల్లో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం వద్ద తగినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయని, పనులు పూర్తయిన 15 రోజుల్లోగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి నిధుల కొరతపై ఆందోళన చెందకుండా పనులను ప్రారంభించి వేగంగా పూర్తి



చేయాలన్నారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచులతో సమన్వయం చేసుకుంటూ కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే కూలీల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించి ఎక్కువ మంది కూలీలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ ఉమాదేవి, జెడ్పీ సీఈఓ యాదయ్య, డిప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాయికోడు, నవంబర్ 11 (జనం సాక్షి) : నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చర్ల రాయిపల్లి గ్రామంలో చిన్నగోల్ల జ్యోతి- శ్రీశైలం కు సంబంధించిన నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలంలో 600 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు.ఇది మాటల ప్రభుత్వం కాదని ఇది చేతుల ప్రభుత్వమని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని గుర్తు చేశారు. అందులో భాగమే నిరుపేదలకు ఇందిరమ్మ గృహాల నిర్మాణం అని తెలియజేశారు. అర్హులు అందరికీ నూతన ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.



అనంతరం అతిథులందరికీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకరణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్ కుమార్,మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పటేల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్శన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్,మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి రఫిక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి సుల్తాన్,సర్పంచులు నవీన్, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్, నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షులు ఆర్ రాజు,నాయకులు మిన్నూర్ శ్రీశైలం,రవి పాటిల్, అలిముదిన్, నర్సింహులు, పలువురు నాయకులు గ్రామస్తులు తదితరులున్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 11 (జనం సాక్షి) : ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారం, మిస్సింగ్ కేసుల ఛేదన, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో



ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి



బాలానగర్, నవంబర్ 11 (జనం సాక్షి) : జాతీయ రహదారి 44పై బాలానగర్ మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో అక్కడ ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మరోచోటుకు తరలించారు. అయితే విగ్రహాన్ని తరలించే సమయంలో కాంట్రాక్టర్ ఇచ్చిన హామీ మేరకు నూతన విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు, విగ్రహం చుట్టూ ప్రహరీ గోడ, ఐమాక్స్ లైట్లు, గ్రీన్ పార్క్, గ్రానైట్ పనులు, మెట్లు, శిలాఫలకం తదితర సదుపాయాలను కల్పించాల్సి ఉంది. ఈ పనులన్నింటినీ తానే భరిస్తానని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని బాలానగర్ మండల అంబేద్కర్ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి అంబేద్కర్ విగ్రహ నిర్మాణంతో పాటు, హామీ ఇచ్చిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బాలనగర్ మండల దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- అదనపు కలెక్టర్ మధుమోహన్



గద్వాల నడిగడ్డ, నవంబర్ 11 (జనం సాక్షి) : ప్రజలకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యంను విక్రయించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. బుధవారం ఐడిఓసిలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో బియ్యం వ్యాపారులు, రైస్ మిల్లర్లతో సమావేశమై మాట్లాడారు. బియ్యం అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత సృష్టించి దురుద్దేశంతో ధరలు పెంచే కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యాన్ని కేజీ రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం రూ.74, హెచ్ఎంటి, జెఎస్ఆర్ రకం రూ.79కు మాత్రమే విక్రయించాలన్నారు. రైస్‌మిల్లులు, గోదాములు, హోల్‌సేల్, రిటైల్ విక్రయ కేంద్రాల్లో పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో తనిఖీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అధిక లాభాల కోసం వ్యాపారులు కుమ్మక్కై బియ్యం సరఫరాను నిలిపివేయడం, ప్రభుత్వ బియ్యాన్ని అక్రమంగా దారి మళ్లించడం, తప్పుడు బిల్లులు లేదా రికార్డులతో అక్రమ వ్యాపారం నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టం నిర్దేశించిన పరిస్థితులు, తగిన ఆధారాలు ఉన్న కేసుల్లో పీడీ చట్టం కింద నిర్బంధ చర్యల కోసం సంబంధిత సమర్థ అధికారికి ప్రతిపాదనలు సమర్పిస్తామని స్పష్టం చేశారు.బియ్యం వ్యాపారులు కొనుగోలు,అమ్మకాలు, నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, వర్తించే ప్రభుత్వ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలు బియ్యం కొరతపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని అదనపు కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

జడ్చర్ల, నవంబర్ 11 (జనంసాక్షి) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావుకు బీజేవైఎం మండల అధ్యక్షుడు కొండా గణపతి గుప్తా, టౌన్ అధ్యక్షుడు విశ్వనాథ్ చారి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయిలు రాక విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని, విద్యా హక్కులను కాపాడాలని కోరారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయి ముదిరాజ్, వినయ్, ఓర్సు నరేష్, కుమార్, శ్రీశైలం యాదవ్, రాఘవేందర్, నవీన్, శశాంక్, కార్తీక్, దినేష్, కృష్ణారెడ్డి, అరుణ్, శివ కుమార్ పాల్గొన్నారు.



సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడులు

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ఈర్లపల్లిలో గో ఆధారిత సేంద్రీయ క్షేత్రం సందర్శన

జడ్చర్ల, నవంబర్ 11 (జనంసాక్షి) : రసాయన రహిత సేంద్రీయ వ్యవసాయంతో సాగు వ్యయం తగ్గి, తక్కువ నీటితో అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి భూగర్భ జలాల ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలు, సేంద్రీయ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. బుధవారం జడ్చర్ల మండలం ఈర్లపల్లి లో రైతు రాజవర్ధన్ రెడ్డి 34 ఎకరాల్లో అభివృద్ధి చేసిన గో ఆధారిత సమీకృత సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించి, సోలార్ పాలీ టన్నెల్ ప్రారంభించారు. క్షేత్రంలో గో ఆధారిత విధానాలు, పశుపోషణ, ఉద్యాన పంటల పెంపకం, మునగాకు పొడి తయారీని పరిశీలించారు. సహజ ఎరువుల తయారీ, తక్కువ నీటి వినియోగ సాగు తీరును అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా, నేల సారం పెంచుతూ అంతర పంటల సాగు అభినందనీయమని, ఇలాంటి క్షేత్రాలు ఇతర రైతులకు ఆదర్శమని పేర్కొన్నారు. పప్పుధాన్యాలు, కూరగాయలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన పెంచుకోవాలని కోరారు. సేంద్రీయ సాగులో ప్రారంభంలో పర్యవేక్షణ అవసరమైనా, రసాయనాల వాడకం తగ్గడం వల్ల దీర్ఘకాలంలో సాగు ఖర్చు తగ్గుతుందని స్పష్టం చేశారు. ఐటీ రంగ నిపుణులు సైతం సేంద్రీయ సాగు వైపు రావడం సంతోషకరమన్న కలెక్టర్, రైతుల పిల్లలకు ఆధునిక పద్ధతులపై శిక్షణ కల్పించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం కోసం సొంత అవసరాలకు రసాయన రహిత పంటలు పండించుకోవాలని, చిరుధాన్యాలు, కూరగాయలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ నిపుణులు విజయరామ్, హుస్సేన్ బాబు, ముకుంద రెడ్డి సేవలను కొనియాడారు. జిల్లాలో మరిన్ని



సేంద్రీయ క్షేత్రాల ఏర్పాటుకు సాంకేతిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సేంద్రీయ వ్యవసాయ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

కారు ఢీకొని భార్యాభర్తలు మృతి!

□ మరో నాలుగు రోజుల్లో శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం



మరిపెడ, నవంబర్ 11 (జనంసాక్షి) : మరో నాలుగు రోజుల్లో శుభకార్యం జరగాల్సిన ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. శుభకార్యం పనుల్లో ఉన్న కుటుంబ పెద్దలను విధి వక్రీకరించిశీది. కారు రూపంలో మృత్యువు కబలించింది. బుధవారం ఈ విషాద కర సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బాలినే ధర్మారం స్టేజి సమీపంలో 365 జాతీయ రహదారిపై ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం! మరిపెడ మండలంలోని లచ్చ తండకు చెందిన దంపతులు బానోతు సామ, (50), పద్మ(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దంపతులు మరిపెడ పట్టణానికి బైక్ పై బయలుదేరగా! సూర్యాపేట నుంచి వస్తున్న కారు అతి వేగంగా బైకును ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి మరిపెడ ఎస్సై బానోతు వెంకన్న చేరుకుని విచారణ చేపట్టారు. దంపతులు ఇద్దరు మృతి చెందడంతో ల చ్చతండలో విశాద ఛాయలు అలుకున్నాయి. కుటుంబ సభ్యులు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ల దోపిడీ

□ నిర్మాణానికి అధిక మొత్తంలో పైసా వసూల్...



నూగూర్ వెంకటాపురం నవంబర్ 11(జనం సాక్షి) : వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల అధ్యక్షులు తుర్స కృష్ణ బాబు అధ్యక్షతలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఆదివాసులకు విడుదల చేసినటువంటి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిరుపేదలకు చెందాల్సిన ఇల్లు ధనికులకు, అధికార పార్టీ రాజకీయ నాయకుల అండదండలతో నిరుపేదలకు చెందాల్సిన ఇల్లు చెందకుండా సొంతింటి కల కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిరుపేద ఆదివాసులకు ఇళ్లను మంజూరు చేస్తుండగా, ఇళ్ల నిర్మాణం పేరుతో కొంతమంది కాంట్రాక్టర్లు అమాయక ఆదివాసుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం నిరుపేద ఆదివాసులకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుంటే, కొంతమంది కాంట్రాక్టర్లు లబ్ధిదారుల ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడం సరికాదని అన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్న ఆదివాసి నిరుపేద కుటుంబాలపై అదనపు భారం మోపకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల అధ్యక్షులు తుర్స కృష్ణ,బాబు మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు,సోడి గోపి,సంద, సూరిబాబు,తదితరులు పాల్గొన్నారు.

బాసర ఐఐఐటీ విద్యార్థులకు నిరంతరం సురక్షిత తాగునీరు అందించాలి

□ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



బాసర, నవంబర్ 11 (జనం సాక్షి): బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నిరంతరం పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం బాసర ఐఐఐటీ (ఆర్జీయూకేటీ)లో విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, క్యాంపస్‌లో నీటి సరఫరా సమస్యలు, ఇతర ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాగునీటి నాణ్యతను పరీక్షించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే విద్యార్థులకు అందించాలని సూచించారు. నీరు ఎక్కడ కలుషితమవుతుందో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటితో పాటు రోజువారీ అవసరాలకు సరిపడా నీటిని నిరంతరం సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తమ సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఐఐటీ ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళి దర్శన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొర్రూరు - కంటాయపాలెం రహదారి అభివృద్ధికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపన

□ రూ.4.92 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు..

□ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం



తొర్రూరు, నవంబర్ 11 (జనం సాక్షి): తొర్రూరు మండల ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న తొర్రూరు – కంటాయపాలెం రహదారి అభివృద్ధికి అడుగులు పడ్డాయి. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి గారు ఈ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.తొర్రూరు పట్టణం నుంచి కంటాయపాలెం గ్రామానికి వెళ్లే రహదారి ఎంతో ప్రాధాన్యత కలిగినది. ఈ మార్గం ద్వారా నిత్యం అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ రహదారిపై ఆధారపడి ప్రయాణాలు చేస్తుంటారు. రహదారి అభివృద్ధి పూర్తయితే ప్రజల ప్రయాణ కష్టాలు తగ్గడంతో పాటు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.ఈ నేపథ్యంలో సుమారు రూ. 4.92 కోట్ల వ్యయంతో తొర్రూరు పట్టణ పరిధిలోని తొర్రూరు – కంటాయపాలెం రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రహదారి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించగా, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు ప్రారంభమ య్యేలా కృషి చేశారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి మెరుగైన రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. రహదారి అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం తొర్రూరు నుంచి కంటాయపాలెం వరకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ఈ అభివృద్ధి పనులతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు చేకూరనుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవతో మరో కీలక అభివృద్ధి పనికి శ్రీకారం చుట్టడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కేటీఆర్ రాకతో నిర్మల్ గులాబీమయం!

□ అట్టహాసంగా రైతు గర్జన సభ.. విజయవంతం

□ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల వర్షం..





నిర్మల్ బ్యూరో, నవంబర్ 11 (జనం సాక్షి): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) రాకతో నిర్మల్ జిల్లా కేంద్రం గులాబీమయంగా మారింది. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రామ్ కిషన్ రెడ్డి నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రైతు గర్జన బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎటుచూసినా గులాబీ జెండాలు, పార్టీ కండువాలు, కేటీఆర్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, తోరణాలతో నిర్మల్ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి పెద్దపీట వేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న ఎరువులు, విత్తనాల కొరత, సాగునీటి ఇబ్బందులు, విద్యుత్ సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో అవసరమైన వనరులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి అండగా నిలుస్తూ వారి హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిపై కేటీఆర్ విమర్శలు

నిర్మల్ స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నిర్మల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన మహేశ్వర్‌రెడ్డి ప్రజల కోసం ఏం పని చేశారని, ఆయన ఇప్పటివరకు నియోజకవర్గానికి ఏం సాధించారని ప్రశ్నించారు. బీజేపీ శాసనసభాపక్ష నేతగా బిజీగా ఉంటున్న ఆయన నిర్మల్ అభివృద్ధికి చేసిన కృషి ఏమిటో ప్రజలకు వివరించాలని విమర్శించారు. స్థానిక ప్రజల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయ రంగానికి అందించిన ప్రాధాన్యతను గుర్తుచేస్తూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని కేటీఆర్ వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

కేటీఆర్ పర్యటనతో గులాబీ శ్రేణుల్లో జోష్

కేటీఆర్ రాక సందర్భంగా నిర్మల్ పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు బీఆర్ఎస్ జెండాలు, ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలతో అలంకరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహిస్తూ కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. జిల్లా నలుమూలల నుంచి రైతులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావడంతో రైతు గర్జన సభ అట్టహాసంగా సాగింది. కేటీఆర్ ప్రసంగానికి పార్టీ శ్రేణుల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తంగా కేటీఆర్ పర్యటనతో నిర్మల్ జిల్లా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కగా, రైతు గర్జన సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిపై నూతన వంతెన, చెక్‌డ్యామ్ నిర్మాణానికి సర్వే

□ సారంగాపూర్ నుంచి వాల్గొండ రామాలయం వరకు ఇరిగేషన్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



కడెం, నవంబర్11(జనం సాక్షి) : మండలంలోని సారంగాపూర్ నుంచి వాల్గొండ గ్రామ రామాలయం సమీపం వరకు గోదావరి నదిపై నూతన వంతెనతో పాటు చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు బుధవారం రోజున క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు.ఈ ప్రతిపాదిత నిర్మాణాలు కార్యరూపం దాలిస్తే పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు రైతులకు సాగునీటి అవసరాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.వంతెన నిర్మాణం ద్వారా గోదావరి నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కానున్నాయి. చెక్‌డ్యామ్ నిర్మాణం ద్వారా నీటి నిల్వ పెరిగి వ్యవసాయానికి మే లు జరుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల సర్వే అనంతరం సమగ్ర నివేదిక సిద్ధం చేసి, నిర్మాణ ప్రతిపాదనలను తదుపరి దశకు తీసుకెళ్లాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ గ్రామ సర్పంచ్ కోలా తేజస్విని శ్రీనివాస్, ఎల్లగడప సర్పంచ్ నర్సింగ్ అశ్విత రమేష్, జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల ఇరిగేషన్ శాఖ డీఈ తిరుమలరావు , ఏఈ, వాల్గొండ రామాలయం కమిటీ చైర్మన్ శంకర్, ఉపసర్పంచ్‌లు రమేష్, శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల లచ్చన్న, రాజేశ్వర్ రెడ్డి, భూమన్న, మాదాసు నర్సయ్య, జెట్టి నర్సయ్య, కుమ్మరి నరసయ్య, ఆర్మూర్ లక్ష్మణ్ రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు

□ శ్రీ సమ్మక్క-సారాలమ్మ రైస్ మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే డా.మురళి నాయక్



గూడూరు, నవంబర్ 11 (జనంసాక్షి): గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయాని ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ అన్నారు.బుధవారం గూడూరు మండలం అయోధ్యపురంలో పొనుగోడు గ్రామానికి చెందిన బొల్లికొండ మధు స్థాపించిన శ్రీ సమ్మక్క సారలమ్మ రైస్ మిల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే మురళి నాయక్ తో పాటు డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ హాజరై మిల్లును ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు. స్థానికంగా పరిశ్రమలు అభివృద్ధి చెందితే రైతులకు, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.వ్యవసాయ రంగానికి అనుబంధంగా రైస్ మిల్లుల ఏర్పాటు ఎంతో ఉపయోగకరమని, రైతుల పంటలకు విలువ జోడించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని తెలిపారు.యువకుడిగా వ్యాపార రంగంలో ముందడుగు వేసి రైస్ మిల్ ఏర్పాటు చేసిన బొల్లికొండ మధును ఎమ్మెల్యే అభినందించారు.ఆయన వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాలాజీ నాయక్,జిల్లా నాయకులు రమేష్ చందర్ రెడ్డి,బుదిగే సతీష్ గౌడ్,అర్రేం వీరాస్వామి, నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు డిప్యూటీ సీఎం భట్టికి ఎమ్మెల్యే నాయిని వినతి

□ మంజూరు కోసం సీఎండీకి ఆదేశాలు జారీ చేసిన డిప్యూటీ సీఎం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 11 (జనం సాక్షి) : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచి, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు హనుమకొండలోని బాలసముద్రం, కాకతీయ యూనివర్సిటీ (కేయూసీ) ప్రాంతాల్లో రెండు నూతన 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు కి విజ్ఞప్తి చేశారు. హనుమకొండ, వరంగల్ పట్టణాలతో పాటు కాజీపేట ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా, నివాస, వాణిజ్య, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర మౌలిక వసతుల కారణంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని ఎమ్మెల్యే వివరించారు.ప్రస్తుతం ఉన్న 33 కేవీ ఫీడర్లపై అధిక భారం పడటంతో తరచూ విద్యుత్ అంతరాయాలు, సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, నిర్వహణ పనులు చేపట్టే సమయంలో ప్రత్యామ్నాయ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేయడం కూడా ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్తులో పెరిగే విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని బాలసముద్రం, కేయూసీ ప్రాంతాల్లో నూతన 132/33 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన పరిపాలనాపరమైన అనుమ తులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత ప్రతిపాదనలను టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కి పంపించి, రెండు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు.

టీజీపీఎస్సీ ఛైర్మన్‌ను కలిసిన కలెక్టర్లు





వరంగల్, హనుమకొండ ప్రతినిధులు, నవంబర్ 11 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఛైర్మన్ బుర్రా వెంకటేశంను బుధవారం హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా కలిసిన ఈ భేటీలో పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఇంటి దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

□ ఇద్దరు నిందితుల అరెస్టు

□ రూ. 1.60 లక్షల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

చెన్నారావుపేట, నవంబర్ 11 (జనం సాక్షి): చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరిపల్లి గ్రామస్తురాలైన పల్లకొండ సమ్మక్క ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో పోలీసులు ఇద్దరు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెన్నారావుపేట ఎస్సై పొన్నాల గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఈ కేసులో పేరం రాకేశ్ అతని స్నేహితుడు (బాల నేరస్థుడు) ఇద్దరూ సూరిపల్లి గ్రామానికి చెందినవారు. వీరిద్దరూ కలిసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సమ్మక్క ఇంట్లోకి ప్రవేశించి సూట్‌కేసులో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. దొంగిలించిన ఆభరణాలను తమ వద్దనే దాచుకున్న నిందితులు వాటిని విక్రయించేందుకు బుధవారం రోజు నర్సంపేటకు బయలుదేరారు. ఈ క్రమంలో తిమ్మరాయినిపహాడ్ క్రాస్ రోడ్ వద్ద ఆటో కోసం వేచి ఉండగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. విచారణలో నిందితులు దొంగతనానికి సంబంధించిన వివరాలు వెల్లడించి వారి వద్ద నుండి రూ. 1.60 లక్షల చోరీ సొత్తును పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు పేరం రాకేశ్‌ను న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం అతనికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. బాల నేరస్థుడు జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరచగా బోర్డు ఆదేశాల మేరకు అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
12 నవంబర్ 2026

గోదావరి పుష్కరాల పనులు శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలి

- వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు
- భక్తులు, వీఐపీలకు వేర్వేరుగా సౌకర్యాలు కల్పించాలి
- అధికారులకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశాలు



భద్రాచలం, నవంబర్ 11 (జనంసాక్షి) : రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలో చేపడుతున్న ఘాట్ల అభివృద్ధి, ఆలయ పరిసరాల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. వచ్చే ఏప్రిల్ నాటికి పుష్కరాలకు సంబంధించిన అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తులు, వీఐపీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేర్వేరుగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బుధవారం భద్రాచలంలో పర్యటించిన ఆమె శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన అభివృద్ధి పనులు, నూతన గోదావరి పుష్కర ఘాట్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా పనుల పురోగతి, పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు భద్రాచలం వచ్చే అవకాశం ఉన్నందున వారికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, డ్రైనేజీ, వైద్య సేవలు, భద్రత, రవాణా, అగ్నిమాపక ఏర్పాట్లను అన్ని శాఖలు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పుష్కర వనం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని సేకరించాలని, వీఐపీలు, సాధారణ భక్తులకు వేర్వేరుగా పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. భక్తుల బస కోసం డార్మెటరీలను సిద్ధం చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దేవస్థానం, పుష్కర ఘాట్ల అభివృద్ధి పనుల కోసం రూ.348.59 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో ప్రతి శాఖకు అప్పగించిన పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులన్నింటినీ శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని, పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, సమస్యల కారణంగా పనులు నిలిపివేయరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, డీపీవో అనూష, ట్రాన్స్‌కో ఎస్ఈ మహేందర్, డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్, డీఏవో భగవాన్ రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోసంగిలో విద్యుత్ షాక్‌తో గడ్డి ట్రాక్టర్‌కు మంటలు..

- వ్యక్తికి తీవ్ర గాయాలు
- 108 సిబ్బంది తక్షణ స్పందన



గుర్రంపోడు, నవంబర్ 11 (జనంసాక్షి) : గుర్రంపోడు మండలం మోసంగి గ్రామ సమీపంలో విద్యుత్ షాక్‌తో గడ్డి ట్రాక్టర్‌కు మంటలు చెలరేగిన ఘటనలో పోలగోని మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే..నిండుమనూరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన పోలగోని మహేష్ గడ్డి లోడుతో ట్రాక్టర్‌పై మోసంగికి వెళ్తుండగా, గ్రామ సమీపంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో ట్రాక్టర్‌కు షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో గడ్డి కట్టలను తొలగించే ప్రయత్నం చేస్తుండగా మంటలు మహేష్‌కు అంటుకోవడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడిపోయాడు.ఈ ప్రమాదంలో మహేష్ కుడి తొడ ఎముకకు గాయంతో పాటు రెండు చేతులు, వీపు భాగంలో కాలిన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వైద్య సేవలు అందించారు. 108 వైద్యుడు డాక్టర్ శివ సూచనల మేరకు నొప్పి నివారణ ఇంజక్షన్ ట్రామడాల్ ఇచ్చి, కాలిన గాయాలకు నార్మల్ సెలైన్‌తో ప్రాథమిక చికిత్స చేశారు.అనంతరం 108 ఈఎంటీ సత్యనారాయణ, పైలట్ శివాజీ క్షతగాత్రుడిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

ఎల్‌నినో పై రైతులకు అవగాహన



అల్లాదుర్గం నవంబర్ 11 (జనంసాక్షి) : మండల పరిధిలోని ముస్లాపూర్ లో బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి నెలవంక మాట్లాడుతూ, రాబోయే రబీ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి పంట సాగు చేయవద్దన్నారు , నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరికి ,బదులు శనగ, కుసుమ, పెసర, మినుము వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఆమె సూచించారు. పంట మార్పిడినీ పాటిస్తూ, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మల్లయ్య, ఏ పి ఓ సుధాకర్ , గ్రామ సర్పంచి పడిగే జ్యోతి, పంచాయతీ కార్యదర్శి , రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల విస్తరణే లక్ష్యంగా ముందడుగు

- మహిళా సంఘాల బలోపేతానికి చేయూత
- రహదారులు, డ్రైనేజీలతో మెరుగైన పారిశుధ్యం
- ప్రజల చెంతకే సత్వర సేవల వ్యవస్థ
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 11 (జనం సాక్షి) : క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల విస్తరణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పెనగడప–అంబేద్కర్ నగర్, వెంకటేశ్వర కాలనీ, బంజారాహిల్స్, నందతాండా, గరిమెళ్ళపాడు ప్రాంతాల్లో దాదాపు రూ. 47 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అంబేద్కర్ నగర్‌లో రూ. 10 లక్షలు, వెంకటేశ్వర కాలనీలో రూ. 10 లక్షలతో నిర్మించిన వీవో భవనాలతో పాటు, నందతాండాలో రూ. 12 లక్షలతో పూర్తి చేసిన అంతర్గత సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం గరిమెళ్ళపాడులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, మురుగు కాలువల పనులను ప్రారంభించి ప్రజల వినియోగానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి, పొదుపు సమాఖ్యల నిర్వహణకు వీవో భవనాలు ఎంతో కీలకంగా ఉపయోగపడతాయన్నారు. బస్తీలు, కాలనీల్లో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణంతో స్థానిక పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతృప్తికరమన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారిస్తూ పల్లె, పట్టణ ప్రగతికి తోడ్పాటునందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, తహసీల్దార్ నాగరాజు, ఎంపిపో సంధ్య, పిఆర్ డీఈ నాగేందర్, ఏఈ నవీన్ కుమార్, ఏపీఎం సిసి రమాదేవి, నాయకులు నీడలా సుధాకర్, మన్నెం వెంకన్న, సర్పంచ్ సీతారాములు, సర్పంచ్ వాడే రాములు, జగదాంబ, గుగులోత్ నగేష్, రమేష్, అంకుష్, రవి, తాజుద్దీన్, నవీన్, ఉదయ్, తూముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో మంత్రి ఉత్తమ్ పర్యటన

- అభివృద్ధి పనుల పరిశీలనలో ఉత్తమ్
- కోదాడ అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

కోదాడ, నవంబర్ 11 (జనం సాక్షి) : కోదాడ పట్టణములో వివిధ అభివృద్ధి పనులను బుధవారం రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖ నూతన భవన నిర్మాణ పనులను, రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆర్ అండ్ బీ శాఖ నూతన భవన నిర్మాణ పనులను మరియు షాదీఖానా నిర్మాణ పనులను అధికారులు, గుత్తందారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి భవన నిర్మాణాలను మంచి క్వాలిటీతో, నూతన ఆర్కిటెక్చర్ డిజైన్లతో పట్టణానికి అందం వచ్చే విధంగా నిర్మాణం చేపట్టాలని త్వరలో పనులు పూర్తిచేసి ప్రారంభించుటకు సిద్ధం చేయాలని గుత్తందారులను ఆదేశించారు ఈ కార్యక్రమం లో నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నర్సింహా, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పరిశీలన



కోదాడ మండలం రెడ్లకుంట వద్ద పాలేరు వాగు పై నిర్మిస్తున్న రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను బుధవారం రాష్ట్ర పౌర సరఫరాలు మరియు నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా కాలువ పనులను, అండర్ గ్రౌండ్ మోటర్ లను, సబ్ స్టేషన్ పనులను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఇరిగేషన్ సీఇ నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో రహస్య సర్వేపై వివాదం

- అసైన్డ్ భూములపై రాజకీయ జోక్యమా
- సర్వే నంబర్ 92లో ఏం జరుగుతోంది..?
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.. రైతుల డిమాండ్
- ప్రైవేట్ సర్వేను అడ్డుకున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 11 (జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మునిదేవునిపల్లి సర్వే నంబర్ 92లో అసైన్డ్ భూముల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. టీజీఐఐసీ పరిశ్రమల కోసం ప్రభుత్వం సేకరించిన భూములకు రైతులకు పూర్తి పరిహారం అందకముందే ప్రైవేట్ వ్యక్తులతో సర్వే నిర్వహించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సర్వే చేపట్టడాన్ని నిరసిస్తూ రైతులు, బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జరగాల్సిన సర్వేను ప్రైవేట్ వ్యక్తులతో ఎందుకు నిర్వహిస్తున్నారని రైతులు ప్రశ్నించారు. సర్వేకు అనుమతులు ఎవరిచ్చారు? అధికారిక ఆదేశాలు ఉన్నాయా? రైతులకు పూర్తి పరిహారం చెల్లించారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అధికారులపై రాజకీయ ఒత్తిళ్ల ఆరోపణలు



మండలంలోని వివిధ శాఖల వ్యవహారాల్లో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్ణయాల వెనుక రాజకీయ ఒత్తిళ్లున్నాయా? మండలంలో అధికారుల పాలన సాగుతోందా? రాజకీయ నాయకుల జోక్యం పెరిగిందా? అన్న చర్చ స్థానికంగా సాగుతోంది.

కలెక్టర్ విచారణకు రైతుల డిమాండ్

సర్వే నంబర్ 92లో నిర్వహించిన ప్రైవేట్ సర్వేపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సర్వే అనుమతులు, భూసేకరణ రికార్డులు, పరిహారం చెల్లింపుల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులకు న్యాయం జరిగేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైస్ మిల్లులో పనిచేసే బీహార్ కార్మికుడు ఉరివేసుకుని మృతి

నేరేడుచర్ల, నవంబర్ 11 (జనంసాక్షి) : మండలంలోని దిర్శించర్ల గ్రామ పరిధిలో ఉన్న సాయి హనుమాన్ రైస్ మిల్లులో హమాలీగా పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన రామ్ దయాల్ కుమార్ (26) మంగళవారం రాత్రి ఉరి వేసుకుని మృతి చెందినట్లు నేరేడుచర్ల ఎస్ ఐ గోపాల్ రెడ్డి తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం రామ్ దయాల్ కుమార్ కొంతకాలంగా కుటుంబ కలహాలతో ఇబ్బందులు పడుతున్నాడని, ఈ క్రమంలో మంగళవారం రాత్రి బీహార్‌లో ఉన్న తన బంధువులు ఫోన్ చేయగా,వారితో ఫోన్‌లో వాగ్వాదం జరిగినట్లు తెలిసింది.అనంతరం రాత్రి 10 గంటల సమయంలో అతను కనిపించకపోవడంతో తోటి బీహార్ కార్మికులు మిల్లు పరిసరాల్లో వెతికారు.ఈ క్రమంలో మిల్లు పక్కనే ఉన్న పొలంలోని కంపచెట్టుకు ఎర్రటి వస్త్రంతో ఉరివేసుకున్న స్థితిలో రామ్ దయాల్ కుమార్ కనిపించాడు.108 అంబులెన్స్‌లో రామ్ దయాల్ కుమార్‌ను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.మృతుడి బాబాయి సుదీర్ మాతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమీన్‌పూర్‌లో ఘనంగా సదర్ ఉత్సవాలు



అమీన్‌పూర్, నవంబర్ 10 (జనం సాక్షి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలను అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక రాగం బ్రదర్స్, మెండే కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనాలకు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాట సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దున్నపోతులను అందంగా అలంకరించి నిర్వహించిన ప్రదర్శనలు, వాటితో చేయించిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాన్ని తిలకించేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన సదర్ వేడుకతో అమీన్‌పూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. దున్నపోతుల విన్యాసాలను చూసేందుకు చిన్నాపెద్దా ఆసక్తి చూపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి రమేష్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు కొల్లూరి గోపాల్, దాసు యాదవ్, కొల్లూరు యాదగిరి, ఐలాపూర్ నర్సింగరావు, తలారి నవీన్, అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు, యాదవ సంఘాల ప్రతినిధులు, యువకులు, మహిళలు పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



జడ్చర్ల, నవంబర్ 11 (జనంసాక్షి) : జర్నలిస్టులు నిరంతరం వృత్తిపరమైన బాధ్యతల్లో నిమగ్నమై ఉంటారని, అయితే వృత్తితో పాటు తమ సొంత ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని జడ్చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కృష్ణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఇతెమాద్ దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ మల్లా షహాబుద్దీన్ ఆకస్మిక మృతి పట్ల బుధవారం జడ్చర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద షహాబుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జర్నలిస్టులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. అనంతరం అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టులు ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతిరోజూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మహమ్మద్ అబ్దుల్ సత్తార్ ఆశిక్ (ఇతెమాద్), అబ్దుల్ కరీం, శ్రీధర్, గోనెల నరేందర్, రఘు, శేఖర్, నిస్సార్, జమీర్, ఇంతియాజ్ చిష్తీ, చెన్నయ్య, దాసు, రాఘవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర గురుకులంలో అర్ధరాత్రి విద్యార్థుల ఘర్షణ..

- రోడ్డుపై కొట్టుకుంటున్న వీడియో వైరల్
- భద్రతా లోపాలపై ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ సమాధానం చెప్పాలి
- స్థానికులు, తల్లిదండ్రుల ఆగ్రహం



పెద్దవూర, నవంబర్ 11 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థుల భద్రత తీవ్ర ప్రశ్నార్థకంగా మారింది. అర్ధరాత్రి వేళ గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు విద్యా సంస్థ ప్రాంగణాన్ని దాటి బయటకు వచ్చి, పెద్దవూర టౌన్ రోడ్లపైకి చేరుకుని పరస్పరం భౌతిక దాడులకు దిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. విద్యార్థులు రోడ్డుపై కొట్టుకుంటున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో గురుకులాల్లో భద్రతా ఏర్పాట్లపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సిబ్బంది పర్యవేక్షణ ఏది..?

క్రమశిక్షణకు, నాణ్యమైన విద్యకు నిలయాలుగా భావించే గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు అర్ధరాత్రి వేళ అంత సులువుగా బయటకు ఎలా రాగలిగారనేది యక్షప్రశ్నగా మారింది. రాత్రి వేళల్లో విద్యార్థుల కదలికలను పర్యవేక్షించాల్సిన వార్డెన్, రాత్రి కాపలాదారులు (సెక్యూరిటీ సిబ్బంది) ఆ సమయంలో ఏం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు చెడు అలవాట్లకు, వ్యసనాలకు బానిసలై ఘర్షణలకు దిగుతున్నారా? వారికి క్రమశిక్షణ, కౌన్సెలింగ్ తరగతులు నిర్వహిస్తున్నారా లేదా? అన్న కోణంలోనూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆందోళనలో తల్లిదండ్రులు.. స్పందించాల్సిన అధికారులు

తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో స్థిరపడతారని ఆశతో గురుకులాల్లో చేర్పించిన తల్లిదండ్రులు ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో విద్యార్థులకు ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగి ప్రమాదం సంభవిస్తే దానికి బాధ్యత ఎవరిదని తల్లిదండ్రులు, స్థానికులు నిలదీస్తున్నారు.
ఈ ఘటనపై సంబంధిత ఎంఈఓ, గురుకుల విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గురుకులాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థి సంఘాలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది రైతులకు లబ్ధి

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



సూర్యాపేట, నవంబర్ 11 (జనంసాక్షి) : పాలకవీడు ప్రాంత రైతుల సాగునీటి కష్టాలకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతో పరిష్కారం లభించనుందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.తాను చేపట్టిన పనుల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలే అత్యంత సంతృప్తినిస్తున్నాయని పేర్కొన్నారు.బుధవారం 400 కోట్ల రూపాయల ఖర్చుతో కృష్ణా నదిపై నిర్మిస్తున్న జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణా, మూసీ నదుల ఆధారంగా ఎత్తిపోతల పథకాలు చేపడుతున్నామని తెలిపారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ పథకాలతో మూడు పంటలకు నీరందించే అవకాశం ఉంటుందని చెప్పారు.జాన్‌పహాడ్ లిఫ్ట్ పనులను జనవరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.గతంలో ఎంతో మంది ప్రజాప్రతినిధులు పని చేసిన ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు పరిష్కారం లభించలేదని, ప్రస్తుతం చేపడుతున్న పనులతో రైతుల చిరకాల స్వప్నం నెరవేరుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, మాజీ జడ్పీటీసీ మాలోత్ మోతీలాల్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
12.11.2026

తాటిచెట్టు నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి



బోయిన్‌పల్లి (జనంసాక్షి): బోయినపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన పల్లెర్ల పెద్ద నారాయణ (58) తాటిచెట్టు ఎక్కి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు.రోజువారీ వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కిన ఆయన ప్రమాదవశాత్తు జారి మొద్దుకు గుద్దుకుని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామంలో విషాదం నెలకొంది.మృతుడు తన కుటుంబాన్ని గీత వృత్తిపైనే పోషించేవాడని గ్రామస్తులు తెలిపారు. ఆయన మృతితో కుటుంబం దిక్కులేనిదైందని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గౌడ సంఘ నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ నాయకుడు

కేంద్ర మంత్రి బండి పరామర్శ



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన కరీంనగర్ జిల్లా గంగిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు అంబటి తిరుపతి రాజును కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. గంగిపల్లి నుంచి కరీంనగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మానకొండూర్ చెరువు కట్ట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తిరుపతి రాజు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలిసిన వెంటనే కేంద్ర మంత్రి ఆయనకు ఫోన్ చేసి ప్రమాద వివ రాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరీంనగర్‌లో తన అధికారిక కార్యక్రమాలు పూర్తయిన వెంటనే బండి సంజయ్ నేరుగా తిరుపతి రాజు ఇంటికి వెళ్లారు. ఆయనను పరామర్శించి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఏమాత్రం అధైర్యపడవద్దని, పూర్తి అండగా ఉంటామని భరోసా ఇస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కరీంనగర్ కార్పొరేటర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపెల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి, రంగు భాస్కరా చారి, గంగిపల్లి గ్రామ సర్పంచ్ వాల ప్రదీప్ రావు, మాజీ ఎంపీటీసీ నాగయ్య, దూలం కిరణ్, చిట్యాల లక్ష్మయ్య, రావుల శ్రీనివాస్, రంగు శ్రీనివాస్, తిక్క దేవేందర్, రావుల వెంకటరాజం, ముల్కల శ్రీనివాస్, పిట్టల ఆంజనేయులు, ఎనగందుల సంపత్, కాట సంపత్, కాట శంకర్ తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూమ్‌ను ప్రారంభించిన మేయర్



కరీంనగర్ టౌన్, నవంబర్ 11, (జనంసాక్షి): పర్యావరణ పరిరక్షణకు, పెరుగుతున్న పెట్రోల్ ధరలకు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.కరీంనగర్ చింతకుంటలో కొత్తపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన వీఆర్ఆర్ ఎంటర్ప్రైజెస్ నూతన ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూమ్‌ను బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.షోరూమ్ నిర్వాహకుడు జగదీశ్వరాచారి మాట్లాడుతూ, నాణ్యత, పనితీరు, వినియోగదారులకు అందించే సేవలను పరిశీలించిన అనంతరం ఈ కంపెనీని ఎంపిక చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా తమ కంపెనీ స్టోర్లు ఉన్నాయని, నాణ్యమైన ఎలక్ట్రిక్ స్కూటర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. పెట్రోల్ వాహనాల వినియోగాన్ని తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వమే సేకరించిన భూమికి
మళ్లీ రిజిస్ట్రేషన్



ఎన్ఎస్పీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్.. ఐదుగురి అరెస్టు

- తప్పుడు పత్రాలతో 9.16 ఎకరాల భూమి విక్రయం
- రూ.1.30 కోట్లకు బేరం.. తహశీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్
- కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడి



హుజూర్‌నగర్, నవంబర్ 11 (జనంసాక్షి) : నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) కాలువ నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలోనే సేకరించి పరిహారం చెల్లించిన భూములను తిరిగి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన వ్యవహారంలో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మొత్తం ఆరు గురిపై కేసు నమోదు చేసినట్లు కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.బుధవారం హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మేళ్ల చెర్వు గ్రామానికి చెందిన బోనగిరి సామ్రాజమ్మ తండ్రి భువనగిరి వెంకట నర్సయ్యకు గతంలో హుజూర్‌నగర్, మేళ్లచెర్వు తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు ఉండేవి. 1971లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 458లో ఉన్న భూమిని ప్రభుత్వం భూసేకరణ చట్టం ప్రకారం సేకరించి పరిహారం చెల్లించింది.అయితే రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి ఎన్ఎస్పీ కాలువ భూమిగా నమోదు కాకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమ రిజిస్ట్రేషన్‌కు పథకం రచించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సామ్రాజమ్మకు చెందిన భూముల వివరాలను పరిశీలించిన పసుపులేటి రామారావు ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు డీఎస్పీ తెలిపారు.హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 458/ం3/3లో 9 ఎకరాల 16 గుంటల భూమి సామ్రాజమ్మ పేరుపై పట్టా ఉన్నట్లు గుర్తించారు. వాస్తవానికి ఆ భూమిని ప్రభుత్వం ఎప్పుడో ఎన్ఎస్పీ కాలువ నిర్మాణం కోసం సేకరించినప్పటికీ, రికార్డుల్లో ఆమె పేరు కొనసాగుతుండటంతో విక్రయానికి రంగం సిద్ధం చేశారు.ఈ క్రమంలో జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కన్నె కొండల్‌రావు, బేత వెంకట్‌రెడ్డి, శేషం రవి తదిత రులు భూమి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకు న్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఒప్పంద పత్రాలను చూపించి హైదరాబాద్‌కు చెందిన కనుమూరి కళ్యాణ్‌కుమార్‌ను సంప్రదించి రూ.1.50 కోట్ల ఆర్థిక సాయం కోరగా, ఆయన రూ.1.30 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించినట్లు దర్యాప్తులో తేలింది.2026 ఆగస్టు 6న సంబంధిత వ్యక్తులు హుజూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని రెవెన్యూ అధికారులకు తప్పుడు హామీ పత్రాలు సమర్పించారు. అనంతరం కనుమూరి కళ్యాణ్‌కుమార్ పేరుపై భూమిని రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ లావాదేవీలో రూ.1,07,95,089 విలువైన చెక్కును సామ్రాజమ్మ బ్యాంకు ఖాతాలో జమ చేయగా, అందులో నుంచి రామారావు కుమార్తె లావణ్య ఖాతాకు రూ.5 లక్షలు, మరో వ్యక్తికి చెందిన ఖాతాకు రూ.6 లక్షలు బదిలీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంపై హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 255/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 61(2), 318(4), 338, 336(3), 217 రెడ్‌విత్ 3(5) ప్రకారం కేసు నమోదు చేశారు. బోనగిరి సామ్రాజమ్మకు నోటీసులు జారీ చేయగా, పసుపులేటి రామారావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కన్నె కొండల్‌రావు, బేత వెంకట్‌రెడ్డి, శేషం రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీఐ గజ్జి చరమందరాజు, ఎస్ఐలు చలికంటి నరేష్, హనుమాన్ నాయక్, ఏఎస్ఐ జయరాజు, సిబ్బంది భాస్కర్, బానోత్ వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు.



కొనుగోళ్లలో జాప్యం.. రైతు వేదికకు తాళం

వెలిమినేడులో రైతుల ఆగ్రహం



చిట్యాల, నవంబర్ 11 (జనంసాక్షి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం, జాప్యం రైతులకు శాపంగా మారుతోంది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో వరి కోతలు పూర్తిచేసి కల్లాల్లో ధాన్యం పోసి నెల రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్న ధాన్యం కల్లాల్లోనే మొలకెత్తుతుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ధర్నాకు దిగారు. కొనుగోళ్లు చేపట్టే వరకు రైతు వేదికను తెరవనివ్వబోమని స్పష్టం చేస్తూ తాళం వేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రైవేటు వ్యాపారులు ధాన్యాన్ని మంచి ధరకు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నప్పటికీ, వారికి విక్రయించుకునే అవకాశం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. అటు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోలేక, ఇటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్ముకోలేక నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. నెల రోజులుగా కల్లాల్లోనే ధాన్యం నిల్వ ఉండటంతో వాతావరణ పరిస్థితుల ప్రభావానికి ధాన్యం మొలకెత్తుతోందని, దీంతో పంట నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి గిట్టుబాటు ధర అందించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుండా జాప్యం చేస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

భద్రాచలంలో ఎండు గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితుల అరెస్ట్



భద్రాచలం నవంబర్ 11 (జనంసాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 11.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సీహెచ్. శ్రీహరిరావు తన సిబ్బందితో కలిసి బుధవారం కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే మార్గంలోని ఇసుక రీచ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన పల్సర్ ఎన్ఎస్ 200 ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 11.600 కిలోల ఎండు గంజాయి బయటపడింది. మల్కాన్‌గిరి నుంచి సిద్ధిపేటకు గంజాయిని తరలిస్తున్న కాల్వ వెంకటేశ్, కోడూరు సురేశ్‌లను అధికారులు పట్టుకున్నారు. నిందితుల నుంచి గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.6.90 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, కానిస్టేబుళ్లు శివకుమార్, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్, డ్రైవర్ సాయిరామ్ పాల్గొన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 18004252523కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.



బీ-ఫార్మసీలో విద్యార్థికి గోల్డ్‌మెడల్



మెట్‌పల్లి నవంబర్, 11(జనంసాక్షి):జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బీ.ఫార్మసీ)లో ప్రథమ శ్రేణితో ఉత్తీర్ణత సాధించి యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు. మెట్ పల్లి పట్టణంకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ హైదరాబాద్ జేయన్టీయూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. మహ్మద్ ఇమ్రాన్ యూనివర్సిటీ చివరి ఫలితాలలో గోల్డెమెడల్ సాధించడం పట్ల మెట్ పల్లి కి చెందిన విద్యావంతులు, మేధావులు హర్షం వ్యక్తం చేసి ఇమ్రాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి తదుపరి ఉన్నత విద్య కోసం ఫార్మ్-డీ లో ఉచిత సీటు పొందాడు. ఫార్మసి విద్యలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి భవిష్యత్తులో సమాజానికి సేవ చేయాలని ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు ఆకాంక్షించారు.

కాంగ్రెస్ నాయకుడిపై విప్ ఆది శ్రీనివాస్‌కు ఫిర్యాదు



మేడిపల్లి నవంబర్ 11 (జనంసాక్షి): జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో విలువైన ఎనిమిది గుంటల వ్యవసాయ భూమిని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అక్రమంగా ఆక్రమించుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన నోముల నరసింహారెడ్డి ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు ఫిర్యాదు చేశారు.. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం,కట్లకుంట గ్రామ ఉప సర్పంచ్ గడ్డం జలంధర్ రెడ్డి,గడ్డం లింగారెడ్డి లు తమ భూమిలోకి అక్రమంగా చొరబడి దౌర్జన్యం చేస్తున్నారనీ వాపోయారు.. ఇట్టి విషయం పై ప్రశ్నించడానికి వెళ్లగా.. గడ్డం జలంధర్ రెడ్డి,గడ్డం లింగారెడ్డి దౌర్జన్యానికి దిగారని బాధితుడు తెలిపారు.. తాను అధికార పార్టీకి చెందిన వ్యక్తిని, ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రధాన అనుచరుడినని చెప్పుకుంటూ.. మరోసారి ఇటువైపు వస్తే నీ అంతు చూస్తారని బెదిరించడం జరిగిందనీ.. గత ఆరు నెలల నుండి వీరి వేధింపులు ఎక్కువయ్యాయని.. వారి నుండి ప్రాణహాని ఉన్నందున.. ప్రత్యేక చొరవ తీసుకొని తమ కుటుంబానికి రక్షణ కల్పించి.. న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసినట్లు నరసింహారెడ్డి తెలిపారు.

కోరెంలో దొంగతనం

21 గ్రాములకుపైగా బంగారం అపహరణ



బోయినపల్లి నవంబర్ 11 (జనంసాక్షి): బోయినపల్లి మండలం కోరెం గ్రామంలో దొంగలు ఓ ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలను అపహరించారు. గ్రామానికి చెందిన వెంకటరమణ (43) కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 8వ తేదీ రాత్రి బంధువుల ఇంటికి వెళ్లారు. 10వ తేదీ ఉదయం 8 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు.గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి పైభాగం నుంచి లోపలికి ప్రవేశించి బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన వాటిలో సుమారు 12 గ్రాముల బంగారు చైన్, 5.5 గ్రాముల ఉంగరం, 3.6 గ్రాముల మరో చైన్ ఉన్నాయి. మొత్తం సుమారు 21.1 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్లు బాధితుడు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బోయినపల్లి ఎస్ఐ రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగలను గుర్తించి ఆభరణాలను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.

ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో తలుపులు, కిటికీలు, ఇంటి పైభాగాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

హాస్టల్ ఉద్యోగుల సమస్య పరిష్కరించాలి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనంసాక్షి:తెలంగాణ విశ్వవిద్యాలయంలో చాలా సంవత్సరాల నుండి యూనివర్సిటీ ప్రారంభం నుండి చాలీచాలని జీతంతో శ్రమ దోపిడీకి గురి అవుతూ యూనివర్సిటీ అభివృద్ధి కోసం తాము కృషి చేస్తున్నామని అలాగే యూనివర్సిటీ ప్రారంభం కోసం తమ విలువైన భూములు ఇచ్చిన కూడా వారికి ఎలాంటి న్యాయం జరగడం లేదు అని మెయిన్ క్యాంపస్ మొత్తం మూడు హాస్టల్ సిబ్బంది సెక్యూరిటీ గార్డ్స్ అందరూ కలిసి వైస్ ఛాన్సలర్ కి తమ సమస్య పరిష్కరించాలని చాలా రోజుల నుండి అధికారుల చుట్టూ తిరిగిన ఎవరు కూడా తమకు న్యాయం చేయడం లేదని సండే, పబ్లిక్ హాలిడే లో కూడా పనిచేస్తున్న తమ సమస్యలు మాత్రం అలాగే ఉంటుందని ఏ అధికారులు కూడా తమ సమస్య పరిష్కరించడం లేదు అని వీ?సి కి విన్నవించడం జరిగింది.అలాగే చాలా సంవత్సరాల నుండి తాము ఒకే చోట పనిచేస్తున్న కూడా ఎలాంటి ప్రమోషన్ లేదని, జీతాలు పెంచుతామని చెప్పినా కూడా అధికారులు తమకు న్యాయం చేయడం లేదన్నారు.ఈ విషయంపై వైస్ ఛాన్సెలర్ స్పందిస్తూ తమకు ప్రభుత్వం నుండి జీతాలు పెరిగే విధంగా చోరోవ చూపుతానని ,అలాగే తమ సమస్యలను జరగబోయే ఈసీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలింగ్ మీటింగ్లో చర్చించి తమకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. హాస్టల్ సిబ్బంది,సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి షూటింగ్‌లో అక్షితకు కాంస్యం

జాతీయస్థాయికి హోంగార్డు కుమార్తె అర్హత



సదాశివనగర్(జనంసాక్షి):రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో సదాశివనగర్ హోంగార్డు పెరమ్ స్వామి కుమార్తె పెరమ్ అక్షిత ప్రతిభ చాటింది. 70వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ విజయంతో కామారెడ్డి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న పెరమ్ స్వామి (హెచ్‌జీ నంబర్ 530) తన కుమార్తెలోని క్రీడా ప్రతిభను గుర్తించి నిరంతరం ప్రోత్సహించారు. తండ్రి ప్రోత్సాహం, అక్షిత కఠోర సాధన, పట్టుదలతో రాష్ట్రస్థాయిలో పతకం సాధించడం విశేషం.ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ అక్షితను, ఆమె తండ్రి పెరమ్ స్వామిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారు ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎస్పీ పేర్కొన్నారు.అక్షిత విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించి తల్లిదండ్రులకు, కామారెడ్డి జిల్లాకు, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. నరసింహారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 11 జనంసాక్షి: తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్, నాన్ జాయినింగ్, ఎగ్జిస్టింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్.ఏ.పున్నయ్య, కోశాధికారి డా నాగరాజు, కార్యదర్శి డా నీలిమ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ డా పాత నాగరాజు,డా లక్ష్మణ చక్రవర్తి డా బాలకిషన్, డా మహేందర్ రెడ్డి, డా. ధరావత్ నాగరాజులు తెలంగాణ యూనివర్సిటీ వి. సి ప్రొఫెసర్.టి. యాదగిరిరావు మరియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి కి వినతి పత్రం అందించారు.అనంతరం అధ్యక్షులు డాక్టర్ పున్నయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ స్థాయిలలో పెద్ద సంఖ్యలో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల బోధన, పరిశోధన, విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.విద్యార్థుల సంఖ్య, పరిశోధనా కార్యక్రమాలు, నూతన అధ్యయన విభాగాలు, అధ్యాపకుల పనిభారం ఆధారంగా ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ , జఉఅ నిబంధనల ప్రకారం అన్ని ఖాళీలను పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగానియామక ప్రక్రియకు నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించి, భర్తీ చేసి ఉన్నత విద్యారంగాన్ని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పని సామర్థ్యం, పరిశోధన కార్యకలాపాలు, విద్యా నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు యూ. జీ.సీ. నిబంధనలకు లోబడి సెంట్రల్ యూనివర్సిటీ మాదిరిగా అన్ని విశ్వవిద్యాలయాల్లో ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యం.. విద్యా ప్రమాణాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- పేదలకు మెరుగైన వైద్యం.. ప్రభుత్వ పథకాల అమలు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- పారిశుద్ధ్యం, రోగులకు ఆహారంపై ప్రత్యేక పర్యవేక్షణ
- పరాక్ మూల్యాంకనంలో తెలంగాణకు ఉన్నత స్థానం రావాలి
- 25 అంశాలతో అభ్యసన దీపిక.. సొంత ఖర్చులతో ముద్రించిన హెచ్ఎం



పెద్దపల్లి, నవంబర్ 11 (జనంసాక్షి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జాతీయ స్థాయి మూల్యాంకనాలకు సిద్ధం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఓపీ వార్డులు, లేబర్ రూమ్, క్యాజువాలిటీ, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ విభాగాలను పరిశీలించి వైద్య సేవలు, సదుపాయాలపై ఆరా తీశారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వంటశాల, వార్డులు, మరుగుదొడ్లు, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. పేద రోగులకు ప్రభుత్వ వైద్య పథకాల ప్రయోజనాలు సకాలంలో అందించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

అనంతరం ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సముద్రాల వంశీ మోహనాచార్యులు రూపొందించిన పరాక్ అభ్యసన దీపిక పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. జాతీయ స్థాయి పరాక్ మూల్యాంకనంలో తెలంగాణ ఉన్నత స్థానం సాధించేలా ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రెండో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరంలో మూడో తరగతి స్థాయిలో ఎదుర్కొనే మూల్యాంకనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక అభ్యసన మాడ్యూల్‌ను రూపొందించారు. కేంద్ర స్థాయి అభ్యసన ప్రమాణాలు, పాఠ్యాంశాలు, గత రెండేళ్ల ప్రశ్నపత్రాలను పరిశీలించి 25 ముఖ్యమైన అంశాలను ఎంపిక చేశారు. ఒక్కో అంశంపై 20 నుంచి 25 ప్రశ్నల చొప్పున వందలాది ప్రశ్నలను రూపొందించి, తన సొంత నిధులతో పుస్తకాన్ని ముద్రించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలోనూ రచ్చపల్లి పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కలెక్టర్ గుర్తుచేశారు. ఉపాధ్యాయులు వినూత్న బోధనా పద్ధతులు, ముందస్తు ప్రణాళికతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. సొంత ఖర్చులతో ప్రత్యేక అభ్యసన దీపిక రూపొందించిన ప్రధానోపాధ్యాయుడి కృషిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ షేక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి పాత్రలనే వాడండి.. వ్యాధులను దూరం చేసుకోండి

తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టీ.కే. శ్రీనివాస్



మంథని, నవంబర్ 11, (జనంసాక్షి) : నేటి సమాజం ప్లాస్టిక్ , అల్యూమినియం తదితర వంట పాత్రలను ఉపయోగించడంతో క్యాన్సర్ వంటి వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని అందుచేత మట్టి పాత్రలను వాడి వ్యాధుల నుండి ప్రజలు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టీ.కే. శ్రీనివాస్ అన్నారు. కుంబార్ స్వశక్తి కరణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామోద్యోగ వికాస్ యోజన పథకం కింద కుమ్మర యువకులకు వృత్తి శిక్షణ ఇచ్చి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునే కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత రావు నాయకత్వంలో పెద్దపల్లి జిల్లా స్థాయిలో మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలో 20 మంది యువకులకు కుమ్మర కులవృత్తి పై శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టి.కే .శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజం ప్లాస్టిక్, అల్యూమినియం తదితర వంట పాత్రలను ఉపయోగించడంతో క్యాన్సర్ వంటి వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని అందుచేత మట్టితో చేసిన వంట పాత్రలను వాడితే క్యాన్సర్ తదితర వ్యాధులు దరి చేరవని సైంటిస్టులు తెలుపుతున్నారని అన్నారు. అందుకే పూర్వీకులు మట్టి పాత్రలను వాడి అనేక వ్యాధుకు ప్రజల దూరంగా ఉండేవారని ప్రస్తుత తరుణంలో ప్లాస్టిక్ ఉపయోగంతో అనేక వ్యాధులకు బారిన ప్రజలు పడుతున్నారని అన్నారు. అందుచేత కుమ్మర కులవృత్తిని కాపాడటంతో పాటు మట్టి పాత్రలతో చేసిన పాత్రలను వాడిన వారికి పలు వ్యాధుల నుండి ఉపశమనం కలుగుతుందని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టి.కే శ్రీనివాస్ అన్నారు. కుమ్మర కులవృత్తి పై శిక్షణ పొందుతున్న యువకులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకొని అధునాతన మట్టి పాత్రలను తయారు చేసి ప్రజలకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆషాడపు లింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కటికనపల్లి రవీందర్, శిక్షణ శిబిరా ఇన్స్ట్రక్టర్ రాతిపల్లి నగేష్, కుమ్మర సంఘం ప్రతినిధులు రేపాక శంకర్ ,రేపాక రాములు కల్వచర్ల రాజేందర్, ఇందారపు రాజు, రేపాక శ్రీనివాస్ ,రేపాక మల్లయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, ఉప్పుల రవీందర్ ,గొల్లపల్లి రవళి, తో పాటు శిక్షణ పొందే కుమ్మర యువకులు పలువురు పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

అధికారులు, జవాన్లతో సమీక్ష : మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 11 (జనంసాక్షి) : వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ లోకేష్ శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డ్ అధికారులు,జవాన్లతో పట్టణ పారిశుద్ధ్యంపై సమీక్ష సమావేశని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి వార్డులో ప్రతిరోజూ చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని, రోడ్లు, మురికి కాలు వలు,బహిరంగ ప్రదేశాల్లో అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించాలని, పట్టణ పరిశుభ్రత కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని,ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రజలు కూడ రోడ్డుపైన చెత్త వెయ్యకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు ఇచ్చి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ప్రజల సహకారం ఉంటేనే పట్టణం కూడా మరింత పరిశుభ్రంగా ఉంటుందన్నారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అయన అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో సానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్,మున్సిపల్ జవాన్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ఆఫీసుల చుట్టూ తిరగొద్దు.. అధికారులే ప్రజల వద్దకు రావాలి

- రాజాపూర్ నిర్వాసితులకు చివరి ఇల్లు వరకు పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇప్పిస్తా
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ భరోసా



రామగిరి, నవంబర్ 11 (జనంసాక్షి): రాజాపూర్ నిర్వాసితులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. రామగిరి మండలంలోని రాజాపూర్ గ్రామాన్ని సందర్శించి నిర్వాసిత కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాపూర్‌లో సుమారు 800 ఇళ్లకు పరిహారం అందాల్సి ఉండగా ఇప్పటివరకు 400 కుటుంబాలకే పరిహారం అందిందని, మిగిలిన కుటుంబాలకు వెంటనే పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. చివరి ఇల్లు ఖాళీ అయ్యే వరకు నిర్వాసితులకు న్యాయం జరిగేలా పోరాడుతానని హామీ ఇచ్చారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజలే ఐక్యంగా నిలబడితే అధికారులే గ్రామానికి వచ్చి సమస్యలు పరిష్కరించేలా ఒత్తిడి తీసుకురావచ్చన్నారు. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కుటుంబానికి మంథనితో ఓటు సంబంధమే తప్ప పేగుబంధం లేదని విమర్శించారు. సింగరేణి సంస్థ భూములు కోల్పోతున్న ప్రజలకు న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.తాను పదవిలో ఉన్నా లేకపోయినా నిర్వాసితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శంకేష్ రవీందర్, పూదరి సత్యనారాయణ గౌడ్, పుల్లల కిరణ్, కలవేన రమేష్, కాదాసి రమేష్, కన్నవేణ శ్రీనివాస్, పాశం ఓదెలు, కామ శ్రీనివాస్, కలవేన సదానందం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేసవి నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

ఆర్జీ-3 జనరల్ మేనేజర్‌కు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం వినతి

రామగిరి, జనం సాక్షి: రాబోయే వేసవిలో బొగ్గు గని కార్మికుల నివాస కాలనీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, అదేవిధంగా కాలనీల్లో కుక్కలు, కోతుల బెడదను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య కోరారు.ఈ మేరకు ఈరోజు ఆర్జీ-3 జనరల్ మేనేజర్ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం (మెమోరాండం) అందజేశారు. వేసవి కాలంలో కార్మిక కుటుంబాలు నీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, కాలనీల్లో కుక్కలు, కోతుల సంచారంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై జనరల్ మేనేజర్ మధుసూదన్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జాయింట్ సెక్రటరీ దేవ శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ సభ్యులు కేశవరావు, పెద్ది స్వామి, డివిజన్ నాయకులు ఎం.డి. షరీఫ్, ఓసీపీ-1 ఫిట్ సెక్రటరీ గిటుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తండాలకు మహర్దశ.. రూ.7.07 కోట్లతో అభివృద్ధి పనులు

- బీటీ రోడ్డు, బ్రిడ్జి, సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన
- మంత్రి అడ్లూరి, విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభం
- రవాణా సమస్యలకు త్వరలో పరిష్కారం
- పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



రుద్రంగి, నవంబర్ 11 (జనంసాక్షి): రుద్రంగి మండలంలోని తండాల రవాణా సమస్యల పరిష్కారానికి రూ.7.07 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. రుద్రంగి మండల కేంద్రం నుంచి కుక్కలగండి తండా వరకు ట్రైబల్ వెల్ఫేర్ నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు, దసరా నాయక్ తండా వద్ద బ్రిడ్జి, సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. కుక్కలగండి తండా రహదారి నిర్మాణానికి రూ.4.57 కోట్లు, దసరా నాయక్ తండా బ్రిడ్జి, సీసీ రోడ్డు పనులకు రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు పూర్తయితే తండా ప్రజలకు ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురవుతున్న రవాణా ఇబ్బందులు తొలగనున్నాయి.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, తండాను అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. రుద్రంగి మండలంలో పెండింగ్‌లో ఉన్న రహదారుల పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాలికి గాయం కావడంతో ఆది శ్రీనివాస్ చికిత్స నిమిత్తం వేములవాడకు వెళ్లారు.కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగర్వాల్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నటరాజ్, ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రం గంగా నరసయ్య, సర్పంచ్ గండి నారాయణ, ఉపసర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. స్థానిక డీఎస్పీ, సీఐ, ఎస్సై మోతిరామ్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చూపిన ధ్యాన మార్గం ప్రతి ఒక్కరూ ఆచరించాలి


నాగార్జున డెయిరీ అధినేత పుల్లూరి ప్రభాకర్ రావు



హుజూరాబాద్, (జనంసాక్షి) : ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చూపి న ధ్యాన మార్గం, ఆధ్యాత్మిక చింతన, మాన వతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని నాగార్జున డెయిరీ అధినేత పుల్లూరి ప్రభాకర్ రావు కోరారు. పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటీస్ మూవ్మెంట్ స్థాపకుడు, ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో యోగా గురువు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పుల్లూరి ప్రభాకర్ రావు మాట్లాడుతూ... విద్యార్థులకు ధ్యానం యొక్క ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిరోజూ కొంత సమయం ధ్యానానికి కేటాయించడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని వివరించారు. ధ్యానం విద్యార్థులలో సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు ఒత్తిడిని తగ్గించేందుకు దోహదపడుతుందని ఆయన సూచించారు. బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చూపిన ధ్యాన మార్గం, ఆధ్యాత్మిక చింతన, మానవతా విలువల ను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే ధ్యానాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కౌన్సిలర్లు రవీందర్ రావు, తాళ్లపల్లి రమేష్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండాల్ రెడ్డి, చెల్పూర్ గ్రామ సర్పంచ్ వంతడుపుల కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కాలికి గాయం





రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాలికి బుధవారం గాయమైంది. వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండల కేంద్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన ప్రమాదవశాత్తు అక్కడ పడి ఉన్న ఫ్లెక్సీ బాండ్‌పై డబ్బాపై ఎడమ కాలు వేయగా బాండ్‌కు ఉన్న గమ్ పాదానికి అంటుకోవడంతో అరికాలి పైపొర (చర్మం) ఊడిపోయి గాయమైంది. వెంటనే ఆయన వేములవాడ పట్టణంలోని ఆనందరెడ్డి ఆసుపత్రికి వెళ్లి చికిత్సపొందుతున్నారు. సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకొని ఆదిని పరామర్శించారు.

విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి


జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఘనంగా జయంతి వేడుకలు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లో కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం.డి. తాజుద్దీన్ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం పెద్దపల్లి రోడ్డు ఫ్లైఓవర్ వద్ద ఉన్న ఆజాద్ విగ్రహానికి వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, ఎం.డి. తాజుద్దీన్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఏ. మోసిన్, పీసీసీ అధికార ప్రతినిధి సిరాజ్ హుస్సేన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, 27వ డివిజన్ అధ్యక్షుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో అహ్మద్‌పురాలోని షాషాబ్ ఉర్దూ మీడియం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్ హాజరై 9, 10 తరగతుల విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఖాన్‌పూర్‌లోని గల్ఫ్ హైస్కూల్‌లోనూ కాంగ్రెస్ మైనారిటీ సెల్ నాయకుడు అహ్మద్ అలీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. విద్యకు దూరంగా ఉన్న వర్గాలకు, ముఖ్యంగా బాలికలకు, ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశంలో అనేక గొప్ప విద్యాసంస్థల ఏర్పాటుకు ఆయన పునాదులు వేశారని ఎం.డి. తాజుద్దీన్ అన్నారు. కార్యక్రమాల్లో కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, ఇక్రమ్, పర్వత మల్లేశం, అబ్దుల్ రెహమాన్, నిహాల్, అమీర్, కంరుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- అంగన్‌వాడీల్లో ప్రతి లబ్ధిదారుని నమోదు చేయాలి : అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- ఆజాద్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం
- ప్రత్యేక ధరలకు నాణ్యమైన బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం




పెద్దపల్లి, నవంబర్ 11 (జనంసాక్షి): జిల్లాలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులకు సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడం, విద్యా రంగంలో మహనీయుల ఆశయాలను కొనసాగించడం, వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

మంగళవారం ఐడీఓసీలో నిర్వహించిన ఐసీడీఎస్ సమీక్షలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, భవన నిర్మాణాలు, చిన్నారుల ఎదుగుదల, పోషకాహార పంపిణీపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ప్రతి గర్భిణి, బాలింతను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు. చిన్నారుల బరువు, ఎత్తును క్రమం తప్పకుండా నమోదు చేస్తూ పోషకాహార లోపం ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక ఆహారం, వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణులకు రక్తహీనత నివారణ, పోషకాహారం, ప్రసవానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని, ప్రీ-స్కూల్ విద్య, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలపై పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు.

అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత విద్యా రంగానికి బలమైన పునాది వేసిన మహనీయుడిగా ఆయన సేవలను కొనియాడారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా 11 ఏళ్లపాటు పనిచేసిన ఆజాద్ విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఐఐటీ, యూజీసీ, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ వంటి సంస్థల ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. 14 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య, మహిళా అక్షరాస్యత, సాంకేతిక విద్య అభివృద్ధిని ఆయన ఆకాంక్షించారని తెలిపారు. విద్యాసంస్థల్లో వివిధ కార్యక్రమాల ద్వారా ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేయాలని సూచించారు. మరోవైపు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని కనకదుర్గ ట్రేడర్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన బియ్యాన్ని ప్రత్యేక ధరలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రంలో బీపీటీ, కేఎన్ఎం, ఎంఆర్‌పీ రకాల బియ్యం కిలో రూ.66కు, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74కు, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాలు రూ.79కు విక్రయించనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో జిల్లా మైనారిటీ అధికారి జి. రవికుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి కె. శ్రీనాథ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సీడీపీఓలు అనిత, అలేఖ్య, సంపద కుమారి, పుష్పలత తదితర అధికారులు పాల్గొన్నారు.

గిరిజన తండాల అభివృద్ధికి రూ.19 కోట్లకు పైగా నిధులు

- రూ.13.10 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వానికి రెండు కళ్లు
- ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు లబ్ధి: మంత్రి అడ్లూరి
- పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలి



కథలాపూర్, నవంబర్ 11 (జనంసాక్షి): గిరిజన తండాలు, గూడాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.19 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి కథలాపూర్ మండలంలో రూ.13.10 కోట్లతో చేపట్టనున్న నాలుగు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. భూషణరావుపేట నుంచి కోనాపూర్ వాసం గుట్ట తండాకు రూ.1.20 కోట్లు, భూషణరావుపేట కండ్లబాట నుంచి రాజారాం తండాకు రూ.3.60 కోట్లు, ఇప్పపల్లి నుంచి తండాకు రూ.3 కోట్లు, కలికోట ప్రధాన రహదారి నుంచి పోతారం లొంక రామన్న తండాకు రూ.5.30 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వివరించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు సమకూరుస్తున్నామని, ఆర్టికల్ 275(1) కింద కేంద్ర నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించి నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేములవాడ నియోజకవర్గంలో సుమారు 3,500 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మరో విడతలో 2,000 ఇళ్లు కేటాయించామని మంత్రి తెలిపారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, వేములవాడలో 30 ఎకరాల్లో రూ.200 కోట్లతో పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ నేతలు వ్యక్తిగత విమర్శలు మానుకొని గత పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి, కోనరావుపేట మండలాల్లోనూ రహదారులు, వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల రైతులకు ప్రయోజనం చేకూర్చే కలికోట సూరమ్మ ప్రాజెక్టు భూసేకరణకు రూ.80 కోట్లకు పైగా కేటాయించామని, పనులు 75 శాతం పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన పనులను వేగవంతం చేసి కాలువల నిర్మాణం చేపడతామని చెప్పారు. గతంలో అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తూ గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి, ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



చేవెళ్ల, నవంబర్ 11 (జనంసాక్షి) : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని గుండాల గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ నక్క బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో రూ.30 లక్షల నిధులతో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను, రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అదేవిధంగా నూతనంగా మంజూరైన రేషన్ షాపును కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు దావల్గారి గోపాల్ రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్లు కేసారం శ్రీనివాస్, పడాల ప్రభాకర్, కుంచం శివ కుమార్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ రీసర్వేను నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**
- **రాందాస్‌పల్లిలో భూ రీసర్వే ప్రక్రియ పరిశీలన**

రంగారెడ్డి, నవంబర్ 11 (జనంసాక్షి) : భూ రీసర్వే ప్రక్రియలో ప్రతి రైతుకు సంబంధించిన భూములను క్షేత్రస్థాయిలో కచ్చితంగా గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం రాందాస్‌పల్లి గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ తీరును, రైతుల భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతుకు చెందిన భూమి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించి, భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వే నిర్వహణకు కనీసం 24 గంటల ముందుగానే సంబంధిత గ్రామంలోని పట్టాదారులకు నోటీసులు అందించాలని స్పష్టం చేశారు. ఏ రోజు, ఏ సమయంలో, ఏ ప్రాంతంలో సర్వే నిర్వహించనున్నారనే వివరాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. నోటీసులు అందించిన వివరాలను రికార్డుల్లో



నమోదు చేయాలన్నారు. సర్వేకు హాజరైన రైతులతో పాటు, నోటీసులు అందించినప్పటికీ హాజరుకాని పట్టాదారుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. సర్వే నంబర్ల ప్రాతిపదికన మాత్రమే కాకుండా రైతుల వారీగా భూములను గుర్తించి హద్దులు నిర్ధారించాలని తెలిపారు. ప్రతి రైతుకు చెందిన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చోట ఫ్లాగ్‌లు ఏర్పాటు చేసి, రైతులకు భూమి సరిహద్దులను ప్రత్యక్షంగా చూపిస్తూ వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం భూమి విస్తీర్ణం, సరిహద్దులు, ఇతర వివరాలను కచ్చితంగా నమోదు చేసి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సర్వే వివరాలకు, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలకు మధ్య వ్యత్యాసాలు ఉంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. భూ రీసర్వే ప్రక్రియపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ సర్వేలో ప్రతి అంశాన్ని పారదర్శకంగా వివరించాలని సూచించారు. సర్వే బృందాలు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు చేరుకుని, సంబంధిత రైతులకు ముందస్తు సమాచారం అందిస్తూ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం, తొందరపాటు నిర్ణయాలు, తప్పిదాలకు ఏమాత్రం తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. భూ రీసర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ సునీత, సర్వేయర్లు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బియ్యం స్వాహా

- **పవన్ రైస్ మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు**
- **రూ. 18 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి**
- **జిల్లా డీసీఓ వనజాత ఆకస్మిక తనిఖీ**
- **పవన్ రైస్ మిల్లును సీజ్ చేసిన అధికారులు**

ఇబ్రహీంపట్నం, నవంబర్ 11 (జనంసాక్షి) : ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని మార్కెట్లో అమ్ముకొని సొమ్ము చేసుకున్న పవన్ రైస్ మిల్లు అవినీతి భాగోతం బట్టబయలైంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ నుండి మంగళపల్లి వెళ్లే మార్గంలో హెచ్‌పీ పెట్రోల్ పంప్ వెనుక ఉన్న పవన్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లుపై బుధవారం జిల్లా పౌర సరఫరాల అధికారిణి (డిఎస్ఓ) వనజాత ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.

1.76 లక్షల బస్తాలు ఎక్కడ..

2022-23 నుండి 2024-25 వరకు మూడు సంవత్సరాలకు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం ప్రభుత్వం కేటాయించిన వరి ధాన్యం నిల్వలపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. లెక్కల ప్రకారం పవన్ రైస్ మిల్లులో 1,76,000 (40 కేజీల) ధాన్యం బస్తాలు ఉండాల్సి ఉండగా, అధికారుల ఆకస్మిక తనిఖీ సందర్భంగా కేవలం 7,600 బస్తాలు మాత్రమే కనిపించాయి. మిగతా భారీ నిల్వలు మాయమైనట్లు అధికారులు గుర్తించారు.

ప్రైవేట్ బ్రాండ్ల పేరిట విక్రయం..

ప్రభుత్వానికి, సివిల్ సప్లై శాఖకు అప్పగించాల్సిన బియ్యాన్ని మిల్లు యజమాని అమిత్ కుమార్ చౌదరి ప్రైవేటు మార్కెట్లో అక్రమంగా విక్రయించినట్లు విచారణలో తేలింది. ప్రభుత్వ ధాన్యాన్ని గజరాజ, హెచ్ఎమ్‌టీ, కర్నూలు సోనా వంటి ప్రైవేట్ రైస్ బ్యాగులలో నింపి మార్కెట్లో అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని అధికారులు నిర్ధారించారు. ఈ అక్రమ మార్గం



ద్వారా పౌర సరఫరాల శాఖకు సుమారు రూ. 18 కోట్ల మేర గండి కొట్టినట్లు ప్రాథమికంగా లెక్కకట్టారు.

క్రిమినల్ కేసు నమోదు.. మిల్లు సీజ్

ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించిన పవన్ ఇండస్ట్రీస్ యజమాని అమిత్ కుమార్ చౌదరిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు డీసీఓ వనజాత తెలిపారు. బియ్యం కుంభకోణానికి పాల్పడిన సదరు మిల్లును సీజ్ చేశామని చెప్పారు. ప్రభుత్వం నుండి స్వాహా చేసిన పూర్తి సొమ్మును రాబట్టేంత వరకు చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పలువురు సివిల్ సప్లై శాఖ అధికారులు పాల్గొన్నారు.

సంగాల రిజర్వాయర్‌లో విషాదం

దరూరు, నవంబరు 11 (జనం సాక్షి) : ధరూర్ మండలం సంగాల రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు గల్లంతయ్యాడు. గద్వాల పట్టణానికి చెందిన వెంకటేశ్, తన సోదరుడితో కలిసి సంగాల రిజర్వాయర్‌కు చేపలు పట్టడానికి వెళ్లారు. రిజర్వాయర్లో లోతైన ప్రాంతంలో వలలో చిక్కి వెంకటేశ్ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, ధరూర్ ఎస్ఐ తారక సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.సోదరుడి కళ్లముందే వెంకటేశ్ నీటిలో మునిగిపోవడంతో అతను తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. చీకటి పడుతుండటంతో సహాయక చర్యలకు కొంత ఆటంకం కలుగుతోంది. రిజర్వాయర్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో గాలింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది. ఘటనా స్థలం వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రైతులకు పెద్ద జీతగాడిలా పనిచేస్తా..

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

వనపర్తి బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి) : తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజల రుణాన్ని అభివృద్ధి పనులతో తీర్చుకుంటానని, నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం ఏదుల రిజర్వాయర్ నుంచి డీ-5 కాలువ ద్వారా ఏదుల, అనంతపురం చెరువులకు నీటిని విడుదల చేశారు. తన సొంత నిధులతో చేపట్టిన పనుల వల్ల చెరువులకు నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు పెద్ద జీతగాడిలా పనిచేస్తానని, సాగునీటి విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఉన్నాయంటూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారికి కమిషన్ల కరువు వచ్చిందని విమర్శించారు. గత పాలకులు ఏదుల గ్రామాన్ని దత్తత తీసుకున్నామని చెప్పినా, బ్యాంకు ఏర్పాటు మినహా అభివృద్ధి చేయలేదన్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పెండింగ్ పరిహారం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అందించామని



పేర్కొన్నారు. ఏదుల, కొంకలపల్లి, బండరావిపాకుల తదితర గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైతులకు పరిహారం ఇవ్వడంలో గతంలో విఫలమైన బీఆర్ఎస్ నేతలకు ఇప్పుడు పరిహారంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రైతుల సంక్షేమం, సాగునీరు, గ్రామాల అభివృద్ధే తన ప్రాధాన్యతలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సత్యశీలారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గీతంలో 5జీ, డ్రోన్ సాంకేతికతలపై అవగాహన

పటాన్‌చెరు, నవంబర్ 11 (జనం సాక్షి) : అధునాతన సాంకేతికలైన 5జీ, డ్రోన్ టెక్నాలజీలపై అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులకు అవగాహన కల్పించడానికి గీతం విశ్వవిద్యాలయం మూడు రోజుల హైబ్రిడ్ కార్యశాలను ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించింది. స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కు చెందిన సీఎస్ఈఎస్ఈ, ఏఐడీఎస్ విభాగాలు దీనిని ఏర్పాటు చేశాయి. 5జీ కమ్యూనికేషన్, మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీలు), కృత్రిమ మేధస్సు (ఏఐ), ఎడ్జ్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఇందులో పాల్గొనేవారికి సమగ్రమైన సైద్ధాంతిక పరిజ్ఞానం, ఆచరణాత్మక అనుభవాన్ని అందించడమే ఈ కార్యశాల లక్ష్యం. ఈ వర్క్ షాపులో 5జీ ఆర్కిటెక్చర్, డ్రోన్ భాగాలు, వ్యవస్థలు, కమ్యూనికేషన్ టెక్నాలజీలు, ఏఐ-ఆధారిత ఆబ్జెక్ట్ డిటెక్షన్, అటానమస్ నావిగేషన్, మిషన్ ప్లానింగ్ వంటి కీలక అంశాలను వివరిస్తూ నిపుణుల నేతృత్వంలో సాంకేతిక కార్యక్రమాలు, హ్యాండ్స్-ఆన్ ప్రదర్శనలు జరిగాయి. ఇది స్మార్ట్ వ్యవసాయం, స్మార్ట్ నగరాలు, విపత్తు నిర్వహణ వంటి అభివృద్ధి చెందుతున్న అనువర్తన రంగాలలో అంతర్ విషయ బోధన, పరిశోధన, ఆవిష్కరణలకు కూడా ప్రాధాన్యతనిచ్చింది.



మూడు రోజుల కార్యశాలలో ఐఐటీడీఎం కర్నూలుకు చెందిన డాక్టర్ ఎం. రవి కుమార్, డాక్టర్ పి. కిషోర్, డాక్టర్ కె. కృష్ణ నాయక్; ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి డాక్టర్ కె. జగదీష్; అహ్మదాబాదులోని ఐఐటీఆర్ఏఎం నుంచి డాక్టర్ అజిత్ కుమార్; బెంగళూరులోని ఐఐఎస్సీ ఆర్ట్ పార్క్ లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ రవిరాజ్ సక్సేనా; చండీగఢ్ లోని పీఈసీ డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ సిమ్రన్ జీత్ సింగ్, విశాఖపట్నంలోని గీతం నుంచి డాక్టర్ ఎన్.వి.ఆర్. స్వరూప్ కుమార్, డాక్టర్ కె. వెంకటేశ్వరరావు వంటి ప్రముఖ వక్తలు విలువైన అంతర్దృష్టులు, నైపుణ్యాలను అందించారు.

ఓఆర్ఆర్‌పై రెండు కార్లు ఢీ..

- **ఐదుగురికి గాయాలు**

రామచంద్రాపురం, నవంబర్ 11 (జనం సాక్షి) : ఔటర్ రింగ్ రోడ్డుపై కొల్లూరు సమీపంలో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. ముత్తంగి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఫార్చునర్ కారు (టి ఎస్ 07 ఎఫ్ జెడ్ 8643) కొల్లూరు సమీపంలో అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుక నుంచి వస్తున్న మారుతి బ్రెజ్జా (టీ ఎస్ 2598) అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బ్రెజ్జాలో ప్రయాణిస్తున్న విట్టల్‌రెడ్డి (47), స్వర్ణలత (37), ప్రసన్న (13), కరుణాకర్‌రెడ్డి (11), వేదాన్ని (9) గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. స్వర్ణలత ఫిర్యాదు మేరకు ఫార్చునర్ కారు డ్రైవర్‌పై కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

- **62 గ్రాముల బంగారం, 110 తులాల వెండి స్వాధీనం**
- **డీఎస్పీ వెంకటేశ్వర్లు**

జడ్చర్ల, నవంబర్ 11 (జనంసాక్షి) : ఊళ్లకు లేదా అంత్యక్రియల కోసం ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని జడ్చర్ల పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కమలాకర్‌తో కలిసి వివరాలను మీడియాకు వెల్లడించారు. నిందితుడి నుంచి 62 గ్రాముల బంగారు ఆభరణాలు, 110 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని ఐదు దొంగతనం కేసులను ఛేదించినట్లు తెలిపారు. మండల పరిధిలోని మల్లెబోయినపల్లి గ్రామంలో జరిగిన దొంగతనం దర్యాప్తులో భాగంగా ఈ చోరీల గుట్టు రట్టయింది. ఈ నెల 10న పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద నాగసాల గ్రామానికి చెందిన బోయ కృష్ణయ్య (70) అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జడ్చర్ల సీఐ కమలాకర్ ఆదేశాలతో ఎస్ఐ మల్లేష్, క్రైమ్ పార్టీ సిబ్బంది విష్ణు, నరసింహరాజు విచారించగా దొంగతనాల వివరాలు వెల్లడయ్యాయి. గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు కుటుంబ సభ్యులు అంత్యక్రియల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లడాన్ని గమనించి, రాత్రి వేళల్లో తాళాలు పగలగొట్టి ఆభరణాలు దొంగిలించేవాడని విచారణలో తెలిసింది. జడ్చర్ల, మిడ్జిల్, భూత్పూర్, తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని 5 కేసుల్లో ఇతనికి ప్రమేయం ఉన్నట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కేసులను చాకచక్యంగా ఛేదించిన ఎస్ఐ మల్లేష్,



క్రైమ్ పార్టీ సిబ్బంది విష్ణు, నరసింహరాజులను అధికారులు అభినందించారు. ఊళ్లకు లేదా అంత్యక్రియలకు వెళ్లేటప్పుడు బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఇంట్లో ఉంచవద్దని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అంత్యక్రియలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి

కొల్చారం, నవంబర్ 11 (జనం సాక్షి) : కొల్చారం మండలంలోని ఎనగాండ్ల గ్రామంలో మంగళవారం కేతి బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, భూసార పరీక్షలు, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాలను సేకరించే విధానం, భూసార పరీక్షల ద్వారా కలిగే ప్రయోజనాలను కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ వివరించారు. పంటల సాగులో పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులను వినియోగిస్తూ నేల సారాన్ని కాపాడుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. వరి కోత అనంతరం మిగిలిన కొయ్యకాళ్లను తగలబెట్టకుండా భూమిలోనే కలియదున్ని సేంద్రియ పదార్థాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే జొన్న, మొక్కజొన్న, శనగ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్, గ్రామ సర్పంచ్ కోరబోయిన లక్ష్మి పెంటయ్య, , ఉపసర్పంచ్ గోపాల్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.



18 ఎకరాల భూమి సమస్యపై దళిత రైతులకు న్యాయం చేయాలి

- **జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

హయత్‌నగర్, నవంబర్ 11 (జనం సాక్షి) : హయత్ నగర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 255/1లో ఉన్న 18 ఎకరాల భూమి సమస్యను పరిష్కరించి, బాధిత దళిత రైతులకు న్యాయం చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. సుమారు 70 సంవత్సరాలుగా ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల భూములను గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పేరుతో స్వాధీనం చేసుకుందని ఆయన తెలిపారు. దీంతో రైతులు తమ భూముల హక్కులకు సంబంధించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించిన వివాదంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, భూమి హక్కులకు సంబంధించిన అంశాలను పరిశీలించి అర్హులైన బాధిత రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత రెవెన్యూ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బాధిత రైతులకు ఎకరానికి 500 గజాల చొప్పున స్థలం కేటాయించే విధంగా నిర్ణయం తీసుకుని, అందుకు సంబంధించి సంతకాలు కూడా సేకరించిందని సుధీర్ రెడ్డి గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత రైతులకు కేవలం 300 గజాల స్థలం మాత్రమే ఇచ్చేలా నిర్ణయించడం సరికాదని అన్నారు. భూములు కోల్పోతున్న బాధిత రైతులకు నష్టపరిహారంగా ఒక్కొక్కరికి 600 గజాల స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సాహెబ్‌నగర్ శ్రీ వెంకటేశ్వర కాలనీ వీకర్ సెక్షన్ పరిధిలోని సర్వే నంబర్ 71/1లో నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల సమస్యను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 58, 59 జీవోల కింద పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో సుమారు 23 మంది 59 జీవో కింద ఒక్కొక్కరు రూ.1,55,000 చొప్పున చెల్లించారని వివరించారు. సంబంధిత రెవెన్యూ అధికారులు స్థలాలను పరిశీలించడంతో పాటు లబ్ధిదారుల జాబితాను కూడా సిద్ధం చేశారని తెలిపారు. అక్కడ దాదాపు 80 గజాల స్థలంలో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇప్పటివరకు



పట్టాలు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు కటేపాక స్మైలాబ్, గంగాని నాగేష్, దుబ్బాక నవీన్, జయ ఈశ్వర్, బోడ శ్రీరాములు, కటేపాక ప్రవీణ్, గంగాని శ్రీను, బోడ శ్రవణ్, గంగాని ప్రవీణ్ తదితరులతో పాటు శ్రీ వెంకటేశ్వర కాలనీ వీకర్ సెక్షన్ మాజీ అధ్యక్షుడు కృష్ణ, బొమ్మడ శీను, రామాచారి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
12 నవంబర్ 2026

త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

హైదరాబాద్‌లో పూర్తవ్వగానే జిల్లాల్లో ఇస్తాం

□ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణల నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రిని కలిసి, ఇటీవల జరిగిన తమ సంఘ రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలతో కూడిన వినతి పత్రాన్ని అందించింది. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ఇటీవల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు చేసిన సానుకూల ప్రకటనపై తమ సంఘ కార్యవర్గ సమావేశం కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఈ ప్రక్రియను వేగవంతం చేసి జర్నలిస్టుల్లో నెలకొన్న ఆందోళనకు తెరదించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్లు విరాహత్ అలీ, రాంనారాయణలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మరో ప్రధాన సమస్య అయిన ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, జర్నలిస్టుల ప్రాణాలకు ప్రభుత్వం భద్రతా కల్పించాలని తమ సంఘం చేసిన తీర్మానాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముందుగా హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, త్వరలోనే ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు చేపడతామని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్ లు ఉన్నారు.

కామారెడ్డి హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం

మూడేళ్ల పాలనలో బీసీలకు తీరని ద్రోహం



□ రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల ధ్వజం

హైదరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) : కామారెడ్డి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం (బీసీఐఎఫ్), బీసీ పొలిటికల్ ఫ్రంట్, బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'కామారెడ్డి హామీలు – దగాపడ్డ బీసీలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ. చిరంజీవులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ కన్వీనర్, మాజీ డీజీపీ పూర్ణచందర్ రావు, మాజీ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ కులాల ఐక్యవేదిక వైర్మన్ చిన్నరాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీ. చిరంజీవులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను ఏ విధంగా తుంగలో తొక్కారో గణాంకాలతో సహా వివరించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీల సంక్షేమం కోసం ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఆ ప్రకారం మూడేళ్లలో రూ.60 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.33 వేల కోట్ల వరకు మాత్రమే కేటాయించిందని, అందులో కూడా సుమారు రూ.6 వేల కోట్లకు మించి ఖర్చు చేయలేదని విమర్శించారు.

కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన 21 హామీల్లో ఒక్క హామీని కూడా అమలు చేయని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ముఖ్యంగా బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని ఒక పెద్ద ప్రహసనంగా మార్చారని, చట్టపరమైన పరిష్కారం చూపకుండా కేంద్ర ప్రభుత్వానికి పంపించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. బీసీలను ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి హక్కులను విస్మరించడం దారుణమన్నారు. మాజీ డీజీపీ పూర్ణచందర్ రావు మాట్లాడుతూ, బీసీలు కేవలం తమ హక్కుల కోసం ఉద్యమాలు చేయడమే కాకుండా, ఎన్నికల రాజకీయాల్లో కూడా ప్రత్యక్షంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎమ్మెల్సీ తదితర ఎన్నికల్లో బీసీలు పెద్ద సంఖ్యలో పోటీ చేయాలని అన్నారు. రాబోయే కాలంలో ఒక బలమైన బీసీ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి, ఆ ఫ్రంట్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు, ప్రదర్శనలు నిర్వహించి బీసీల రాజకీయ చైతన్యాన్ని బలోపేతం చేయాలని సూచించారు. బీసీలకు ఇచ్చిన హామీల అమలు, 42 శాతం రిజర్వేషన్ల సాధన, రాజకీయ ప్రాతినిధ్యం, బీసీల రాజ్యాధికార సాధన కోసం సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరాన్ని ఈ రౌండ్ టేబుల్ సమావేశం నొక్కి చెప్పింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు బీసీల ఐక్యత, హక్కుల సాధన, రాజకీయ చైతన్యంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మాజీ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ బీసీలందరూ కులాలకతీతంగా ఐక్యమై తమ హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటం చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ మాట్లాడుతూ, సమాజంలోని అన్ని రంగాల్లో బీసీలు అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అధిగమించాలంటే బీసీలు సంఘటితమై, సర్దార్ పాపారాయుడు స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.చిన్న రాములు ముదిరాజ్ మాట్లాడుతూ, బీసీలు తమ హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ వాటా సాధించుకోవడానికి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.శ్రీ చామకూర రాజు సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ ఎన్నికలలో ఫోటి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం నాయకులు కర్ణాటి మనోహర్, ఎర్రమాద వెంకన్న, చెన్నా శ్రీకాంత్, లింగేశ్ యాదవ్, కొండల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు దుర్గయ్య గౌడ్, ఐలయ్య, బైరి శేఖర్, ఏలేటి విజయ్ కుమార్, బీసీ లాయర్స్ ఫోరం అధ్యక్షులు పొన్నం దేవరాజ్ గౌడ్ ,కొట్టూరు అశోక్ ,రుద్ర రాజేశం పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన బీసీ నాయకుల్లో మహబూబ్‌నగర్ నుంచి శ్రీ సూదగోని రమేష్, నల్గొండ నుంచి శ్రీ చంద్రశేఖర్, దుబ్బాక నుంచి కూరపాటి బంగారయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హనుమకొండ ప్రతినిధి (జనంసాక్షి) : తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ ఉన్నత విద్యను అభ్యసించి, భవిష్యత్తులో ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ స్ఫూర్తి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమని, అందుకే విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేట బాలుర ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేసిన అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడారు. మహాత్మా గాంధీ ప్రారంభించిన 'యంగ్ ఇండియా' పత్రిక స్ఫూర్తితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రభుత్వం నిర్మిస్తోందని వివరించారు. ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో, అంతర్జాతీయ ప్రమాణాలతో, ఇంగ్లిష్ మీడియంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను రూపొందిస్తున్నామన్నారు. ప్రభుత్వం మరో కీలక కార్యక్రమంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే అందిస్తామని, క్రీడలు, ఇతర కార్యకలాపాల అనంతరం సాయంత్రం విద్యార్థులను ఇంటికి చేర్చుతామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక సదుపాయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యంగ్ ఇండియా స్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలి

□ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

□ నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశం



చిలుకూరు, నవంబర్ 11(జనంసాక్షి): చిలుకూరు మండలంలోని సీతారాంపురం గుట్టలలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత (ఇంటిగ్రేటెడ్) రెసిడెన్షియల్ పాఠశాలలో 2027-28 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కోదాడ, చిలుకూరు ప్రాంతాల్లో చేపడుతున్న పాఠశాలల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా చిలుకూరు గుట్ట ప్రాంతంలో 22 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రాంగణాన్ని మంత్రి సందర్శించారు. అక్కడ జరుగుతున్న బేస్‌మెంట్, పిల్లర్లు, కాంక్రీట్ పనుల పురోగతిని సంబంధిత గుత్తేదారులు (కాంట్రాక్టర్లు), ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి భవన నిర్మాణాన్ని కొలిక్కి తెచ్చి, 2027-28 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం కోదాడలో రూ.50 కోట్ల వ్యయంతో చేపట్టిన నవోదయ పాఠశాల భవన నిర్మాణ పనులను కూడా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. పనుల ప్రగతిని కాంట్రాక్టర్లతో సమీక్షిస్తూ, భవనాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే. నరసింహలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లి, ఇద్దరు చిన్నారులు అదృశ్యం..

రేగోడ్ (జనంసాక్షి) : మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని మర్పల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఇద్దరు కూతుళ్లతో కలిసి అదృశ్యమైంది. ఈ ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లి గ్రామానికి చెందిన మన్నె రేణుక (26) భర్త మరణించడంతో తన ఇద్దరు కూతుళ్లతో కలిసి జోగిపేటలో నివాసం ఉంటోంది. దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 7వ తేదీన మర్పల్లి లోని తన ఇంటికి వచ్చింది. ఈ నెల 9వ తేదీన తన ఇద్దరు కూతుళ్లు నిఖిత (5), నిత్యశ్రీ (3)లతో కలిసి జోగిపేటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే, వారు జోగిపేటకు చేరుకోక పోవడంతో రేణుక మామ కిష్టయ్య, కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి వెతికారు. బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసినప్పటికీ తల్లి, ఇద్దరు చిన్నారుల ఆచూకీ లభించలేదు. దీంతో కిష్టయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అదృశ్యమైన ముగ్గురి కోసం గాలింపు చేపట్టి దర్యాప్తు చేస్తున్నారు.

బిలాంగింగ్ ఏ జర్నీ ఆఫ్ లవ్‌లో ఎన్నో బాధకరమైన వాస్తవాలు

□ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్



హైదరాబాద్ (జనంసాక్షి) : బిలాంగింగ్ ఏ జర్నీ ఆఫ్ లవ్‌లో ఎన్నో బాధకరమైన వాస్తవాలు ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సోనియా గాంధీ రచించిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం మంగళవారం మార్కెట్లోకి విడుదలైందని, పుస్తకంలో తన జీవితంలోని అనుభవాలను వెల్లడించారని తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. విదేశాల్లో పుట్టినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించిన ఆదర్శ మహిళ సోనియా అని, దేశ రాజకీయాలను ఆకళింపు చేసుకుని పార్టీని నడిపిస్తున్న నాయకురాలని, 2004లో ప్రధాని పదవిని త్యజించిన ఘనత ఆమెదని తెలిపారు. మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ఎంపిక చేసిన ఘనత ఆమెదని, త్యాగధనుల కుటుంబానికి కోడలిగా సోనియా గాంధీ ప్రస్థానమని, ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీల మరణాలతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, తన జీవితంలోని విషాదాలను పుస్తకంలో వివరించారని తెలిపారు. సోనియా పుస్తకంపై రాజకీయ విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ సోనియా గాంధీ రచించిన పుస్తకాన్ని చదవాలని సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీహెచ్ఎంసీకి జాతీయ పురస్కారం

□ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు

□ స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) : స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 జాతీయ పురస్కారాల్లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అవార్డును అందుకుంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అవార్డును స్వీకరించారు. ఆయనతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పురస్కారాన్ని అందుకున్నారు. జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీకి ఈ గుర్తింపు లభించడం హైదరాబాద్ నగరానికి గర్వకారణంగా నిలిచింది. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రతను మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన పట్టణ సేవలు అందించేందుకు చేపడుతున్న చర్యలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. నగరాన్ని మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందికి ఈ అవార్డు మరింత ప్రోత్సాహాన్నివ్వనుంది.

సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

కేఎల్ఐ, జూరాల ద్వారా వెంటనే నీళ్లు విడుదల చేయాలి

□ రైతులను ఆదుకోవాలని చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మెరుపు ధర్నా



వనపర్తి బ్యూరో నవంబర్ 11 (జనంసాక్షి) : సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ రైతులకు నీళ్లు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. కేఎల్ఐ, జూరాల ప్రాజెక్టుల ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆయన ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాన్ గల్ రోడ్ లో ఉన్న ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డిలతో కలిసి డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ వెంకట్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టులో సుమారు 50 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ కేఎల్ఐ, పాలమూరు పంపులను నిర్విరామంగా నడపకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దమందడి మండలంలోని ఒక్క గ్రామానికీ సాగునీరు అందలేదని, కేఎల్ఐ కింద ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు తక్షణమే నీళ్లు అందించాలని కోరారు.జూరాల కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయాలని, పాలమూరు పంపులను నడిపి ఏదుల, కర్వెన రిజర్వాయర్లను నీటితో నింపాలని డిమాండ్ చేశారు. కర్ణాటక నుంచి రావాల్సిన నీటిని విడుదల చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆల్మట్టి ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్న నేపథ్యంలో ఈ దిశగా చొరవ చూపాలని సూచించారు. రైతులకు వేగంగా ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతోనే చీఫ్ ఇంజినీర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాగులు, చెరువులు నీటితో కళకళలాడేలా చర్యలు తీసుకున్నామని, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కేఎల్ఐ పంపులను నిరంతరాయంగా నడిపి సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యం వల్లే రైతుల తరఫున ధర్నా చేయాల్సి వస్తోందన్నారు. రామన్నగట్టు రిజర్వాయర్ నిర్మాణం విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదని, కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేఎల్ఐ, జూరాల ద్వారా నీటిని విడుదల చేసి ఉమ్మడి పాలమూరు జిల్లాను కాపాడాలని డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జూరాల, కేఎల్ఐ ద్వారా సాగునీరు అందించి పాలమూరు రైతులను ఆదుకోవాలని కోరారు. గతంలో కేసీఆర్ కృషితో కందూరు వాగును సజీవంగా ఉంచామని, శ్రీశైలం ప్రాజెక్టులోని నీటితో కొత్తకోట మండలాన్ని సస్యశ్యామలం చేసే అవకాశం ఉందన్నారు. గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, నందిమల్ల అశోక్, వామన్ గౌడ్, విశ్వేశ్వర్, ప్రశాంత్, చెన్నకేశ్వర్ రెడ్డి, కమలేశ్వరరావు, సత్యనారాయణ గౌడ్, చంద్రశేఖర్ నాయక్, వీరసాగర్, తిలకేశ్వర్ గౌడ్, హేమంత్ ముదిరాజ్, మెకానిక్ శ్రీను, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ డిజిటల్ సేవలపై అధ్యయనం

భవన నిర్మాణ అనుమతుల విధానంపై థాయ్‌లాండ్ బృందం ఆసక్తి



హైదరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) : పట్టణ పరిపాలన, డిజిటల్ సేవల అమలులో జీహెచ్ఎంసీ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసేందుకు థాయ్‌లాండ్ ప్రతినిధి బృందం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించింది. థాయ్ పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడి సలహాదారు పీంగ్‌పనోర్ బూన్‌క్లమ్, ప్రోగ్రెసివ్ మూవ్‌మెంట్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ తానాథోర్న్ జువాంగ్‌రూంగ్‌రువాంగ్‌కిట్, డైరెక్టర్ కుంతిదా రుంగ్రువాంగ్‌కియాట్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియను సులభతరం చేసేందుకు రూపొందించిన 'బిల్డ్‌నౌ' డిజిటల్ వేదిక పనితీరును వివరించారు. ఒకే వేదిక ద్వారా వివిధ రకాల భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ ఆమోదాలు, బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కుల (టీడీఆర్) సేవలు పొందే విధానాన్ని తెలియజేశారు. దరఖాస్తుల పరిశీలన, అనుమతుల మంజూరులో పారదర్శకత, వేగవంతమైన సేవలు, సులభతర ప్రక్రియ ఈ వేదిక ప్రధాన లక్ష్యాలని వివరించారు. పట్టణ పాలనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు జీహెచ్ఎంసీ చేపడుతున్న కార్యక్రమాలను థాయ్‌లాండ్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ అధికారులు పి. ఉదయ్ కుమార్, రాధిక గుప్తా పాల్గొని డిజిటల్ పాలన కార్యక్రమాలు, పరిపాలనా విధానాలపై వివరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370